అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సోమవారం 29-1 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 31 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

నగదు బదిలీ..!

గ్యాస్ తరహాలో...నగదుగా విద్యుత్ సబ్సిడీ

- ఉత్పత్తి, పంపిణీ, సరఫరాలో డిస్కంల అధికారాలకు కత్తెర
- విద్యుత్‌రంగ పూర్తి ప్రయివేటీకరణే లక్ష్యం
- 2003 విద్యుత్ చట్టానికి సవరణలు
- ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో బిల్లు
- ప్రయోగాత్మకంగా తెలంగాణలో అమలు!

గ్యాస్ సిలిండర్ తరహాలోనే ఇకపై విద్యుత్ సబ్సిడీ సొమ్మును నేరుగా ఆయా వినియోగదారుల ఖాతాలకు జమచేసేలా చట్ట సవరణలకు రూపకల్పన జరుగుతోంది. 2017 విద్యుత్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని ఈనెల 24న కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ ఢిల్లీలో ప్రకటించారు. ఇప్పటికే విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీని పాక్షికంగా ప్రయివేటీకరించిన కేంద్రప్రభుత్వం సవరణ బిల్లు ద్వారా పూర్తి ప్రయివేటీకరణకు మార్గాన్ని సుగమం చేసుకుంటోంది.



- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

విద్యుత్ సరఫరాలో కీలకంగా ఉండే డిస్కంలకు అధికారాల్ని కుదిస్తూ, ప్రయివేటు డిస్కంల ఏర్పాటుకు 2017 విద్యుత్ చట్ట సవరణ బిల్లులో చోటు కల్పించారు. ఇప్పటివరకు ప్రభుత్వరంగ డిస్కంలకు ఉన్న జీవితకాల లైసెన్స్ విధానాన్ని రద్దు చేస్తూ...ఆ స్థానంలో ఐదేండ్లకోసారి లైసెన్స్‌లను పునరుద్ధరించేలా చట్ట సవరణ చేయనున్నారు. ప్రభుత్వరంగంలోని విద్యుత్ సంస్థల మౌలిక సౌకర్యాలన్నింటినీ (ట్రాన్స్‌కో లైన్లు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫారాలు, విద్యుత్ స్తంబాలు వగైరా) అద్దె లేదా లీజుకు ఇచ్చేలా ఈ చట్ట సవరణలో పేర్కొన్నారు. వాటి నిర్వహణను కూడా ప్రయివేటుకే అప్పగించే వెసులుబాటునూ ఈ సవరణల్లో పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వ విద్యుత్ సంస్థలు అన్ని సేవల్ని ప్రయివేటుకి అప్పగించి, వారిచ్చే అద్దెలు, రాయల్టీలు తీసుకొని కాలం వెళ్లదీయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా మిగులు విద్యుత్ అందుబాటులోకి రావడంతో తుది దశ సంస్కరణలకు కేంద్రప్రభుత్వం ...9లో

వ్యక్తి పూజ తగదు

- దేశంలో ఎక్కువగా అసమానత్వం : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



విజయవాడ : 70 ఏండ్ల నుంచి రాజ్యాంగబద్ధంగా నడుస్తున్న ప్రభుత్వాలలో వ్యక్తి పూజకు విపరీతమైన ప్రాధాన్యత ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు.ఏపీ విజయవాడలోని పిబి.సిద్ధార్థా ఆడిటోరియంలో కంతమనేని రవీంద్రరావు మెమోరియల్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం జరిగిన రవీంద్రరావు తృతీయ స్మారకోపన్యాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రవీంద్రరావు మంచి వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన వారని కొనియాడారు. భిన్నమైన అభిప్రాయాలను స్వాగతించి చర్చించే పట్టణం విజయవాడ అని అన్నారు. దేశం, సంఘం జీవన విధానాన్ని రాజ్యాంగం తెలియ జేస్తుందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో అసమా నత్వం ఎక్కువగా ఉందని, దీనికి మతం, కులం, ప్రాంతం, ఆర్థిక పరిస్థితులే కారణమన్నారు. వారసత్వ పరిపాలనా ప్రజాసా మ్యానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. గతంలో తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం ఉందో అందరికీ తెలుసని, జడ్జిని అయిన మరునాడే ఆ పార్టీతో అనుబంధాన్ని వదులుకున్నానని గుర్తు చేశారు. తాను జడ్జి పదవిలోకి వచ్చేటప్పుడు డిక్లరేషన్ ...9లో

ప్రధాని టూర్లలో ఎవరెవరు?

పీఎంవోకు సీఐసీ ప్రశ్న

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన దేశ, విదేశీ పర్యటనల్లో ఆయనతో పాల్గొన్న ప్రతినిధుల బృంద సభ్యుల పేర్లను వెల్లడించాలని ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) ఆర్.కె మాథుర్.. ప్రధానమంత్రి కార్యాలయాన్ని(పీఎంఓ) ఆదేశించారు. జాతీయ భద్రతలో భాగంగా వారి పేర్లు వెల్లడించలేమన్న పీఎంఓ అభ్యంతరాన్ని ఆయన తిరస్కరించారు. ప్రధాని విదేశీ పర్యటనల్లో పాల్గొన్న ప్రభుత్వేతర వ్యక్తుల పేర్లను తప్పకుండా వెల్లడించాలని పీఎంఓను సీఐసీ ఆదేశించింది. అయితే భద్రతా సిబ్బంది, ...9లో



అలా చేయకూడదు

- విడాకులు తీసుకున్నాక ఫొటోలు, వీడియోలు పంపరాదు: సుప్రీంకోర్టు

వివరాలు 9లో

పల్స్‌పోలియో విజయవంతం

- 36,22,931 మంది చిన్నారులకు చుక్కలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదివారం నిర్వహించిన తొలివిడత విడత పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 36,22,931 మంది చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు ఐదేండ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాలతో ...9లో



ఆస్తి కోసం దారుణం

- తండ్రి, ఇద్దరు తమ్ముళ్లను హత్య చేసిన వ్యక్తి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

వివరాలు 9లో



జయదేవ్ జాక్‌పాట్

- రూ. 11.5 కోట్లు పలికిన భారత బౌలర్

వివరాలు 12లో

జూన్ 10న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

- మే 20 ఆన్‌లైన్‌లో రాతపరీక్ష
- 161 పట్టణాల్లో నిర్వహణ

9లో

పదికి పకడ్బందీ!

- 2500 సెంటర్లలో టెన్త్ పరీక్షలు
- 405 పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

వివరాలు 9లో

తలుచుకుంటే..చంపేస్తా !

బాలరాజు గెలవడంటే..తోలు తీస్తా

- రాములు కాదు ఆయన తాతొచ్చినా.. నేనే లీడర్ని
- టికెట్ రాదని చెబుతావారా ?
- మారని టీఆర్ఎస్ అచ్చంపేట ఎమ్మెల్యే వ్యవహారశైలి

వివరాలు 9లో

"వెయ్యి శాతం నేనే లీడర్ని. గెలవనంటే తోలు తీస్తా. రాములు కాదు ఆయన తాతొచ్చినా నేనే లీడర్ని. నా కాడ ఉండి నాకే టికెట్ రాదంటవా సాలే. నీకెన్ని గుండెలు రా? నేను తలుచుకుంటే నిన్ను చంపేస్తా. గువ్వల దగ్గర నీవెంత? నీ శక్తెంత? ఎదురు మాట్లాడితే టార్గెట్ చేస్తా. ఈ పార్టీలో ఉండాలంటే... నా దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడాలి. లేకుంటే తొక్కుతా..నరుకుతా...ఈలోకంలో లేకుండా చేస్తా' అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఓ కార్యకర్తను బెదిరించిన ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. అధికార పార్టీలో గ్రూపు తగాదాలు బెదిరించేస్థాయికి పెరిగాయనటానికి ఈ ఘటనే నిదర్శనం.



అంబేద్కర్-పూలే-మార్క్స్ సిద్ధాంతమే మా పెట్టుబడి

నవతెలంగాణతో బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

ములాఖాత్



- దేశానికి కావాల్సింది కేరళ మోడల్
- రాజ్యాధికారంతోనే వాగ్దానాల అమలు
- విద్యావైద్యం సేద్యం మా ప్రాధాన్యతాంశాలు
- రూ.5 వేలు నిరుద్యోగ భృతి అందజేస్తాం
- 2 లక్షల ఖాళీ పోస్టులను భర్తీకి చర్యలు
- కులాంతర వివాహం చేసుకున్నోళ్లకు రూ.5 లక్షలు
- మా విధానాలు ఏకీభవిస్తే కోదండరామ్ సహా ఎవరినైనా ఆహ్వానిస్తాం


వివరాలు 10లో

సామాజిక న్యాయంతోనే సమాజ పురోగతి..

'నవ తెలంగాణ'తో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

- రాష్ట్రం విడిపోయాక మా కృషి మరింత ముందుకు
- పవన్ ప్రవచనాల్లో స్పష్టత లేదు
- కేటీఆర్, లోకేశ్ మాటలు ప్రచారార్భాటమే..

సామాజిక సమస్యల్ని పరిష్కరించటమనేది సమాజ బాధ్యతని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో వాటిని పరిష్కరించేందుకు వివిధ రూపాల్లో ఆ కృషి జరిగిందని ఆయన చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆ కృషిని ముందుకు.. ఇంకా చెప్పాలంటే దాని స్థాయిని పైకి తీసుకెళుతున్నారని తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పే ప్రవచనాల్లో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్, చంద్రబాబు ప్రభుత్వాలకు ప్రజల్లో సానుకూలత కల్పించేందుకే పవన్ యాత్ర చేస్తున్నారనే విమర్శల నేపథ్యంలో.. ఒక స్పష్టమైన రాజకీయ విధానాన్ని ఆయన ప్రకటించాలని సూచించారు. అయితే ప్రజల్లో అసంతృప్తి నెలకొంటే సానుకూలత కోసం ఆయన ఎంత ప్రయత్నించినా ఉపయోగం ఉండబోదని స్పష్టం చేశారు. బీజేపీ హయాంలో దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని వక్రీకరించి, లౌకికత్వాన్ని భంగపరుస్తారంటూ తమ పార్టీ గత మహాసభ అంచనా వేసిందని.. ఇప్పుడు తమ అంచనా రుజువైందని చెప్పారు. సీపీఐ(ఎం) తెలంగాణ ద్వితీయ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరిలో జరగనున్న నేపథ్యంలో.. ఉమ్మడి రాష్ట్రానికి సుదీర్ఘంగా కార్యదర్శిగా పనిచేసిన రాఘవులుతో.. 'నవ తెలంగాణ' పలు అంశాలపై ముచ్చటించింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



ఒక్క అమ్మాయి పది మంది అబ్బాయిలతో సమానం

- 'మన్ కీ బాత్'లో నారీ శక్తిని కీర్తించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: మహిళా సాధికారత ప్రాధాన్యతను మరోసారి నొక్కిచెప్పుతూ ప్రధాని మోడీ 'మన్ కీ బాత్' ప్రసంగం చేశారు. ఒక్క అమ్మాయి పది మంది అబ్బాయిలతో సమానమని చెప్పారు. ఇది మన పురాణాల్లోనే ఉన్నదని కొన్ని విషయాలను ఉదహరించారు. ఈ యేడాది నిర్వహించిన మొదటి మన్ కీ బాత్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ... నారీ శక్తి చాలా ప్రాముఖ్యత సంతరించుకున్నదని దానికి పరిమితులనేవే లేవన్నారు. వచ్చే నెల 1న భారత సంతతికి చెందిన వ్యోమగామి కల్పనా చావ్లా వర్ధంతిని గుర్తు చేస్తూ.. చిన్న వయసులో మృతి చెందడం బాధాకరమైన విషయమే అయినా ఆమె నింపిన స్ఫూర్తి చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విజయాలు సాధిస్తున్న మహిళలను ప్రశంసించారు. ఇటీవలే సుఖోయ్ యుద్ధ విమానం నడిపిన రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను, ప్రపంచ సముద్ర యాత్ర చేస్తున్న మహిళా బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ఇప్పటిది కాదని, పురాతన కాలం నుంచే అమల్లో ఉన్నదని తెలిపారు. ముంబయికి సమీపంలోని మతుంగా రైల్వే స్టేషన్ నిర్వహణ మహిళలే చూసుకుంటున్నారని, భారతదేశంలోనే ఇది ప్రప్రథమమన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన దంతెవాడ జిల్లాలో గిరిజన మహిళలు 'ఈ-రిక్షా'లు నడుపుతున్నారన్నారు. సామాజిక రుగ్మతలైన బాల్య వివాహం, వరకట్న సమస్యల్ని రూపుమాపటానికి.. రాష్ట్ర సరిహద్దుల చుట్టూ పదమూడువేల కిలోమీటర్ల మేర మానవ హారం కార్యక్రమాన్ని నిర్వహించిన బీహార్ ప్రభుత్వాన్ని అభినందించారు.

'పద్మ' అవార్డులపై...

ఇటీవల ప్రకటించిన పద్మ అవార్డులపై మాట్లాడుతూ... ఈ అవార్డుల ప్రక్రియలో పారదర్శకత పాటించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు చేసిన కృషిని వివరించారు. అవార్డు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కేరళకు చెందిన గిరిజన మహిళ లక్ష్మికుట్టి అడవుల్లో లభించే ఆయుర్వేద మొక్కలతో 500 ఆయుర్వేద ఔషదాలను తయారు చేస్తున్నారని కొనియాడారు.

అవినీతిపై యువత పోరాడాలి

అవినీతిపై యువత నిరంతరం పోరాడాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన ఎన్‌సీసీ ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ శిబిరాల్లో భారతదేశంలోని వివిధ సంస్కృతుల గురించి యువకులకు బోధిస్తుందని తెలియజేశారు. సొంత వ్యక్తిత్వం, గుర్తింపుతో ఇక్కడకు వచ్చారని, కొత్త స్నేహితులు, ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఎన్‌సీసీ దారితీసిందని ఆయన పేర్కొన్నారు. ధనవంతులకు, అధికారం ఉన్నవారికి ఎలాంటి శిక్షలూ ఉండవని ప్రజలు పూర్వం భావించారన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, ముఖ్యమంత్రులు సైతం అవినీతి ఆరోపణలతో నేడు జైలుకు వెళ్లారని తెలియజేశారు.

యాసిడ్ దాడి బాధితులకు కేంద్ర ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

న్యూఢిల్లీ : మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం కలిగిన వారితో పాటు యాసిడ్ దాడి బాధితులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొందనున్నారు. ఒక అధికారిక ఉత్తర్వు ఆదివారం ఈ విషయాన్ని తెలిపింది. నేరుగా నియామకాలు జరిపే ఉద్యోగాలకు సంబంధించి ఏ, బీ, సీ గ్రూపులకు ప్రస్తుతం రిజర్వు చేసిన 3 శాతం కన్నా మించి నాలుగు శాతం ఖాళీలను అంగవైకల్యం కలిగిన వారికి కేటాయించనున్నట్టు ఆ ఉత్తర్వులు తెలిపాయి. ఒక వ్యక్తికి నిర్దిష్టమైన అంగవైకల్యం 40 శాతం కన్నా తక్కువ ఉండరాదు . అలా ఉన్న వారికి మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుందని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి. అంధత్వం, హ్రస్వ దృష్టి, చెవిటి, మెదడు పక్షవాతం, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులు, కండరాల బలహీనత తదితర వైకల్యాలు ఉన్నవారికి ప్రతి నియామకంలోనూ ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆదేశిస్తూ సిబ్బంది శిక్షణ విభాగం (డీఓపీటీ) ఇటీవల కేంద్ర ప్రభుత్వ శాఖలన్నిటికీ లేఖ రాసింది. అలాగే ఆటిజం, మేధో వైకల్యం, మానసిక అనారోగ్యం తదితరాలతో బాధపడుతున్న వారికి కూడా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. 2016 నాటి అంగవైకల్యం కలిగిన వ్యక్తుల హక్కుల చట్టం ఆమోదం పొందిన తరువాత యాసిడ్ దాడి బాధితులకు, విద్యను నేర్చుకోవడంలో లోపం ఉన్న వారికి రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

టాటూ ఉంటే ఉద్యోగం ఊడుతుంది

- ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : వైమానిక దళంలో ఉద్యోగార్థి తన శరీరంపై వేయించుకున్న టాటూ నిబంధనలకు అనుగుణంగా లేకపోతే ఆ ఉద్యోగాన్ని కోల్పోవలసి వస్తుందని ఢిల్లీ కోర్టు తేల్చి చెప్పింది. ఎయిర్‌మెన్‌గా ఎంపికైన ఒక అభ్యర్థి నియామకాన్ని వైమానిక దళం రద్దు చేసింది. దీనికి కారణం ఆ అభ్యర్థి తన ముంజేయిపై టాటూ వేయించుకోవడమే. దీంతో ఆ అభ్యర్థి కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయంలో కోర్టు కూడా వైమానిక దళాన్నే సమర్థించింది. గిరిజనులతో సహా తమ ఆచార, సంప్రదాయల ప్రకారం టాటూ ధరించే వారికి వైమానిక దళం మినహాయింపునిచ్చింది. కొన్ని ప్రత్యేకమైన టాటూలు ఉంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఆ అభ్యర్థి శరీరంపై ఉన్న టాటూ వైమానిక దళం ఇచ్చిన మినహాయింపులకు లోబడి లేదని, ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే సమయంలో టాటూకు సంబంధించిన ఫొటోను జత చేయాలని కోరగా అలా చేయలేదని కోర్టు పేర్కొన్నది దీంతో అ అభ్యర్థిని ఉద్యోగం నుంచి తొలగించడం సబబే అని న్యాయమూర్తులు హిమ కోహ్లి, రేఖ పల్లితో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ముంజేతులపై లోపలికి చూసే విధంగాను, చెయ్యి వెనుక భాగాన అర చేతికి వెనుక వైపున టాటూ కలిగిన గిరిజనుల విషయంలోనూ వైమానిక దళం మినహాయింపునిచ్చింది.. ఒక అభ్యర్థిని ఉద్యోగానికి ఆమోదించాలా, వద్దా అనే విషయం ఎంపిక కమిటీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కోర్టు వెల్లడించింది.

నలుగురు పిల్లలు సజీవ సమాధి

రాజస్థాన్‌లో ఘటన..

జైపూర్: ఇద్దరు సోదరులతో సహా నలుగురు పిల్లలు అటవీ అధికారులు తవ్విన గొయ్యిలో పడి సజీవ సమాధి అయ్యారు. ఈ విషాదకర ఘటన రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా అటవీ అధికారి రాజేంద్రహుడా తెలిపిన వివరాల ప్రకారం.. అటవీ ప్రాంతంలోకి పశువులు, ఇతర జంతువులు పోకుండా ఆరేండ్ల క్రితం చుట్టూ తవ్వించి, ఫెన్సింగ్ వేయించారు. పిల్లలు అక్కడే అడుకుంటూ ఉండగా క్రమ క్రమంగా మట్టిమీద పడిపోయింది. అక్కడే ఉన్న కొందరు గమనించి, బయటకు తీసి ఆస్పత్రి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించారు.దీంతో కుటుంబాలలో ఒక్కసారిగా విషాద ఛాయలు అనుముకున్నాయి. మృతి చెందిన పిల్లలు దగ్గర్లోని మురికి వాడలో నివసిస్తున్నారు. ఆ గుంట చుట్టు ఫెన్సింగ్ ఉండగా, వారు దాన్ని దాటి ఎలా ప్రవేశించారో దర్యాప్తు చేస్తున్నామని హుడా తెలిపారు.

సంక్షేమానికి కత్తెర! బడ్జెట్ - 2018



బడుగుల పథకాలకు చోటెంత..? కోతెంత..?

2018-19 కేంద్ర బడ్జెట్‌పై పేదల ఆశలు

నవతెలంగాణ డెస్క్

కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి ఏటా బడ్జెట్ సందర్భంగా సంక్షేమ పథకాల సంఖ్యను తగ్గిస్తూ వస్తోంది. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం దిగిపోయేటపుడు 66 సంక్షేమ పథకాలుండేవి. 2014లో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అవి ఏటేటా కుదింపునకు గురవుతున్నాయి. 2017-18 బడ్జెట్‌నాటికి అవి 28కి పరిమితమయ్యాయి. ఈ పథకాలను కూడా మూడు రకాలుగా వర్గీకరించారు: 1-అత్యంత కీలక పథకాలు(6) 2-ముఖ్య పథకాలు(19) 3-ఐచ్ఛిక పథకాలు(3)..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జాతీయ సామాజిక భద్రత పథకంసహా ఆరు పథకాలను అత్యంత కీలక పథకాల కింద చేర్చారు. వీటికి 100 శాతం నిధులు కేంద్రమే అందించాలి. ఈ పథకాలను రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలి.

స్వచ్ఛభారత్, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజనసహా 19 పథకాలను ముఖ్య పథకాలుగా కేంద్రం పేర్కొన్నది. వీటికయ్యే ఖర్చులో 60 శాతం కేంద్రం భరిస్తుంది. హిమాలయ, ఈశాన్య ప్రాంతాల్లోని 11 రాష్ట్రాల విషయంలో మాత్రం కేంద్రం 90 శాతం ఖర్చు భరించాలి.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి, జాతీయ నదీ సంరక్షణ, శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ రూర్బన్ మిషన్..ఈ మూడు పథకాలను ఐచ్ఛిక పథకాలుగా కేంద్రం వర్గీకరించింది. ఈ పథకాలకు కేంద్రం నుంచి 50 శాతం నిధులు మాత్రమే



అందిస్తారు. వీటిని అమలు చేయాలా.? వద్దా..? అనేది రాష్ట్రాలే నిర్ణయించుకునేలా వీలు కల్పించారు.

మొత్తం ఈ 28 పథకాల్లోనూ కేంద్రం నూటికి నూరుపాళ్లు నిధులు అందించేది ఆరింటికి మాత్రమే. 19 పథకాలకు 40 శాతం చొప్పున రాష్ట్రాలు నిధులు సమకూర్చితే తప్ప ఆయా రాష్ట్రాల్లో అవి అమలుకాని పరిస్థితి. ఈ పథకాల విషయంలో రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలన్న నిబంధన ఏమీ లేకపోవడమే అందుకు కారణం. మరోవైపు ఈ పథకాల అమలులో అవినీతి చోటు చేసుకుంటుందన్న నెపంతో ఆధార్‌తో అనుసంధానం చేయాలని షరతు విధించడం వల్ల లబ్దిదారుల్లో చాలామంది పలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మన దేశంలో జనాభా లెక్కల ప్రకారం 74 శాతం అక్షరాస్యత ఉన్నట్టు నమోదైనా.. సాంకేతిక నిరక్షరాస్యత(ఇంటర్‌నెట్‌ను ఉపయో గించుకోవడం తెలియనివారు) అధికమన్నది గమనార్హం.

ఆహార భద్రతా చట్టం అమలుతోపాటు ఇతర(ఆహార సబ్సిడీ) పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో 1,45,338 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆహారధాన్యాలను సబ్సిడీ ధరలకు ప్రభుత్వం అందించాలి. ఈ పథకం అమలులో నిర్లక్ష్యం జరుగుతున్నట్టు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఏటా సగటున బియ్యంలో 39 శాతం, గోధుమల్లో 54 శాతం లబ్దిదారులకు చేరడంలేదని గతంలోనే కేంద్రానికి నివేదికలున్నాయి. గోడౌన్లను సక్రమంగా నిర్వహించకపోవడం, ఆహార ధాన్యాలను నిల్వ చేయడంలో నిర్లక్ష్యంసహా పలు అంశాలు అందుకు కారణమవుతున్నాయి.

మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ కమిటీ సూచనతో కేంద్ర పథకాల కుదింపు

ప్రధాని నేతృత్వంలోని నిటి ఆయోగ్ పాలకమండలి నిర్ణయంమేరకే కేంద్రం అమలు చేయాల్సిన పథకాల సంఖ్య తగ్గింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్(బీజేపీ) కన్వీనర్‌గా 9మంది ముఖ్యమంత్రులు, ఒక లెఫ్టినెంట్ గవర్నర్(అండమాన్-నికోబార్)తో పథకాల హేతుబద్ధీకరణ కోసమని ఓ ఉప సంఘాన్ని 2015లోనే ఏర్పాటు చేశారు. ఆ ఉపసంఘంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సభ్యులే. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, రాష్ట్రాల ముఖ్య మంత్రులతో సంప్రదించి కేంద్ర పథకాలకు మార్పులను సూచించాలని ఉపసంఘానికి నిటి ఆయోగ్ పాలక మండలి నిర్దేశించింది. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి ఉన్న 66 కేంద్ర పథకాలను 30కన్నా తక్కువ సంఖ్యకు కుదించాలని శివరాజ్‌సింగ్ కమిటీ సూచించింది. యూపీఏ-1 హయాంలో కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) సంఖ్య 147 కాగా, యూపీఏ-2 హయాంలో 66కు తగ్గింది. మోడీ హయాంలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో 50కి, 2017- 18లో 28కి కేంద్ర పథకాల సంఖ్య తగ్గుకుంటూ వచ్చింది.

2017-18 బడ్జెట్‌లో కొన్ని పథకాలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి

పథకం	కేటాయింపు
ఆహార సబ్సిడీ పథకాలన్నిటికీ కలిపి..	రూ.1,45,338 కోట్లు
గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీఎన్ఆర్ఈజీఏ)	రూ.48,000 కోట్లు
జాతీయ ఆరోగ్య పథకం	రూ. 27,131 కోట్లు
ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన	రూ.19,000 కోట్లు
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	రూ.15,000 కోట్లు
ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన	రూ.9000 కోట్లు



బిల్లు ఆమోదానికి అన్నీ చేస్తాం..

ట్రిపుల్ తలాక్‌పై కేంద్రమంత్రి అనంత్‌కుమార్

- బడ్జెట్ సమావేశాలకు ముందు అఖిలపక్ష సమావేశం
- సహకరించండి : ప్రధాని
- నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు..
- నేడే ఆర్థిక సర్వే..
- ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించేందుకు 'అన్నీ చేస్తామని' పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. బిల్లుపై ఏకాభిప్రాయం సాధించేందుకు విపక్షాలతో చర్చిస్తున్నామని తెలిపారు. సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో.. ఆదివారం పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ నేతృత్వంలో పార్లమెంట్‌లోని లైబ్రరీ హాల్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్రమోడీతో పాటు ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. సభలో విపక్షాలు లేవనెత్తే అంశాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని సమావేశంలో ప్రధాని చెప్పారు. దేశ ప్రయోజనాల కోసం బడ్జెట్ సమావేశాల్లో నిర్మాణాత్మక వాతావరణం సృష్టించేందుకు విపక్షాలు సహకరిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానంతరం అనంత్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. అఖిలపక్ష సమావేశాలు ఫలప్రదంగా జరిగాయని చెప్పారు. ఇక ట్రిపుల్ తలాక్‌పై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాలకు విపక్ష పార్టీల నేతలు మల్లికార్జునఖర్గే(కాంగ్రెస్), ములాయంసింగ్(ఎస్పీ), డీ రాజా(సీపీఐ), కనిమొళి(డీఎంకే), దేరెక్ ఒబ్రెయిన్(టీఎంసీ), తారీఖ్ అన్వర్(ఎన్సీపీ) తదితరులు హాజరయ్యారు. నేటి నుంచి ప్రారంభంకానున్న బడ్జెట్ సమావేశాలు రెండు దఫాలుగా జరగనున్నాయి. జనవరి 29 నుంచి ఫిబ్రవరి తొమ్మిది వరకు, అనంతరం మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు సమావేశాలు జరుగుతాయి. 68 రోజుల కాల వ్యవధిలో జరగనున్న ఈ సమావేశాల్లో... ఉభయసభలు 31 సిట్టింగ్‌లు జరపనున్నాయి. రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగం చేయనున్నారు. నేడే ఆర్థిక సర్వేను సభలో జైట్లీ ప్రవేశపెట్టనున్నారు. కాగా బడ్జెట్ సమావేశాలు సజావుగా జరిగేందుకు విపక్షాలు సహకరించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ కోరారు. ఆదివారం రాత్రి స్పీకర్ అధ్యక్షతన మరో అఖిలపక్ష సమావేశం జరిగింది.

మూడున్నరేండ్లుగా హామీలతోనే సరి : జితేందర్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వం విభజన వాగ్దానాలు అమలు చేయకుండా మూడేండ్లుగా హామీలతో సరిపెడుతోందని టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి విమర్శించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాష్ట్రానికి సుమారు రూ. ఐదు వేల కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ఆదాయంతోనే కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ వార్షిక బడ్జెట్‌లో విభజన హామీలకు పెద్దపీత వేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రానికి అంశాలవారీగా మద్దతిస్తున్నప్పటికీ తెలంగాణపై శీతకన్ను ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బీజేపీకి మనుగడ లేదని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు. కాగా విభజన హామీలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం కేంద్రాన్ని కోరారు.

ఎంఆర్ఐ మిషన్‌లో చిక్కుకొని వ్యక్తి మృతి

- ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణం..
- ముంబయిలో దుర్ఘటన



ముంబయి: ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని తీసుకున్నది. ఎంఆర్ఐ మిషన్‌లో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి

మృతి చెందాడు. ఈ విషాధ ఘటన మహారాష్ట్ర రాజధాని ముంబయిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ముంబయికి చెందిన హరీశ్ సోలంకీ తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో బివైఎల్ నాయర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆమెను శనివారం సాయంత్రం ఎంఆర్ఐ స్కానింగ్ తీసుకెళ్లారు. పేషంట్ వెంట సోలంకీ, అతడి దగ్గరి బంధువు రాజేష్(32) వెళ్లాడు. కాగా.. ఆక్సిజన్ సిలిండర్‌ను ఎంఆర్ఐ మిషన్ ఉన్న గదిలోకి తీసుకురావాలని రాజేశ్‌కు వార్డు బాయ్ చెప్పాడు. వాస్తవానికి లోహపు వస్తువులతో కూడిన దుస్తులు, జ్యువెల్లరీ, వైద్య పరికరాలు, తదితర అయస్కాంతాకర్షక వస్తువులు స్కానింగ్ రూమ్‌లోకి అనుమతించరు. కానీ వార్డు బాయ్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. సిలిండర్ తీసుకొని లోపలికి రావచ్చా అని వారి బంధువులు వార్డ్ బాయ్‌ని ప్రశ్నించారు. మిషన్ ఆఫ్‌లోనే ఉందని, సిలిండర్ తీసుకొస్తే ఏం కాదని వార్డు బాయ్ చెప్పినట్టు పేషంట్ బంధువులు తెలిపారు. అక్కడే ఉన్న డాక్టర్, టెక్నీషియన్‌లు సైతం... వార్డు బాయ్ తీరుపై అభ్యంతరం తెలుపలేదు. దీంతో రాజేశ్ సిలిండర్ తీసుకొని లోపలికి వెళ్లాడు. స్కానింగ్ మిషన్ ఆన్‌లోనే ఉండటంతో అయస్కాంత శక్తి కారణంగా సిలిండర్ సహా అతడు యంత్రంలోకి చొచ్చుకెళ్లాడు. వెంటనే వార్డ్ బాయ్, సోలంకీలు అతన్ని అందులో నుంచి బయటకు తీసి, ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అయితే తీవ్ర రక్తస్రావం కావడంతో అతడు కొద్ది నిమిషాల్లోనే చనిపోయాడు. రాజేశ్ మృతికి ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని అతని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్, టెక్నీషియన్, వార్డు బాయ్‌లను అరెస్టు చేసినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

సేద్యం వద్దు..ఉద్యోగమే ముద్దు

మారుతున్న పల్లె యువత ధోరణి



న్యూఢిల్లీ: వ్యవసాయం అంటేనే బెంబేలెత్తిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికులు సహజంగా వారి సొంత భూముల్లో వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారనేది మన దేశంలో సర్వసాధారణం. కానీ ఇటీవలి పరిణామాలు చూస్తే ఆరుగాలం కష్టించినా ఫలితం అందుతుందన్న నమ్మకం లేదు. చేతికి అందిన ఫలితానికి తగిన గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశలు నానాటికి జావగారిపోతున్నాయి. ఈ వాస్తవ నేపథ్యంలో వార్షిక విద్యా స్థాయీ నివేదిక 2017ను స్వచ్ఛంద సంస్థ ప్రధాన్ వెల్లడించింది. ఈ నివేదికలోని అంశాలను పరిశీలిస్తే ... పల్లె ప్రాంతాల్లోని 14 - 18 ఏండ్ల మధ్య వయస్కులలో 42 శాతం మంది ఏదో ఒక పనిచేస్తూన్నారు. వాళ్ల పేర్లు బడుల్లో ఉన్నా లేకున్నా వారంతా ఏదో రకమైన పనులు చేస్తున్నారు. వారిలో కూడా 79 శాతం మంది వ్యవసాయం పనుల్లోనే గడుపుతున్నారు. 28 రాష్ట్రాలలో సర్వే చేయగా 30 వేల మంది తమ సొంత పొలాల్లోనే పనిచేస్తున్నారు. సర్వే చేసిన వారిలో కేవలం 1.2 శాతం మాత్రమే వ్యవసాయదారుగా కొనసాగేందుకు ఆసక్తి కనబరిచారు. 18 శాతం మంది సైన్యంలో కానీ, పోలీసు దళాల్లో కానీ పనిచేయాలనుకుంటున్నారు. 12 శాతం మంది ఇంజనీర్లు కావాలనుకుంటున్నారు. ఇక యువతుల్లో ఎక్కువ మంది (25 శాతం) టీచర్ లేదా డాక్టర్ లేదా నర్సు (18 శాతం) ఉద్యోగాలు చేయాలని ఆశిస్తున్నారు. ఇక యువకుల్లో 13 శాతం, యువతుల్లో 9 శాతం మంది ఏ



స్థాయి ప్రభుత్వ ఉద్యోగమైనా సై అంటున్నారు.

వివిధ రాష్ట్రాల్లో అన్నదాతలు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. గిట్టుబాటు ధరల కోసం, రుణాల మాఫీ కోసం వారంతా ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో వెలువడిన ఈ సర్వే ప్రకారం - వ్యవసాయ రంగ పురోగతి 2014-15తో పోల్చి చూస్తే 2017-18 నాటికి కేవలం ఏడాదికి రెండు శాతం మాత్రమే ఉన్నట్టు తెలుస్తుంది. ఈ వివరాలు తెలియజేస్తూ, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి విద్యలో వ్యవసాయ, పశు సంవర్ధక కోర్సుల్లో ప్రవేశాలు చాలా స్వల్పంగా ఉన్నట్టు ప్రధాన్ వ్యవస్థాపక చైర్మెన్ మాధవ్ చవాన్ తెలిపారు. వ్యవసాయ రంగంలో పనిచేసే కార్మిక శక్తిదాదాపు సగం తగ్గిపోయిందని అంటూనే, విద్యావంతులు వ్యవసాయం చేపట్టటం ఇప్పుడు ప్రయోజనకరమని ఆయన సూచించారు. వ్యవసాయంలోను, తోటల పెంపకంలోను, పశు పోషణ రంగాంలోను, ఇతర అనుబంధ రంగాలలో శాస్త్రీయ పద్ధతుల్లో యాంత్రికీకరణ, అధిక దిగుబడి వంగడాలు వాడుకలోకి తీసుకురావటంతో పాటు లాభదాయకమైన డిమాండ్, మార్కెట్ సమకూర్చాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని అట్టడుగు స్థాయి ఉద్యోగికి నెలకు రూ. 22000 లభిస్తున్నప్పుడు వ్యవసాయం నమ్ముకుంటే కనీసం నెలకు రూ. 3800 కూడా భరోసా లేని పరిస్థితి ఉందని స్వరాజ్ పార్టీ నేత, వ్యవసాయ రంగ ఉద్యమనేత యోగేంద్ర యాదవ్ అన్నారు.

ఈ సర్వేలోని కొన్ని అంశాలను ప్రభుత్వ సంస్థ జాతీయ శాంపిల్ సర్వే సంస్థ విడుదల చేసిన 2013 లెక్కల ప్రకారం వ్యవసాయ రంగంలో ఆధారపడిన గ్రామీణ కుటుంబానికి నెలకు రూ. 6424 ఆదాయం మాత్రమే లభిస్తోందని, అందులో వ్యవసాయం, పశుపోషణ ద్వారా వచ్చే ఆదాయం కేవలం రూ. 3844 అని నిర్ధారణ అవుతోంది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ 2014 నాటి నివేదిక ప్రకారం మెరుగైన ఉపాధి మార్గం కోసం దాదాపు 60 శాతం వ్యవసాయదారులు పట్టణాలకేసి చూస్తున్నారు. తమ వారసులు కూడా వ్యవసాయంపైనే జీవించాలని ఆశిస్తున్నారా అన్న ప్రశ్నకు కేవలం 18 శాతం సానుకూలంగా స్పందించారు.



మేడారంలో భక్త జనం





నవతెలంగాణ-ములుగు

ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ముందుగా జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన పోలీసు కేంద్రాన్ని సందర్శించారు. చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. తర్వాత జంపన్న వాగు ఎడమ వైపులో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలను పరిశీలించిన సందర్భంలో మాట్లాడారు. కళ్యాణ కట్టల తలనీలాలు ఇస్తున్న భక్తులతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, జేసీతో కలిసి ఐటీడీఏ క్యాంపు కార్యాలయం వరకు నడుస్తూ మధ్యలో భక్తులను పలకరిస్తూ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాత్రిపూట కూడా సందర్శకుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గాను ఆయన మేడారంలోనే బస చేశారు.

జన సందోహంగా మారిన మేడారం

మేడారం జాతరకు సందర్శకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. దీంతో పాటు ఉపముఖ్య మంత్రి కడియం నేతృత్వంలో ఉమ్మడి జిల్లా నేతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లా నేతలే కాకుండా ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, సీతారాంనాయక్, పసునూరి దయాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, ప్రభాకర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పూల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, కొండా మురళి, ఎమ్మెల్యేలు కొండా సురేఖ, ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, చైర్మన్లు గుండు సుధారాణి, రాజయ్యయాదవ్, వీరందరూ ప్రజాపతులతో పాటు పలువురు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు.

మంత్రి కడియం సుడిగాలి పర్యటన

- పనుల పరిశీలన... ఏర్పాట్లపై ఆరా



లైన్‌లో వేచి ఉన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- చేవెళ్లలో ఘటన

నవతెలంగాణ-చేవెళ్ల

హైదరాబాద్ : బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదంలో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చనిపోయారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. చేవెళ్ల సీఐ గురువయ్య, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని జెన్‌ప్యాక్ కంపెనీలో ప్రవీణ్ (26), అర్జున్‌కుమార్ (25), శ్రావణ్‌లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వారి స్నేహితుడు డేవిడ్ జాన్సన్ (34) మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. వీరు ఆదివారం ఉదయం తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో సరదాగా లాంగ్‌డ్రైవింగ్ కోసం హైదరాబాద్ నుంచి వికారాబాద్ ప్రవీణ్‌కు చెందిన ఆల్టో కారులో బయల్దేరారు. చేవెళ్లలోని మీర్జాగూడ స్టేజీ దగ్గరకు రాగానే కారు అదుపుతప్పి మర్రి చెట్టును వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్, అర్జున్‌కుమార్, డేవిడ్ జాన్సన్‌లు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్ర గాయాలపాలైన శ్రావణ్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చేవెళ్ల సీఐ గురువయ్య, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనం

- ఐపీసీ సెక్షన్లను నాన్‌బెయిలబుల్‌గా మార్చడంపై సీపీఐ(ఎం) విమర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) 506,507 సెక్షన్లను నాన్‌బెయిలబుల్‌గా మార్చడం టీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వానికి, ఫ్యూడల్ పాలనకు నిదర్శనమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ నిరంకుశ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాన్ని ఎవరూ విమర్శించకూడదనే అహంకార ధోరణి ముఖ్యమంత్రి కేసీఆర్‌లో పరాకాష్టకు చేరిందని తెలిపారు. ఎవరు విమర్శించినా ఊరుకోబోమని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. విమర్శించిన వారిని జైలులో నిర్బంధించడానికి ఐపీసీ 506,507 సెక్షన్లను నాన్‌బెయిలబుల్‌గా మార్చే దుస్సాహసానికి పూనుకున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎదుటి పక్షాలను, వారిని నిందించి పరుష పదజాలంతో దూషించినప్పుడు కేసీఆర్‌ను జైలుకు పంపితే ఉద్యమాలు ఎలా నడిచేవారని ప్రశ్నించారు. కేసీఆర్ మాట్లాడితే ఒప్పు, ఇతరులు మాట్లాడితే తప్పు, నేరం అన్న ఫాసిస్టు ధోరణితో ఉండడం ఫ్యూడల్ సంస్కృతికి నిదర్శనమని తెలిపారు. గత చరిత్రలో ఈ రకంగా వ్యవహరించిన అనేక మంది పాలకులు ప్రజల ఆగ్రహానికి గురై చరిత్ర కాలగర్భంలో కలిసిపోయారనే విషయాన్ని కేసీఆర్ గుర్తున్నట్టు లేదని పేర్కొన్నారు. తమకు కావాల్సిన వాటిని ప్రభుత్వాన్ని అడిగే హక్కు, నిలదీసే హక్కు ప్రశ్నించే హక్కు, ప్రజల ప్రజాస్వామిక హక్కు అని తెలిపారు. వీటిని హరించడానికి ప్రభుత్వం చేసే చర్యలను ప్రజలు సహించబోరని కేసీఆర్ గమనించాలని సూచించారు. కేసీఆర్ తీసుకున్న రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను న్యాయస్థానాలు తిరస్కరించి మొట్టికాయలు వేసిన విషయాలను మరిచిపోయారని తెలిపారు. ఐపీసీ 506,507 సెక్షన్లను నాన్‌బెయిలబుల్‌గా మార్చొద్దని డిమాండ్ చేశారు. అప్రజాస్వామిక విధానాలకు స్వస్తి పలకాలని కోరారు.

పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించొద్దు

- లోక్‌సత్తా రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాల్సిన అవసరం లేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. లోక్‌సత్తాపార్టీ ఆధ్వర్యంలో నూతన పంచాయతీరాజ్ చట్ట సవరణపై ఆదివారం హైదరాబాద్‌లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. ఎం.పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముందుగా టీడీపీ నేత జి. బుచ్చిలింగం మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాన్ని కదిలించాల్సిన పని లేదన్నారు. స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని అన్నారు.

కేంద్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- ప్రధానికి ఆర్ కృష్ణయ్య లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 14లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆర్ కృష్ణయ్య కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాశారు. కేంద్రంలో మొత్తం 56 లక్షల ఉద్యోగాలు ఉంటే అందులో 42 లక్షల మంది మాత్రమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. రేల్వేలో 2.40 లక్షలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 4లక్షలు, జాతీయ బ్యాంకుల్లో 1.20 లక్షలు, రక్షణ శాఖలో 3.30 లక్షలు, అలాగే ప్రభుత్వ శాఖల్లో 2.80లక్షల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ సామర్థ్యం దెబ్బ తినడమే కాకుండా యువతరం శక్తి యుక్తులు సమాజాభివృద్ధికి వినియోగం కావడం లేదన్నారు. కేంద్రంలో 1994 నుంచి బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నా ఉద్యోగ నియామకాలు జరపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా దేశంలో ఖాళీగా ఉన్న 1360 ఐఏఎస్, 1037 ఐపీఎస్ పోస్టులను కూడా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన నాయకుడిపై మావోయిస్టుల కాల్పులు అమానుషం

- టీఎస్ఎఫ్.. టీఏజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన నాయకుడుపై మావోయిస్టులు కాల్పులు జరిపి హత్య చేయడాన్ని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఖండించాయి. ఈ మేరకు ఆదివారం టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా చందునాయక్, మూడ్ శోభన్ నాయక్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీరావు ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సుందరయ్య నగర్‌కు చెందిన గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు ఎం రమేష్‌పై శుక్రవారం రాత్రి మావోయిస్టులు జరపడం అమానుషమని వారు పేర్కొన్నారు. నిత్యం గిరిజన సమస్యలపై పని చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.

సంపన్నుల పక్షంగా సవరణలు..

ఎస్వీకే చర్చాగోష్టిలో మురళీమనోహర్

- ప్రజా ఉద్యమాలతోనే రాజ్యాంగ పరిరక్షణ : తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి వచ్చాక శాసన, న్యాయ, కార్యనిర్వహక వ్యవస్థలకు తూట్లు పొడుస్తుందని రిటైర్డ్ ప్రొఫెసర్ కె మురళీ మనోహర్ విమర్శించారు. రాజ్యాంగంలో ఇప్పటి వరకు జరిగిన సవరణలన్నీ ఆస్తిపరులకు అనుకూలంగా జరిగాయన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో 'రాజ్యాంగంపై దాడి... ఎవరికోసం?' అనే అంశంపై ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎస్ వినయకుమార్ అధ్యక్షతన ఆదివారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా మురళీమనోహర్ మాట్లాడుతూ.. 50 శాతానికి రిజర్వేషన్లు మించకూడదంటూ రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనకపోయినప్పటికీ సుప్రీం కోర్టు మాత్రం కటాఫ్ విధించిందన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. రాజ్యాంగ సూత్రాలు, లక్ష్యాలకు భిన్నంగా పాలక పార్టీల గుత్తాధిపత్యం పెరిగిపోతుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు, ప్రజా సంఘాలు సంఘటితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ..భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విఘాతం కలిగించేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రజా ఉద్యమాల ద్వారానే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. లౌకికవాదానికి బీజేపీ వక్రభాష్యం చెబుతోందని అన్నారు. మతం వ్యక్తిగతమని, దాన్ని రాజకీయాల్లో చొప్పించడం సరైందికాదన్నారు. అన్ని మతాలనూ సమానంగా చూడాలని అన్నారు. రాజకీయ కోసం మతాల విభజిస్తోందన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గత పదేండ్లుగా పార్లమెంటులో కోటీశ్వరుల ప్రాతినిధ్యం పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం 82 శాతం మంది శతకోటీశ్వరులు ఎంపీలుగా ఉన్నారని వివరించారు. వీరంత పేదలు, రైతులు, మహిళలకు రక్షణ, విద్యార్థులకు సంబంధించిన చట్టాల గురించి ఎందుకు ఆలోచిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాను రాను కార్పొరేట్‌పరమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో 'ఒక ఓటు -ఒక విలువ' అని పేర్కొన్నా...మనుషుల మధ్య సమాన విలువ ఉండదని అంబేద్కర్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ, సామాజిక సమానత్వం రాదని అంబేద్కర్ చెప్పారన్నారు. భూమి, ఆస్తులు, పరిశ్రమలు వ్యక్తిగతంగా ఉండకూడదని అంబేద్కర్ పేర్కొన్నా...అవి రాజ్యాంగంలో మంచి మాటలుగానే మిగిలిపోయాయన్నారు. కమ్యూనిస్టులు చెప్పినట్టు వాటిని పోరాటాల ద్వారానే సాధించుకోవాలని అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలపై కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం చేస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులనూ హరించివేస్తోందని విమర్శించారు. కాశ్మీర్ ప్రజలకు కల్పించిన 370 ఆర్టికల్‌ను ప్రభుత్వాలు బలహీనపర్చడం వల్లే అక్కడి ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతోందన్నారు. రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని నిరసిస్తూ నాడు జ్యోతిబసు, ఫారుఖ్ అబ్దుల్లా, ఎన్టీఆర్ పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మించారని, దీంతో సర్కారియా కమిషన్ ఏర్పాటైందన్నారు. కేంద్ర, రాష్ట్రాలకు ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఎక్కడైనా ఒక చోట రాష్ట్ర ప్రభుత్వంలో సంక్షోభం ఏర్పడితే అక్కడ వెంటనే ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్రపతి పాలన విధించేలా బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది మహమూద్ అలీ మాట్లాడుతూ రాజ్యాంగంపై దాడి గాంధీ హయాం నుంచే ప్రారంభమైందన్నారు. రాజ్యాంగ హక్కులనూ కాలరాస్తున్నారని చెప్పారు. ఇది ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరమన్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలను స్వతంత్రంగా పని చేయనీయడం లేదన్నారు. రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తన వంతు సహకారం ఉంటుందని చెప్పారు. ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం...భారతదేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. పల్లె పల్లెకు పాట...పార్లమెంటుకు బాట పేరుతో ప్రజల్లోకి పోవాలని సూచించారు.

తమ్మినేనితో మందకృష్ణ భేటీ

- నేడు ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షానికి రావాలని ఆహ్వానం



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్ ఈ భేటీకి వేదికైంది. ఎస్సీ వర్గీకరణపై సోమవారం నిర్వహించబోయే అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాలని తమ్మినేని వీరభద్రంను మందకృష్ణ ఆహ్వానించారు. దీనిపై తమ్మినేని సానుకూలంగా స్పందించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెడితే సీపీఐ(ఎం) మద్దతు ఇస్తుందని గతంలోనే చెప్పామని, ఇప్పుడూ కట్టుబడి ఉంటామని ఆయన వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లు ప్రవేశపెడితే తమ పార్టీ సంపూర్ణంగా మద్దతునిస్తుందని మందకృష్ణకు తమ్మినేని వీరభద్రం హామీఇచ్చారు.

విమర్శిస్తే జైలుకా..?

- కేసీఆర్ కుటుంబానికే బంగారు ఫలాలు : టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-గీసుగొండ

'టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే రెండేండ్ల జైలు శిక్ష విధించే చట్టాన్ని తీసుకొస్తానని కేసీఆర్ అనడం దుర్మార్గం. కేసీఆర్ మాట్లాడిన వ్యాఖ్యలకు జీవిత ఖైదు విధించాల్సి ఉంటుంది' అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన పలు పార్టీలకు చెందిన సుమారు 500 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబానికే బంగారు ఫలాలు అందుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. రానున్న రోజుల్లో ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, సీతక్క, మాజీ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, దాసోజు శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకానికి చావులేదు

- విలువ ఎప్పుడూ తగ్గదు
- పకోడి పొట్లం పేపర్లూ చదివేవాడిని: బివి రాఘవులు

నవతెలంగాణ - సిటీబ్యూరో

'ఇంటర్నెట్, ఫైబర్ నెట్, శాటిలైట్, డిజిటల్ టెక్నాలజీ వచ్చాకా పుస్తకానికి విలువ లేదన్న వాతావరణాన్ని ఆ మధ్య సృష్టించారు. పుస్తకాలు లేవంటే గ్రంథాలయాలకు భవిష్యత్ ఉండదని ప్రచారం చేశారు. కానీ, పుస్తకానికి చావు లేదు. మళ్ళీ, పుస్తకాలకు, గ్రంథాలయాలకు విలువ పెరుగుతుంది' అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 'పుస్తకం అంటే నిల్వ. డిజిటైజ్ చేసినా, నిల్వ చేసుకో వాలంటే హార్డ్ డిస్క్‌ల్లో దాచుకోవాలి. పుస్తకాన్ని నాశనం చేయడానికి ఎవరికీ సాధ్యం కాదు. విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసే దే పుస్తకం. విజ్ఞానం నిరంతరం ముందుకు పోతున్నది. విజ్ఞానానికి చావు లేదు. అందుకే పుస్తకానికీ చావులేదు. ప్రపంచ వ్యాప్తంగా పుస్తకాలకు ఆసక్తి పెరిగింది. శాశ్వతంగా విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసి భావితరాలకు అందిస్తాయి. సమా జాన్ని ముందుకు నడిపిస్తాయి. ఆతరహా పుస్తకాలను రచ యితలు, పబ్లిషర్లు అధికంగా తీసుకురావాలి. అందుకు పుస్త క ప్రదర్శనలు వాహకంగా పనికొస్తాయి. హైదరాబాద్, విజ యవాడ, ఢిల్లీ లాంటి పుస్తక ప్రదర్శనలు ఆ పాత్ర నిర్వహిస్తు న్నందుకు అభినందనలు. మాది ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని మోపాడు గ్రామం. ఎలిమింటరీ స్కూల్లో మాకొక చెక్క పెట్టె ఉండేది. ఆ పెట్టెలో భారతం, కాశీ మజి లీ కథలుండేవి. భారతం కథలే ఆసక్తిగా చదివేవాడిని. నాకు జ్ఞాపకం ఉన్నంత వరకూ నాపై గాఢమైన ముద్రవేసింది వేమన శతకం, నండూరి రాంమోహన్‌రావు విశ్వదర్శనం, మానవ పరిణామం



రెండో పుస్తకం నరావతారం (అప్పటికి పుస్తకాలుగా రాలేదు). మా నాన్న ఏదైనా కొనుక్కోమని ఇచ్చిన డబ్బులు, దాచుకున్న 40 పైసలతో ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక కొనుక్కొని చదువుకునేది. అప్పట్నుంచి సైన్స్, హేతువాదం, వేమన పద్యాల్లో ఉండే కుల వ్యతిరేక విషయాలు అర్థమయ్యేవి. ఇప్పుడు చూస్తుంటే అవన్నీ నాపై ప్రభావం ఉన్నట్టుగా అన్పిస్తుంది. అక్కణ్నుంచి ఏదైనా కాగితం దొరికినా, పకోడి పొట్లం పేపర్ దొరికినా చదివే అలవాటయ్యింది. జ్ఞాపకం పెట్టుకోగలిగిన పుస్తకాలుగా భార తం, కాశీ మజిలీ కథలు, నరావతారం. ఆ తర్వాత హేతువాదం నుంచి రాజకీయంగా ముందుకు రావడానికి శ్రీశ్రీ మహాప్రస్థానం, డేవిడ్ కాపర్ ఫీల్డ్, టామ్ పెయిన్, జాతీయ, అంతర్జాతీయ రచనలు ఇంటర్‌లో చదివాను. ఒక ఒరవడి గా, ఉద్యమంగా చూసుకుంటే శ్రీశ్రీ కంటే దిగంబర కవుల ప్రభావం నాపై భాగా ఉంది. విద్యార్థి దశలో మంచి ఊపు ఉండేది' అని అన్నారు.

'శ్రీనివాస్ హత్య'లో రాజకీయ కోణం లేదు

మిర్చిబండీ దగ్గర గొడవే కారణం

- 6 ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు
- 11 మంది నిందితులుగా గుర్తింపు..
- 9 మంది రిమాండ్ : నల్లగొండ ఎస్పీ శ్రీనివాసరావు

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ఎలాంటి రాజకీయ కోణమూ లేదని, హత్యకు మిర్చిబండీ వద్ద జరిగిన గొడవే కారణమని ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడిం చారు. ఈ హత్య కేసులో 11 మంది నిందితులుగా గుర్తించినట్టు చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శ్రీనివాస్ హత్య నిందితుల్ని ప్రవేశపెట్టారు. అనంతరం అయన విలేకర్లతో మాట్లాడారు. 'గాంధీనగర్‌కు చెందిన మాంద్ర మల్లేశ్ తమ్ముడు ఈనెల 24న అనారోగ్యంతో చనిపోయా డు. ఆ రోజు అంత్యక్రియలు ముగిసిన తర్వాత రాత్రి 7గంటల సమయంలో చింతకుంట్ల రాంబాబు, శరత్ కలిసి స్థానిక ఆల్ఫా కళాశాల వద్ద గల యాదయ్య మిర్చి బండి వద్ద మిర్చీలు కొనుగోలు చేశారు. ఉల్లిగడ్డ ఎక్కువ ఇవ్వనందుకు అతనితో గొడవపడి దుకాణంలోని సామాన్లన్నీ కింద పడేశారు. ఆ గొడవలో యాదయ్యకు నష్టపరిహారం



ఇస్తామని మాంద్ర మల్లేశ్ మాట్లాడి సర్దిచెప్పాడు. అక్కడి నుంచి వెళ్లిన రాంబాబు, శరత్, మల్లేశ్ మద్యం తీసుకుని మహేష్ ఇంటికి వెళ్లి తాగారు. రాత్రి 10 గంటలకు మెరుగు గోపి ఫోన్ చేసి రాంబాబును మిర్చి బండి వద్దకు రమ్మన్నాడు. రాంబాబు, శరత్, మాంద్ర మల్లేశ్‌తో పాటు చక్రీ సామ్రాట్ కూడా మిర్చి బండి వద్దకు వచ్చారు. దుర్గయ్య అనే వ్యక్తికూడా అక్కడే ఉన్నాడు. గోపి, రాంబాబుల మధ్య గొడవ జరిగింది. రాంబాబు గోపితో పాటు బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను కూడా బూతులు తిట్టాడు. గోపి, రాంబాబు కొట్టుకోగా చక్రీ సర్దిచెప్పి గోపిని కారు ఎక్కించి పంపించేశాడు. ఈ క్రమంలో మెరుగు గోపి బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తనపై రాంబాబు దాడి చేసి తిట్టిన సంగతి చెప్పాడు. దీంతో శ్రీనివాస్ అక్కడికి వెళ్లాడు. మిర్చి బండి వద్ద ఎందుకు గొడవ పెట్టుకున్నారని, గోపిని ఎందుకు కొట్టావని రాంబాబును అడిగాడు. ఇంతలో మోహన్, శరత్‌లు తగవు పడ్డారు. మాటా మాటా పెరిగి శ్రీనివాస్ రాంబాబుపై చేయి చేసుకున్నాడు. రాంబాబు కూడా తిరిగి శ్రీనివాస్‌ని కొట్టాడు. తోపులాట జరిగి శ్రీనివాస్ పక్కనే ఉన్న మోరీలో పడి పోయాడు. మాంద్ర మల్లేశ్ సిమెంట్ రాయితో శ్రీనివాస్ తలపై కొట్టాడు. ఆ తర్వాత రాంబాబు, మల్లేశ్‌లు మరో రెండు రాళ్లను శ్రీనివాస్ తలపై మోది చంపి అక్కడి నుంచి పరారయ్యారు' అని ఎస్పీ వివరించారు. కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక టీమ్‌లను వేసి నిందితుల్ని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు. శ్రీనివాస్ హత్య కేసులో ఎ-1 నిందితునిగా చింతకుంట్ల రాంబాబు, ఎ-2గా మాంద్ర మల్లేశ్, ఎ-3గా అలువాల శరత్‌రాజ్, ఎ-4 భాషపాక దుర్గయ్య, ఎ-5 కత్తుల కళ్యాణ్‌సామ్రాట్ అలియాస్ చక్రీ, ఎ-6 దామూనూరి సతీష్, ఎ-7 మాంద్ర మహేష్, ఎ-8 మిట్టపల్లి సాయి, ఎ-9 మెరుగు గోపి, ఎ-10 మాతంగి మోహన్, ఎ-11 ప్రసాద్ ఉన్నారు.. వీరిలో ప్రసాద్, మాంద్ర మహేష్, సాయిలు పరారీలో ఉండగా మిగతా 9 మందిని రిమాండ్ చేసినట్టు ఎస్పీ చెప్పారు.

లా అండ్ ఆర్డర్ దారితప్పింది : భట్టి

- జగదీశ్‌రెడ్డిది రౌడీ బుద్ధి...
- వీరేశందీ నేర చరిత : రాజగోపాల్‌రెడ్డి

'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. రాజ్యాంగ సంస్థలు అధికార పార్టీకి రక్షణ కవచాలుగా మారాయి' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెం ట్ మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలన్నారు. నల్లగొండ మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మిని, కుటుంబ సభ్యుల్ని ఆయన ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ షీటీమ్స్, కమాండ్ కంట్రోల్ అంటూ రాష్ట్ర వ్యాప్తంగా విపరీతంగా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం శ్రీనివాస్ హత్యపై ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నిం చారు. ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ పోలీసుల పట్ల ప్రజలకు విశ్వాసం పోయిందని, ఈ కేసును సీబీఐకి అప్పజెప్పి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డిది రౌడీ బుద్ధి అని, ఆయన నాయ కత్వంలోనే హత్యా రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించారు. నల్లగొండ నయీమ్‌గా ఎమ్మెల్యే వీరేశం నేరాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అధికార పార్టీ ఆగడాలను అరికట్టడం చేతగాదని పోలీసులు ఒప్పు కుంటే కాంగ్రెస్ కార్యకర్తలు తమ తడాఖా ఏమిటో చూపిస్తా రన్నారు. న్యాయం చేయకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ నిందితుల కాల్‌లిస్ట్‌ను బయట పెట్టి విచారణ జరపాలన్నారు. దూదిమెట్ల సత్తయ్య, సుభాష్ యాదవ్, తఖీ, లతీఫ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
దర్వాజ
హైదరాబాద్ 4
సోమవారం 29-1-2018

నేను ఏ కొందరిలో...!

ప్రశ్నల పిడికిళ్ళ ప్రభంజనం
ఒక్కటై సాగనంత కాలం
దేన్ని సాధించలేమని కొందరు.
జనవాహిని తరంగాల ఉప్పెనలు
ఎగిసి పడనంతవరకు
నీమ్మకు నీరెత్తినట్లునని కొందరు.
మార్పు రాగాలు వినిపిస్తున్నాయని
కూనిరాగాలు తీస్తున్నారు కొందరు.
నడిచే ఎద్దుకు దెబ్బలెక్కువన్నట్లు
సామెతలు వల్లెవేస్తున్నారు కొందరు.
ఒక నిర్మాణాత్మకమైన పథంలో
పనులన్ని చకచక జరుగుతున్నాయనే
భ్రమల్లో కొట్టుకపోతున్నారు కొందరు.
ఇంతకంటే గొప్పగా ఎక్కడ లేదని
తొడలు కొడుతున్నారు కొందరు.
కాసుల పెట్టెలు ఎప్పుడు లేనంతగా
నిండు కుండల్లా తలపిస్తూన్నాయని
హర్షం వ్యక్తం చేస్తున్నారు కొందరు.
త్యాగాలు మావి భోగాలు మీవా యని
నినాదాల బాట పట్టిండ్లు కొందరు.
సంతోషంగా గడుపుతుంటే
గిట్టనివాళ్ళు బురదజల్లుతున్నారని
ఘాటుగానే స్పందిస్తున్నారు కొందరు.
ఉన్నది ఉన్నట్లుగా రాస్తున్నవారిని
నిర్మూలన చేస్తున్నవారు కొందరు.
అన్యాయం అన్యాయమంటు
గగ్గోలు పెడుతున్నారు కొందరు.
ఇది ఇంతేనంటూ ఊకదంపుడు
మైకాసురులైనారు కొందరు.
ఎవరు ఎవరికి అనుచరులోనని
సహచరులోనని గుర్తించుకునే
తరుణంలోనే మారుతున్నారు కొందరు
జాగ్రత్తగా ఆలోచించండి సుమా
నేను ఏ కొందరిలో ఉన్నానో...!

– గోపగాని రవీందర్, 9440979882

కవితా రూపం - సరళ కథనం

రూపం నిర్మాణం, శిల్పం ఈ మూడు వేరు వేరు. చాలా వరకు రూప నిర్మాణం, శిల్ప నిర్మాణం అనే పదబంధాలు కాస్త అజాగ్రత్తగానే వాడుతాం. రూపం గురించి మాట్లాడుకుంటే ప్రాథమికంగా మూడు కవితారూపాలు కనిపిస్తాయి. రూపం వస్తువుననుసరించి తానుగా పుట్టేదే తప్ప మరోటి కాదనేది ఒక వాదన. నిజానికి ఒక మార్గంలో సత్యం కూడా. ఏ రూపంలో కవితనివ్వడం వల్ల తన సంవేదన, భావన సార్థకమౌతుందో కవికి తెల్సి ఉండాలి. ఇది 'ఇంట్యూషన్' వల్ల స్ఫురిస్తుంది అనేది వినిపిస్తుంది. అలా స్ఫురించడానికి, రూపానికి సంబంధించిన ఆవిష్కరణ తెలియడానికి కూడా రూపానికి సంబంధించిన ఆలోచనలు కావాలి.

రూపం బయటికి కనిపించే రూపం, భౌతిక రూపంగా లక్షణరూపంగా రెండు రకాలు. ఎత్తుగడ, ప్రతిపాదన, భావచిత్రాలు, యూనిట్లు, ముగింపు ఇలా వీటిని అంచనా వేయవచ్చు. భౌతిక రుపాల ఉనికి కవితను అనుసరించే ఉంటుంది తప్ప మరోకటి కాదు. ఇక లక్షణ రూపం అంతర్గతంగా ఏ రూపాన్నానుకుని కవిత్వం చెబుతున్నాడు అనేది. అంటే భావనను, ఉద్వేగాన్ని, లేదా చైతన్యాన్ని పాఠకుడికి చేరవేయడానికి ఏ రూపాన్ని ఆశ్రయిస్తున్నాడు. అనేది లక్షణ రూపం నిర్ణయిస్తుంది. ఉరామరికగా ఈ రూపాలు మూడున్నాయి. 1. కథానాత్మక కవిత (Narrative poem) 2. వర్ణనాత్మక కవిత (Descriptive Poem) 3. ప్రయోగాత్మక కవిత (Experimental Poem). ఇవి ప్రాథమిక విభాగాలు. మళ్ళీ వీటిలో అంతర్భాగాలుండొచ్చు.

కథనాత్మక కవితకు మూలం కథేననేదానికి సంశయం లేదు. ప్రాచీన మౌఖిక సాహిత్యంలో ఒక ఉదంతాన్ని చెప్పడానికి, లేదా కథను చెప్పడానికి ఈ మార్గాన్ని ఉపయోగించే వారు. అగ్ని పురాణంలో చెప్పిన అయిదురకాల కథల్లో 'ఖండ కథ, ఆఖ్యాయిక' ఈ రెండు కథానాత్మకతకు సంబంధించినవి. అఖ్యాయికా అనేది సంపూర్తిగా ఒక వ్యక్తి చెప్పినట్టుగా ఉండేది. ఖండ కథ ఒక పూర్తి కథను కాకుండా ఒక భాగాన్ని, లేదా అంశాన్ని చెప్పేది. వచన కవితకు ప్రధానంగా 'ఖండ కథా' అనేది ఎక్కువ సమాంతరంగా కనిపిస్తుంది. తెలుగు విమర్శలో 'ఖండిక' అనేపదం కూడా కవితకు చాలా ప్రాచుర్యమున్న పదం. కథనం అనేది ప్రాతిపదికగా నాటకానికి సంబంధించినది. ఆ తరువాత కవిత్వానికి తెలుగులో, ఏ భాషలో నైనా ప్రాచీన కాలంనుండి ఇప్పటిదాకా వచ్చిన కావ్యాలన్నీ ఆఖ్యానాలే. కథనంలో అది విశ్వాత్మను సూచించేది వైయ్యక్తికాత్మను సూచించేదీ ఏదైనా కొన్ని ప్రాతిపదిక లక్షణాలు కలిగి ఉంటుంది. చెప్పే అంశం, దాని అమరిక, పాత్రలు, సంవేదన, వాదన వీటితోపాటు ఒక పునః పరిష్కారం ఉంటాయి. ఇవి ప్రాథమిక లక్షణాలు. ఇవి కథలోంచి అన్ని కథనాలకు సంబంధించినవి. కవిత్వంలోని ఆఖ్యానానికి, కథలోని కథనానికి మధ్య తేడాలు గుర్తించడానికీ కొన్ని అంశాలున్నాయి. 1.కథలో రెంటికి మించిన పాత్రలుండొచ్చు. కవిత్వంలో రెండు మాత్రమే పరిమితి. కవితలో సంభాషణాత్మక కవితలో తప్ప ఒకటికి మించిన పాత్రలుండవు. ఇవి పరస్పరం మాట్లాడుకుంటాయి. ఒక్కోసారి పాక్షిక సంభాషణ కూడా ఉండవచ్చు. 2.కవితను కేవలం కథనాత్మక కవితగా చూడొచ్చు. ఒక కవి తప్ప ఇందులో మరొకరు మాట్లాడరు. కవి తానుగా ఏదో ఒక పాత్రలో లీనమౌతాడు. పూర్తి కవిత ఇలాగే కొన సాగుతుంది. కథలో ఈ అంశాలు వీలుకాదు. పైగా కథనం నుంచి సంభాషణకు సంభాషణ నుండి కథనానికి వెళ్ళొచ్చు. 3. కథకు నిడివి ఎక్కువ. కవితకు ఆ అవకాశం లేదు. 4. కథకు విషయం ప్రధానం కవితకు వ్యక్తీకరణ ప్రధానం ఇలాంటి అంశాలు కథ, కవిత్వాలలోని కథనాన్ని వేరుచేస్తాయి.

చెప్పే పద్ధతిని అనుసరించి కథనంలో కొన్ని పద్ధతులున్నాయి. 1. సరళ కథనం (లైనర్ నరేటివ్); ఏ మలుపూ లేకుండా గందరగోళం లేకుండా అంశాన్ని సూటిగా చెప్పేది. 2. సరళం కాని కథనం (నాన్ లైనర్ నరేటివ్); కథనంలో క్రమాన్ని మార్చి చెప్పటంగానే కనిపిస్తుంది. కాని కవిత్వం విషయంలో తాత్వికంగా చెప్పటం, వినిర్మాణ రీతిలో చెప్పటం, ప్రతీకాత్మక భాష (ఫిగరేటివ్ లాంగ్వేజ్) లో చెప్పడం మొదలైన వాటివల్ల సరళత చెడుతుంది. కాని కవిత్వ రూపం కథనంలోనే ఉంటుంది. 3. సంభాషణాత్మక కథనం (కాన్వెర్సివ్ నరేటివ్); ఇద్దరు మాట్లాడుకున్నట్టుగా ఉండడం కవిత్వంలో పరిమితి. ఒక్కోసారి ఇందులో పాక్షికత కూడా ఉండవచ్చు. ఆఖ్యాత ఒక్కడే "నువ్వు ఇలా అన్నావ్" అంటూ ఇద్దరి మాటలను ఒకడే చెప్పడం. 4. సంలీనాత్మక (ఇంటరాక్టివ్ నరేటివ్); కథనంలో శ్రోతను లేదా పాఠకున్ని లీనమయ్యేట్టుచేసి అనేకమైన సమాంతర ఇతి వృత్తాలు స్ఫురించేలా చేసేది. చాలా వరకు ప్రస్తుత సందర్భాన్ని అంశం నుంచి తొలగించి విశ్వ సూత్రాన్ని స్ఫురించేలా చేయడం ఇక్కడ జరిగేది.

తెలుగులో తొలిదశలో వచ్చిన కవిత్వమంతా సరళ కథనం గానే ఉంది. కాళోజి, సినారె, దాశరథి లాంటి వాళ్లలో ఈ మార్గం కాస్త ఎక్కువగా కనిపిస్తుంది.



> అలిశెట్టి కవితలో మొదటి వాక్యంలో పరోక్ష ప్రస్తావన (అల్యుజన్) లున్నాయి. వీటిద్వారా కవి ప్రతిపాదించే విషయాలు పాఠకుడి నుండి కొంత జ్ఞానాన్ని అపేక్షిస్తాయి. 'బెర్నార్డ్షాలు, షేక్ స్పియర్లూ' రచయితలని మాత్రమే కాకుండా సృజన కారులు, సామాజిక వేత్తలు. షేక్ స్పియర్‌కు వైవాహిక జీవిత విముఖత్వం ఇక్కడ పక్క వాక్యం యొక్క సంయోజనం వల్ల గుర్తుకొస్తుంది. చలం, గురజాడలు రచయితలనే కాక స్త్రీల వైపు నిలబడ్డారు. ఈ ప్రస్తావనల వల్ల తాము స్త్రీ పురుషులుగా కాకుండా, ఏ సైద్ధాంతిక దృష్టికి వెళ్లకుండా ఉన్నామని ప్రతిపాదిస్తున్నారు. తరువాతి వాక్యాలు దంపతుల మధ్యలోని సామాన్య జీవనాన్ని చెబుతాయి.

నాకు బెర్నార్డ్షాలు, షేక్ స్పియర్లూ తెలియదు/ తనకు గుడిపాటి వెంకట చలం, గురజాడా తెలియదు
ఇద్దరం ఉత్త పిచ్చివాళ్ళం/ –కాని/ అడుగంటిన కిరసనాయిల్ స్టవ్ తో
అన్నమెట్లా ఉడికించాలో తనకు తెలుసు/ దగ్గుతెరల నెత్తుటి రెపరెపల ఊపిరి తిత్తుల్లో
కవిత్వమెట్లా రాజెయ్యాలో నాకు తెలుసు –(భాగ్యలక్ష్మి–అలిశెట్టి ప్రభాకర్. మరణం నా చివరి చరణం కాదు)
నీళ్ళు, కన్నీళ్ళు కలిసి పారనీ/ వాళ్ళు, వీళ్ళు కలిసే తిరగనీ
నువ్వు మాత్రం మారిపోకు/ మనం మనుషులుగా మారనీ
బతకడం ఒక కష్టమైపోతే,/ బతికించడం మరిచేపోతే
బతుకమ్మల పండుగేల/ బతుకు నిన్నే మరిచిపోతే
రానీ వాడి ఆలోచనలే నడుస్తాయి/ పోనీ వాడి ఊహలే రాజ్యమేలుతాయి
కానీ, ఇట్లాగే నడుస్తదా కాలం/ అయితే నేల విడిచి ఏం ఏలుతాయి–
(రుమాళ్ళు– శ్రీరామోజు హరగోపాల్)

ఈ రెండు సరళ వచనాలే. కథలో సరళ వచనం అంటే క్రమాన్ని ఆనుకుని చెప్పడం. కవిత్వంలో భాష అధిభాష అంటే సాధారణ భాషకన్నా వైవిధ్యమైనది. ఈ అధిభాషా లక్షణాని కన్నా సాధారణ భాష వాడటమే కవిత్వంలో సరళ కథనంగా కనిపిస్తుంది.

అలిశెట్టి కవితలో మొదటి వాక్యంలో పరోక్ష ప్రస్తావన (అల్యుజన్) లున్నాయి. వీటిద్వారా కవి ప్రతిపాదించే విషయాలు పాఠకుడి నుండి కొంత జ్ఞానాన్ని అపేక్షిస్తాయి. 'బెర్నార్డ్షాలు, షేక్ స్పియర్లూ' రచయితలని మాత్రమే కాకుండా సృజన కారులు, సామాజిక వేత్తలు. షేక్ స్పియర్‌కు వైవాహిక జీవిత విముఖత్వం ఇక్కడ పక్క వాక్యం యొక్క సంయోజనం వల్ల గుర్తుకొస్తుంది. చలం, గురజాడలు రచయితలనే కాక స్త్రీల వైపు నిలబడ్డారు. ఈ ప్రస్తావనల వల్ల తాము స్త్రీ పురుషులుగా కాకుండా, ఏ సైద్ధాంతిక దృష్టికి వెళ్లకుండా ఉన్నామని ప్రతిపాదిస్తున్నారు. తరువాతి వాక్యాలు దంపతుల మధ్యలోని సామాన్య జీవనాన్ని చెబుతాయి. మొదటి వాక్యం రెండవదానికి బలాన్నిస్తుంది. హరగోపాల్ వాక్యాలు ఒక సంఘర్షణను చెబుతాయి. చివరి వాక్యం "పోనీ వాడి ఊహలే రాజ్యమేలుతాయి కానీ, ఇట్లాగే నడుస్తదా కాలం/ అయితే నేల విడిచి ఏం ఏలుతాయి" –లో వస్తుసంబంధమైన ప్రతిపాదన ఉంది. ఒక ఓదార్పును, సంఘర్షణనుంచి స్వాంతన పడడాన్ని ఈ గొంతు చెబుతుంది. కథనాత్మక దృష్టిలో ఇవన్నీ సరళ వచనాలు. వీటికి క్రమం ఉంది. అలాగని వీటిలో కవిత్వాంశాలను తెచ్చుకునే చూపుకూడా ఉంది. ఈ పరిశీలన తరువాత కొన్ని అంశాలను నిర్ధారించుకోవచ్చు. 1. సరళ వచనంలో అంశాన్ని చెప్పే క్రమంలో ప్రాథమిక పద్ధతి ఉంటుంది. 2. కవిత్వ పరికరాలు అంశాన్ని కప్పివేయవు, నైరూప్యతకు వెళ్లనీయవు. సంపూర్తిగా చెబుతున్నట్టుగా ఉంటుంది. 3. ప్రధానంగా అభిప్రాయం అనుభవం ఉంటుంది తప్ప, పాఠకుడిని తానుగా సంలీనం చేయదు. 4. విషయాన్ని చెబుతుంది కాని వ్యాఖ్యానం ఉండదు.

సరళ కథనం ఒక ప్రాథమిక రూపం. కవితా సంబంధమైన పరికరాలను విడదీసి చూస్తే కథకు దీనికి ఎక్కువ పోలికలు కనిపిస్తాయి. రూపం కవిత వ్యక్తంచేయడానికి ఉపయోగించుకున్న పద్ధతిని చెబుతుంది. కవిత్వ పరికరాలు (పోయటిక్ డివైసెస్) చెప్పే పద్ధతిలో భాగాలవుతాయి కాని, ఇవి రూపం కాదు. భావ చిత్రాలు, పద చిత్రాల్లాంటివి కూడా కళా పరికరాలే కాని ఇవీ రూపం కాదు. సరళ కథనంలో ఎక్కువగా ప్రథమ పురుషకథనం ఉంటుంది. ఉత్తమ పురుషలోనూ ఉండవచ్చు. కాని మిగతా ఆఖ్యానాలతో వైరుధ్యం ఉంటుంది. హరగోపాల్ కవిత పాక్షికసంభాషణ (పార్షల్ కాన్వర్సేషన్) లాంటిది. అలిశెట్టి కవితలో మేము అనే ఉత్తపురుష ద్వివచనం ఉంది. ఇవి కథనంలోని వైవిధ్య రూపాలు. కాని కథనం ఒకటే. పూర్తిగా ఆఖ్యానంలో ఆఖ్యానంతో పాటు సంభాషణాత్మకత, ప్రబోధాత్మకత ఉంటాయి. చివరి రెండు సంభాషణకు ఉదాహరణ. కాళోజి కథనం ప్రబోధానికి ఉదాహరణ.

– మ.నా.శర్మ, 9848348502

రెండూ ఒకటే అయినప్పడూ...

వృత్తి – బాధ్యత
ప్రవృత్తి – ప్రేమ రూపం!

వృత్తి ఎంత పెద్దదైనా కావచ్చు
గడ్డిపోచ విలువియ్యని చిన్నదీ అవొచ్చు!

దాన్ని నీ ప్రవృత్తికి
సమాంతరంగా నిలపలేనప్పుడు
దాన్ని ఒదిలేసి
ప్రవృత్తినే వృత్తిగా స్వీకరించి
జీవన గీతాన్ని
హాయిగా పాడుకుంటూ సాగిపో!

వృత్తీ ప్రవృత్తీ
రెండూ ఒకటే అయినప్పుడు
బతుకు యాత్ర ముగిసే లోపే
నీ జీవన లక్ష్యం నెరవేరుతుంది.

– మునిమడుగుల రాజారావు, 7013577140

సాహిత్యవార్తలు

అమ్మంగి వేణుగోపాల్ రచనల ఆవిష్కరణ

డా॥ అమ్మంగి వేణుగోపాల్ రచించిన వివిధ గ్రంథాల ఆవిష్కరణ, అంకితోత్సవం ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి, మొదటి అంతస్తు సమావేశ మందిరంలో జరుగుతుంది. డా॥కె.వి.రమణాచారి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, మామిడి హరికృష్ణ, బి.నరసింగరావు, డా॥నందిని సిధారెడ్డి, డా॥ఏనుగు నరసింహారెడ్డి, వేణు సంకోజు, డా॥తిరునగరి, ప్రొ॥పి.లక్ష్మీనారాయణ, డా॥అంపశయ్య నవీన్, ఎలనాగ, కె.పి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

బొందుగులపాటి సాహితీ పురస్కార సభ

కరీంనగర్ సాహితీ గౌతమి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో బొందుగులపాటి సాహితీ పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో జరుగుతుంది. ఇందులో డా॥నందిని సిధారెడ్డి, ఆచార్య ఎస్వీసత్యనారాయణ, దాస్యం సేనాధిపతి, డా॥ఎయం.అయోధ్యారెడ్డి, బి.శ్రీకాంత్, గాజుల రవీందర్, డా॥గంద్ర లక్ష్మణరావు, మాడిశెట్టి గోపాల్, కె.ఎన్.అనంతాచార్య, కూకట్ల తిరుపతి, డా॥బి.వి.ఎన్.స్వామి పాల్గొంటారు.

రాజారాం మహారాజ్ పురస్కారం

రామదాసి రాజారాం మహారాజ్ స్మారక సాహితీ పురస్కారాలు అయాచితం నటేశ్వర శర్మ, ఏనుగు నరసింహారెడ్డి, దాస్యం సేనాధిపతి, వి.పి.చందన్‌రావు, శ్రీచరణ్, పాయల్‌లకు ప్రకటించారు.

మిగిలిపోయిన మట్టితో చేయబడిన రెండవతరగతి జనం



రాత్రి వేటుకు
సూర్యకిరణం తలతెగి నేలకూలిందా
భళ్ళున తెల్లారింది, కానీ
పగలు హతమారినట్లుంది...
పొయ్యి మీది ఖాళీ కుండలాంటి దేహం
లేచింది...
మరో రోజును కాటికి సాగనంపే
ప్రయత్నం...

ధూళి మేఘాలు అలుముకున్న కళ్ళలో
ప్రతి క్షణమూ హోరువానలే..

ఒక పైకప్పు కోసం కలలు కంటూ
ఆకాశమే పైకప్పుగా నిద్రించే దేహాలు
నిద్రించే దుకాణాల మెట్లే తలగడలు
రిక్షావాలాలు, ఆటోవాలాలు
మెకానిక్కులు, కూలీలు
కొండలాంటి సమాజాన్ని మోసే దేహాలు

మనిషి మట్టితో చేయబడ్డాడు
ఈ దేహాలు మిగిలిపోయిన మట్టితో
చేయబడ్డాయి

ఉపాధి కోసం ఉద్యమించడం తెలియదు
ఎక్కడో జరిగిన పేలుడుకు
ఇక్కడ రాలిపడే దేహాలు

ప్రతి నగరంలోను పాతనగరంగా
బావిలో నీళ్ళలా...
ప్రవాహమెరుగని దేహాలు

కనీసం కన్నీళ్ళయినా
వరదగోదావరుల్లా ప్రవహిస్తే
చలనమంటే ఏమిటో తెలుస్తుందేమో...

– వాహెద్, 9848787284

సాహితీ రూపాల్లో వేశ్యా ప్రసక్తి



సభ్యసమాజానికి జుగుప్సను, వెగటును కలిగించే వేశ్యావృత్తి ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రాచీన వృత్తుల్లో ఒకటి. వేదాలు మొదలుకొని ఇటీవలి నానీలు దాకా సంస్కృత, ప్రాకృత, పాశ్చాత్య, ఇతర భారతీయ భాషల సాహిత్యాలలోంచి, ప్రాచీన ఆధునిక తెలుగు సాహిత్యాల లోంచి వేశ్యావృత్తి, కుటుంబేతర స్త్రీ పురుష సంబంధాలు గల సందర్భాలను వెలికితీసి రచయిత ఈ పుస్తకాన్ని రాశారు. ఇందులో వేశ్యలు, దేవదాసీలు భారతదేశ చరిత్రలో నిర్వహించిన భూమికలను విడమరచి చెప్పారు. వేశ్యలు నిష్ణాతులైన నాట్యశాస్త్రం, వాత్సాయన కామసూత్రాలు వంటి అంశాల నేపథ్యం గురించి తెలిపారు. అలాగే ప్రపంచ సాహిత్యంలోంచి తనకు వీలయినన్ని వివరాలను సమీకరించి అన్వయించారు.

ప్రాచీన సమాజాల్లో, పాశ్చాత్య, భారతీయ సినిమాల్లో సైతం ప్రతిబింబించిన వేశ్యా జీవితాలను పరామర్శించారు. ప్రాక్పశ్చిమ సాహిత్యంలో, ప్రపంచ దేశాలలోని ప్రసిద్ధ వేశ్యల గురించి చర్చించారు. ఆనాటి నుండి ఈ నాటి వరకు వేశ్యల జీవితాలలో సంభవించిన అనేక పరిణామాలను వివరించారు. ఇవాళ స్త్రీలు, వేశ్యావృత్తిలోకి ప్రవేశించడానికి గల కారణాలను, వారి పునరావాసం కోసం జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు. కుటుంబేతర వ్యవస్థలోని స్త్రీల పట్ల పూర్తి సానుభూతితో, వాళ్ళ జీవిత సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధతతో, అనేక సాహిత్య గ్రంథాలను విస్తృతంగా అధ్యయనం చేసి ఈ పుస్తకాన్ని రూపొందించిన రచయిత కృషి ప్రశంసనీయం.

ఎర్రని ఆకాశం (ప్రాక్పశ్చిమ సాహితీరూపాల్లో వేశ్యా ప్రసక్తి)
డా॥పి.రమేష్ నారాయణ
పేజీలు : 170, వెల : 200/–
ప్రతులకు : 9441383888

– కె.పి.అశోక్‌కుమార్, 9700000948

గోలకొండ కథల దండ

సమకాలీన జీవన చిత్రణే కథ నిర్మాణానికి మూలధాతువు. ఆ లక్షణమే కథకు జాతి చరిత్ర పదగతుల పక్కన నిలిచే అవకాశం ఇచ్చింది. చరిత్ర పఠనం ద్వారా కాలక్రమేణ జరిగిన రాజకీయ, సామాజిక తదితర భౌతిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. అదే కథలు చదివితే ఆ కాలపు కట్టుబాట్లు, జీవనశైలి, మనుషుల్లో వచ్చిన మానసిక, సైద్ధాంతిక మార్పు అవగతమవుతాయి. సాహితీ ప్రక్రియల్లో కథలకు, నవలలకు ఉన్నంతగా విశాల మానవ అనుబంధాల వేదిక వేరే వాటికి లేదు. పాత కథల్లో మన ముందు తరాలు అనుభవించిన కాలం ఒత్తిడి, వారి విశ్వాసాల్లో వచ్చిన మార్పు, సాంఘిక వైజ్ఞానిక సరళిపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ప్రస్ఫుటంగా కనబడతాయి. ఆ పరిజ్ఞానం వర్తమాన సమాజానికి మార్గదర్శనంగా ఉపయోగపడుతుంది.



పై నేపథ్యంలో గోలకొండ పత్రికలో వచ్చిన కథల సంపుటీకరణ ప్రాముఖ్యతను అందుకుంది. గోలకొండ పత్రిక అనగానే తెలంగాణ వాసులకు దగ్గరి బంధువు పేరు విన్నట్లే ఒళ్ళు పులకరించిపోతుంది. ఏనాడో ఆగిపోయిన గోలకొండ పత్రిక తెలంగాణ అస్తిత్వం కోసం చేసిన పోరు, ఎదుర్కొన్న సవాళ్ళు, వాటికి జవాబిచ్చిన తీరు ఆ అనుబంధాన్ని దృఢపరచింది.

గోలకొండ ద్వివార పత్రికగా నడిచిన రోజుల్లో 1926 నుండి 1935 మధ్య కాలంలో దాంట్లో ప్రచురితమైన కథల సంపుటి ఇది. జులై 1933 సంచికతో సారస్వతానుబంధం ప్రవేశపెట్టి కథలు, సాహిత్య వ్యాసాలు, పద్యాలను ప్రోత్సహించడం విశేషం. అంతముందే 26 మే 1926 సంచికలో కథల పోటీ నిర్వహించారు. నిజాం రాష్ట్రాంధ్రులలో కథలు వ్రాయు పద్ధతిని ప్రోత్సహించుటకై ఈ బహుమానం ఏర్పరచబడినది, అత్యుత్తమ కథకు 5/– బహుమానమియ్యబడును అని నియమాల్లో ఉంది. ఈ పోటీ నిజాం రాష్ట్రాంధ్ర జన కేంద్ర సంఘం నిర్వహించింది. ఆ సంఘం ఆనాటి కార్యదర్శి మాడపాటి హనుమంతరావు.

ఈ సంపుటిలో ఉన్న 52 కథల్లో చిన్న కథలే ఎక్కువ. 1934 నుండి 'మా చిన్నకథ' అనే శీర్షికలో ప్రచురించారు.

'నేరేడు పండ్లు కంటు' కథలో మాలస్త్రీ అమ్మిన నేరేడు పండ్లకు అంటు ముట్టు ఎక్కడిదని బ్రాహ్మణి భర్తను నిలదీస్తుంది. అస్పృశ్యతను వ్యతిరేకించిన కథ ఇది.

'హేట్లు – చీరెలు'లో అనవసరపు తెల్లదొర బట్టలు వేసుకొనే డాంబికాన్ని ఎద్దేవా చేసిన కథ.

'భగ్న హృదయుడు' ఓ విఫల ప్రేమికుడి మనోభావనల కావ్యకథనం.

కృష్ణ రాసిన 'కమ్మలు' కథ హాస్యం పండించే మధ్య తరగతి దంపతుల వృత్తాంతం భార్యకు చెవి కమ్మలు కొనే విషయాన్ని మరిపించలేక పడే అవస్థ ఈ కథ.

'ఠానేదారు' ఆనేది పోలీసుల దుర్బుద్ధిని తెలిపే కథ. గంగరాజు రఘునాథరావు రాసిన ఈ కథలో సలాం సాహెబు అనే ఠానేదారుకు ధర్మారెడ్డి అనే గ్రామపెద్ద నేర్పిన గుణపాఠం కథపై ఆసక్తిని పెంచుతుంది.

'వకీలు యెంకయ్య' ఆనాటి బూటకపు మనుషుల దొంగ ఎత్తులను చెబుతుంది.

1934లో ఉన్నవ వెంకటరామయ్య రాసిన కథ 'రెండు శవాలు' ఆనాటి వెట్టి బతుకులకు అద్దం పడుతుంది. సంభాషణల్లో తెలంగాణ యాస గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా ఉంది. నేటికీ నూతనత్వం కనబడే కథన శైలి రచయిత ప్రతిభకు నిదర్శనం.

'విఫలజీవి' మోసపోయిన అమీనాబీ కొడుకు ఎడబాటుతో పిచ్చిదయిన తీరు చెప్పేకథ.

సురవరం ప్రతాపరెడ్డి కథ 'నిరీక్షణము' శంకరన్, కుమారీల విషాద ప్రేమగాథ. పెళ్ళి తంతులో భాగంగా చేపలు పట్టుకొచ్చేందుకు సముద్రంలోకి పోయి, తిరిగి రాని శంకరన్ కోసం కుమారి నిరీక్షణమే ఈ కథ.

'ఊర్వశి' సంభాషణల రూపంలో ఉన్న ఊర్వశి అర్జునుల శృంగార అధ్యాయం.

బట్టల వ్యాపారి తెలివిగా కొలత తక్కువ ఉన్న రెవిక గుడ్డను ఎలా అంటగట్టాడో బొడ్డు బాపిరాజు 'రెవికల గుడ్డ' కథ చెబుతుంది.

ఆడవారి అలంకరణకు తీసుకొనే సమయాన్ని హాస్యంలో పండించిన కథ 'ఒక నింషం'.

భాస్కరభట్ల కృష్ణారావు కథ 'శశి' ఆసక్తికరంగా సాగుతుంది.

ఈ కథలను ఆనాటి తెలంగాణ రచయితలు రాసిన తెలుగు కథలుగానే భావించాలి, అంటే తెలంగాణ కథ అనే ప్రత్యేక గుణం తక్కువగా కనపడుతుంది. అందులోనూ హైదరాబాద్, నల్లగొండ జిల్లాల జీవన కథనమే ఎక్కువ. మిగతా తెలంగాణ ప్రాంతానికి చెందిన రచయితలు ఈ సంపుటిలో ఉన్నారో లేరో కాని ఆ జీవనం కథల్లో కనిపించదు. కథల్లో అప్పటికి కాల్పనికతదే పై చేయి ఉండడం వల్ల ఇలా గోచరించవచ్చు.

భాషాపరంగా చూస్తే ఆనాటికే తెలుగు కథల్లోని భాష వ్యవహారిక తోవ పట్టినట్లే కనిపిస్తుంది. కొందరు కథకులు మాత్రం కథాంశాన్ని బట్టి గ్రాంథికం ఎంచుకున్నారు. చివరి ఇరవై కథలు 1935లో రాసినవి. వీటిలో అధికం వ్యవహార భాషలోనే ఉన్నాయి.

ఆనాటి కథలను మళ్ళీ ఈ తరానికి సేకరించి ఇచ్చిన వారి శ్రమ, ప్రచురణ కర్తల కృషి మెచ్చదగినవి. గోలకొండ పత్రికలో తమ గురువుకు సంబంధించిన వార్తల వెతుకులాటలో ఆనంద్, వెంకటరమణలకు ఈ కథలు తారసిల్లడం, వాటిని ఆసక్తితో సేకరించడం తెలుగు కథాభిమానునలకు ఒక వరంగా భావించాలి.

గోలకొండ కథలు,
సేకరణ – కూర్పు : యామిజాల ఆనంద్, డా॥ వి.వి. వెంకటరమణ,
పేజీలు : 250, వెల : 190/–, ప్రతులకు : నవచేతన పుస్తక కేంద్రాలు.

– బి.నర్సన్, 9440128169

manavi@navatelangana.com
మానవి
నవతెలంగాణ

జిడ్డు మటుమాయం...

జిడ్డు చర్మం గలవారి ముఖం తొందరగా నిర్జీవంగా మారుతుంది. ఇక బయట తిరిగే వారైతే త్వరగా దుమ్ము, ధూళి పేరుకుపోయి మొటిమలు రావడం, చర్మం నల్లగా మారడం వంటి సమస్యలు ఎక్కువగా వస్తాయి. జిడ్డు చర్మాన్ని ఎలా తొలగించుకోవాలో! ముఖాన్ని తాజాగా, కాంతివంతంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- ఆపిల్ సైడర్ వెనిగర్ చర్మంపై ఉండే జిడ్డును తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మొటిమల సమస్యను కూడా దూరం చేస్తుంది. చర్మం పై ఉండే బ్యాక్టీరియాను నివారించడంలో చక్కగా పని చేస్తుంది. ఒక చెంచా ఆపిల్ సైడర్ వెనిగర్‌లో రెండు చెంచాల గులాబీ నీటిని కలపాలి. ఈ మిశ్రమంలో కాటన్ క్లాత్‌ను ముంచి ముఖానికి అప్లై చేసుకోవాలి. ఐదు నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఆపిల్ సైడర్ వెనిగర్, గులాబీ నీరు చర్మంపై జిడ్డును తొలగిస్తాయి. దాంతోపాటు చర్మాన్ని టైట్‌గా ఉంచి, ముడతలను నివారించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అలాగే చర్మరంధ్రాల్లో మలినాలను కూడా తొలగిస్తాయి.
- రెండు చెంచాల ముల్తానీ మట్టిలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి నిండుగా పట్టించాలి. 20-25 నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం తాజాగా, మృదువుగా తయారవుతుంది.
- టమాటాను సన్నగా కట్ చేసుకొని ముఖానికి మృదువుగా రుద్దుకోవాలి. 15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే సరిపోతుంది. టమాట చర్మానికి సహజ టోనర్‌గా, మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది. టమాటాలో ఉండే బ్లీచింగ్ ఏజెంట్స్ చర్మంపై ఉండే జిడ్డును, మృతకణాలను తొలగిస్తాయి. ❄

పరధ్యానంలో ఉన్నారా!

ఏకాగ్రత మంచిదే కానీ పరధ్యానం మంచిది కాదని చెబుతున్నారు నిపుణులు. ఇక పరధ్యానంలో ఉంటే అసలు విషయంపై దృష్టి సారించలేరు. చేసే పని పక్కదారి పడుతుంది. పరధ్యానానికి ఎన్నో కారణాలు ఉంటాయి. వాటితో ఎన్నో సమస్యలు కూడా వస్తాయి. వాటిని అధిగమించడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పరిష్కారం దొరుకుతుంది.



- ధ్యానం అంటే ఆరోగ్యం, ప్రశాంతతను కలిగించేదిగా చెబుతుంటారు చాలామంది. మరీ పరధ్యానం అంటే మనిషి మాత్రం ఉండి ఆలోచనలు ఎక్కడో ఉంటాయి. చేసే పని మీద బొత్తిగా ఏకాగ్రత ఉండదు. ఏ పని చేస్తున్నారో ఆ పని మైండ్‌లో రిజిస్టర్ కాదు.
- పరధ్యానం పిల్లల్లో, పెద్దల్లో గమనించినట్లయితే... పిల్లల్లో అయితే చదువుల్లో వెనకబడేలా చేస్తుంది. ఇక పెద్దవారైతే చేసే పనిలో తప్పులు దొర్లడం, కెరీర్‌లో ఎదుగుదల లేకపోవడం వంటి నష్టాలు సంభవిస్తాయి.
- పరధ్యానం అనేది తీవ్రతరమైన మానసిక జబ్బు. వ్యక్తి తన ఆలోచనల్లో తాను ఉండిపోతాడు. చుట్టు పక్కల వాతావరణం అంతా బాధాకరంగా అనిపిస్తుంది. అందరు బాధపెట్టేవారిగానే కనిపిస్తారు. మెదడులో రకరకాల అనుమానాలు పెట్టుకుంటారు.
- అలాగే తమ ముందు ఎవరు లేకున్నా ఎవరో వచ్చి మాట్లాడుతున్నట్టుగా ఉంటారు. కొన్నిసార్లు మందుల ప్రభావం, వ్యసనం వల్ల కూడా ఇలా జరుగుతుంది. ❄

నిత్యం ప్రజల మధ్యనే ఉంటా...



రాజకీయాలంటే సంపాదన.. పదవుల పందేరం.. ఎత్తుకు పైఎత్తులు. కానీ రాజకీయాలంటే ప్రజల మధ్య ఉండటం అని నమ్మారామె. మహిళలు రాజకీయాల్లో నెగ్గుకురావడమంటే పులిమీద సవారీ. ఇక ఏ రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి వస్తే.. ప్రతి రోజూ పోరాటమే. యువతిగా జనశక్తిలో పనిచేసినా... మలితెలంగాణ ఉద్యమమే ఊపిరిగా బతికినా... ఇప్పుడు మరో రాజకీయ పార్టీలో ఉన్నా... పోరాటాన్ని వదలలేదు. ఏ రాజకీయాల్లో ఉన్నా మహిళలపై అణచివేతను ప్రశ్నించారు. ఆ నేత బండ్రు శోభారాణి. రాజకీయాల్లో మహిళల స్థానమేంటి? ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో మహిళల స్థితిగతులేమిటి? ఈ 30 ఏండ్ల రాజకీయ జీవితం గురించి ఆమె పంచుకున్న ముచ్చట్లు...

బాల్యంలో అందరు ఆడపిల్లల జీవితాలు ఒకేలా ఉంటాయేమో! రామాయంపేట్ మండల్ ఝాన్సీలింగాపూర్ (అమ్మమ్మవాళ్ల ఊరి)లో పుట్టారు. పుట్టగానే మేనమామ చనిపోయాడు. 'ఆడపిల్ల పుట్టింది.. తీసుకుపొయ్యి మత్తడి గుండ్లల్ల పడెయ్యిపోండ్రి' అన్నారంట. 'మగపిల్లాడు అయితే అలా అనకపోయేవారు కదా!' ఆ మాటలు నన్ను ఎప్పుడూ వెంటాడతాయంటారామె. సొంతూరు డి.ధర్మారం. నాన్న ముత్యంగారి కిష్టారెడ్డి, అమ్మ లక్ష్మి. ఎప్పుడూ అమ్మాయి అన్న భావనతో చూడలేదు. టెంత్ వరకు ధర్మారంలో చదివారు. ఆమె హైస్కూల్ టైమ్‌లో నక్సల్ మూవ్‌మెంట్ అధికంగా ఉండేది. అప్పుడే ఊర్లో ఓ సమస్య వచ్చింది. కొందరు వాళ్ల నాన్నను అందులో ఇరికించారు. మూడేండ్ల నుంచి సమస్య నానుతోంది. దాన్ని పరిష్కరించడం కోసం ఆమె టెంత్‌లో ఉన్నప్పుడు నక్సల్స్ (జనశక్తి) వాళ్ల ఊరికి వచ్చారు. తండ్రిని తీసుకెళ్లారు. అది చూసి పరుగెత్తిన శోభారాణి 'మా నాన్నకు అందులో సంబంధం లేదు. ఎందుకు పట్టుకొచ్చారు?' అని నిలదీశారు.

వామపక్ష రాజకీయాల్లోకి...

అప్పటిదాకా నోట్లోంచి మాట వస్తుందా అన్నట్టు ఉండే అమ్మాయి.. తండ్రికోసం ధైర్యంగా నిలబడ్డారు. ఇల్లు, ఊరు తప్ప మరో ప్రపంచం తెలియదు. రాజకీయాలు అసలే తెలియదు. కానీ పాటలు, పుస్తకాలతో నెమ్మదిగా వామపక్ష రాజకీయాలవైపు ఆకర్షితురాలయ్యారు. ఊరులో కనిపించని సమానత్వమేదో ఆ రాజకీయాల్లో దొరికింది. అందుకే 'నేనూ వస్తానం'టూ ఇంటర్మీడియట్‌లోనే దళం వెంట నడిచారు. 1989లో ఇష్టపూర్తిగా యూజీలోకి వెళ్లిపోయారు. అప్పుడే ఐఎఫ్టీయూ నేషనల్ సెమినార్ నిజామాబాద్‌లో జరుగుతోంది. పార్టీవాళ్లు అక్కడికి పంపించారు. అది మొదలు... దళంలో వివిధ స్థాయిల్లో ఏడేండ్ల పాటు పనిచేశారు.

కడచూపు నోచుకోలేదు...

ఆ క్రమంలో బండ్రు భాస్కర్ (బండ్రు నర్సింలు కొడుకు)తో పెండ్లి చేయాలని పార్టీ నిర్ణయించింది. వెంటనే నాన్న అనుమతి తీసుకోవాలని ఆయనకు ఉత్తరం రాసింది. ఎంతకీ సమాధానం రాదు. కానీ విషయం ఏంటంటే అంతకు మూడు నెలల ముందే వాళ్ల నాన్న చనిపోయారు. ఆమె పార్టీలోకి వచ్చాక ఊర్లో గొడవలతో తల్లిదండ్రులిద్దరూ సిటీకి వెళ్లిపోయారు. మూసాపేట్‌లో ప్లంబర్‌గా పనిచేస్తూ ఓ చిన్న గదిలో అద్దెకు ఉన్నారు. ఏదో పండుగ కోసం తిరిగి ఊరికి వెళ్లినప్పుడు... తండ్రిని విషంపెట్టి చంపేశారు. 'ఉన్న ఒక్కగానొక్క కూతురిని. కన్నతండ్రిని కడచూపు చూసుకోలేకపోయాను. ఇలాంటి కష్టం ఇంకెవ్వరికీ రాకూడదు' అని కళ్లనీళ్లు పెట్టుకున్నారామె. బండ్రు భాస్కర్ అప్పుడు ఐఎఫ్టీయూ నిజామాబాద్ బాధ్యతలు చూస్తున్నారు. దాంతో పెండ్లి తరువాత నిజామాబాద్‌కు వెళ్లిపోయారు. అప్పుడు పార్టీపై తీవ్రమైన అణచివేత ఉంది. కేసులు ఉన్నాయి. పార్టీ మెదక్ జిల్లా కమిటీ సభ్యురాలిగా పనిచేశారు.

తెలంగాణ ఐక్య వేదికలో..

జనశక్తిలో అస్తిత్వ వాదాలు వచ్చిన తరుణంలో ఇద్దరూ పార్టీ నుంచి బయటికి వచ్చారు. అది తెలిసి ఆమె మామ (బండ్రు నర్సింహులు) ఇంట్లో ఉండనివ్వలేదు. ఉత్త చేతులతోనే హైదరాబాద్ పయనం. కళ్లముందు జీవితమంతా ఓ పెద్ద ప్రశ్న. అప్పుడు కంప్యూటర్స్ కొత్త. డీటీపీ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేశారు. ఒక ఆపరేటర్ సహాయంతో డీటీపీ వర్క్ చేయడం మొదలుపెట్టారు. మరోవైపు చదువు కొనసాగించారు. డిగ్రీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అయితే ప్రింటింగ్ ప్రెస్‌కు పౌరహక్కుల సంఘం డాక్యుమెంట్స్, జయశంకర్ పుస్తకాలు ప్రచురణకు వస్తుండేవి. టైప్ చేసే క్రమంలోనే ఆ పుస్తకాలన్నీ అధ్యయనం చేశారామె. తెలంగాణ మీద పూర్తి అవగాహన వచ్చింది. పోరాటం చేసిన స్ఫూర్తి పోదు కదా! జయశంకర్‌ని కలిసి, తెలంగాణ ఐక్య వేదికలో భాగమయ్యారు. ఐక్య వేదిక ఉపాధ్యక్షురాలిగా. రాష్ట్ర సాధన కోసం జరిగిన ప్రతి కార్యక్రమంలో ముందున్నారు.

తెలంగాణ ఉద్యమంలో...

ఆ సమయంలోనే టీఆర్ఎస్ ఆవిర్భవించింది. జయశంకర్‌తోపాటు ఆమె టీఆర్ఎస్‌తో ఉన్నారు. మహిళా అధ్యక్షురాలిగా, పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యురాలిగా పనిచేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ప్రతి ఆందోళనలో అగ్రభాగాన ఉన్నారు. నిజానికి ఎమ్మెల్యే కావాలని కోరిక అస్సలు లేదామెకు. 'తెలంగాణ కోసం పనిచేస్తున్నాం. అది వచ్చాకే ఏదైనా?' అన్న ఆలోచన. కానీ 2004 ఎన్నికలకు ముందు 'తెలంగాణకోసం పనిచేస్తున్న వాళ్లందరూ నాతోపాటు ఎమ్మెల్యేలు కావాలి' అన్నారు కేసీఆర్ ఆమెతో. 'చిన్న ప్రింటింగ్ ప్రెస్ పెట్టి నడుపుతున్నాం. ఎన్నికల్లో పోటీ మాతోటి కానిపని' అన్నారామె. కానీ 'మీలాంటివాళ్లు చట్టసభల్లో ఉండాలి శోభమ్మా' అని ఒప్పించారు. ఏం జరిగిందో ఏమో టికెట్ ఇవ్వలేదు. వామపక్ష రాజకీయాల నుంచి వచ్చారు... కాబట్టి బయటి పార్టీల్లో ఉండే రాజకీయాలు తెలియదు. ఆ సమయంలోనే టీడీపీ నుంచి ఫోన్. 'ప్రజల కోసం పనిచేయాలనుకుంటున్నప్పుడు పార్టీ ఏదైతేనేం' అనుకుని... ఎన్నికల తరువాతే టీడీపీలోకి వెళ్లిపోయారు. అనేక పదవులు చేపట్టారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రెడ్డి కులంలో పుట్టినా... విప్లవ రాజకీయాల వల్ల, కురుమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుని డీ-కాస్ట్‌పై అయ్యారు. అందుకే ఆలేరు నియోజకవర్గంలో ప్రజలు ఆమెను అక్కున చేర్చుకున్నారు. మొదట నేర్చుకున్న పోరాటమే స్ఫూర్తిగా ప్రజలకోసమే పనిచేస్తున్నారు.

సస్యశ్యామలం చేసేదాక...

ఆలేరు నియోజకవర్గంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నది. గోదావరి నీరు ఆలేరు నిమయోజకవర్గానికి రావాలని చెప్పి ఉద్యమిస్తున్నారు. రాజాపేటకు దగ్గర ఉన్న తపాసుపల్లి రిజర్వాయర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం జనగాం వరకే పరిమితం చేసింది. ఆలేరు నియోజకవర్గానికి అన్యాయం జరిగింది. టీఆర్ఎస్ వచ్చిన తరువాత చేస్తది అనుకున్నారు. కానీ 'అధికారం వాళ్ల చేతిలో ఉంది కదా... ఆ నీళ్లను పొన్నాల గారు జనగాం తీసుకుపోయారు. హరీష్‌రావుగారు సిద్ధిపేట్ తీసుకుపోయారు. ఆలేరు నియోజకవర్గం అనాథలాగా మారిపోయింది. పది లక్షల రూపాయలు ఖర్చు చేస్తే నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు నీటి పారుదల ఉంటుంది. ఆలేరుకు తాగు, సాగు నీరు వచ్చేదాకా, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేదాక పోరాటం చేస్తాను' అని దృఢ నిశ్చయంతో చెబుతున్నారామె.

కట్ట కవిత



సాటి మనుషులుగా గుర్తించాలి...

రాజకీయాల్లో చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. మహిళలను చిన్నచూపు చూస్తారు. అణగదొక్కే ప్రయత్నం చేస్తారు. మనం ఎదిగితే నష్టం జరుగుతుంది అనుకునేవాళ్లుంటారు. వేదిక మీదకు పిలిచేదగ్గరనుంచి మాట్లాడించే వరకు చిన్నచూపు. అదృష్టవశాత్తు పిలిస్తే... బాగా మాట్లాడినా కష్టమే. ఇంత బాగా మాట్లాడుతుంది కాబట్టి వచ్చేసారి మాట్లాడనివ్వకూడదనుకుంటారు. ఎంత ఉద్యమాల్లో పని చేసినా, రాజకీయాల్లో ఎంత పోరాడుతున్నా.. అన్నిచోట్లా మహిళలు అణచివేతకు గురవుతూనే ఉన్నారు. ఏ స్థాయిలో ఉన్నా వివక్ష కొనసాగుతూనే ఉంది. ఒక సాధారణ మహిళ... ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఈ స్థాయికి రావాలంటే ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంతో పోరాటం చేయాలి. ఓ స్థాయికి వచ్చాకే ఇలా ఉంటే... ఇక సాధారణ మహిళల పరిస్థితి ఇంకా దారుణం. మహిళలపై ఈ వివక్ష పోవాలి. అణచివేతపై పోరాటం చేయాలి. మహిళలను మహిళలుగా కాక సాటి మనుషులుగా గుర్తించినప్పుడే మార్పు సాధ్యం.

మంత్రివర్గంలో మహిళలేరి?

చాలా దుర్మార్గమైన విషయం ఏమంటే.. తెలంగాణ ఉద్యమంలో మహిళలు అగ్రభాగాన ఉన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కూడా ఉద్యమంగా మలిచారు. అలాంటి మహిళలకు మంత్రివర్గంలో స్థానం లేదు. సమ్మక్కసారక్క, రాణిరుద్రమదేవి, చాకలి ఐలమ్మ స్ఫూర్తి అని చెప్పుకుంటాం... కానీ అధికారంలో అవకాశం ఇవ్వలేదంటే మహిళలను కించపరిచినట్లే.

ప్రజల మధ్యనే ఉంటా...!

భాస్కర్ నన్ను బాగా ఎంకరేజ్ చేస్తారు. ఆర్గనైజేషన్‌లో పనిచేశారు కాబట్టి... ఇంట్లో డెమొక్రటిక్‌గా ఉంటారు. 'ఫలానా పని నువ్వే చేయాలి' అని ఏం లేదు. అన్ని పనులను పంచుకుంటారు. ఇవ్వాళ నేను మంచి వక్తగా నిలిచానంటే ఆయన ప్రోత్సాహం ఎంతో ఉంది. 17 ఏండ్లకే పోరాటాల్లోకి వచ్చాను కాబట్టి.. నాకు కాలక్షేపం అంటే ప్రజల్లో ఉండటమే. ఇంట్లో ఉంటే వార్తలు తప్పిస్తే మరో ఛానల్ ఉండదు. వంట చేస్తున్నా కూడా ప్రజలు, రాజకీయాలే. ఒక బాబు, ఒక పాప. బాబు యూఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పాప బీటెక్ అయిపోయింది. ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు రాజకీయాల్లోనే ఉంటా. ప్రజలకోసం పనిచేస్తా. లెఫ్ట్‌లో ఉన్నప్పుడు పోరాటమే... తెలంగాణ కోసం పోరాటమే... ఇప్పుడూ పోరాటమే. నిత్యం ప్రజల మధ్యనే ఉన్నా... ఉంటా!

భయం వద్దు...

అక్షరాలు నేర్చుకుని తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలని.. విద్యతో వికాసం సాధించాలని ఆశపడే ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తుంటారు. లింగవివక్ష లేకుండా బడికి పంపే ప్రయత్నం చేస్తారు. చాలామంది ఆడపిల్లలు బడిలో, కాలేజీలో, రోడ్డుపై మగపిల్లల వేధింపులు ఇంట్లో చెప్పడానికి భయపడతారు. చెప్పితే చదువు మాన్పిస్తారన్న భయంతో మగపిల్లలు చేసే అల్లరిని భరిస్తుంటారు. దీన్ని అలుసుగా తీసుకుని రెచ్చిపోతారు అబ్బాయిలు. వేధింపులను భరించవద్దు.. ఎదురుతిరగాలి... ఇంట్లో వారికి , టీచర్లకు చెప్పి వారి మద్దతు తీసుకోవాలి. మగపిల్లల ఆగడాలను అడ్డుకునే టెక్నిక్స్ ఈ వారం తెలుసుకుందాం..!

సెల్ఫ్ డిఫెన్స్



కాలేజీ నుంచి బయటకు వచ్చి తన దారిలో తాను వెళ్తున్న అమ్మాయిని అడ్డగించాడు ఒకవ్యక్తి. భుజంపై చేయి వేసి అల్లరి చేయడానికి ప్రయత్నం చేశాడు.



దారికి అడ్డంగా నిలబడి.. భుజంపై చేయి వేసి వేధించడానికి ఆ వ్యక్తి చేస్తున్న ప్రయత్నాన్ని గమనించిన ఆమె అతడి చేయిపై తన చేయితో గట్టిగా అటాక్ చేసింది. దారికి అడ్డుతొలగించుకుని మరో అడుగు

వెంటనే ఆ వ్యక్తి వెనక్కి తిరిగి ఆమె భుజాలపై వేలాడుతున్న బ్యాగ్‌ను పట్టి లాగే ప్రయత్నం చేశాడు. ఎలాగైనా ఆమెను వేధించాలని నిర్ణయించుకున్నాడు.



దారికి అడ్డుగా నిలిచి.. తనను వేధించే ప్రయత్నం చేయడంతో ఆమె అతడికి గట్టిగానే బుద్ధి చెప్పాలనుకుంది. వెంటనే వెనిక్కి తిరిగి తన అరచేతితో లేదా పిడికిలితో అతడి ముఖంపై అటాక్ చేసింది. అతడి దాడి ప్రయత్నాన్ని తిప్పికొట్టింది.



ఇంటి నుంచి కాలు బయట పెట్టిన తమ పిల్లలు ఏం చేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం మాత్రం చేయరు. ఆడపిల్లల తల్లిదండ్రులే కాదు మగపిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను గమనించాలి. అల్లరి చేయడం మగపిల్లల హక్కు.. భరించడం ఆడపిల్లల బాధ్యత అన్న భావనను వీడాలి. చిన్నతనం నుంచే అబ్బాయిలను, అమ్మాయిలను సమానంగా చూడాలి.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

ఇస్లాంకు పుతిన్ మద్దతు

- రష్యా అధ్యక్షుడిని ప్రశంసలతో ముంచెత్తిన చెచెన్


రంజాన్ కదిరోవ్

గ్రోజ్నీ : చెచెన్ నేత రంజాన్ కదిరోవ్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని ప్రశంసలతో ముంచెత్తారు. ఓ పక్క ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపడంతో పాటు మరోపక్క ఇస్లాం మతానికి మద్దతుగా నిలిచారని కితాబిచ్చారు. ఉగ్రసంస్థలను అణచివేయడంలో పుతిన్ తనదైన ముద్రవేశారని, ఆయన కృషి ఫలితంగా సిరియా వంటి దేశాల్లోనూ వేలాది మంది అమాయక ప్రజలు ప్రశాంతంగా ఊపిరిపీల్చగలుగుతున్నారని అన్నారు. మత స్వేచ్ఛ పరిరక్షణ, సమానత్వం పరిరక్షణలో పుతిన్‌కు సాటి మరెవరూ లేరని పొగడ్తలతో ముంచెత్తారు. ఇస్లాం మతస్థులపై జరుగుతున్న దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుట్ర దాగివుందని విమర్శించారు.

బ్రెజిల్ నైట్‌క్లబ్‌లో కాల్పులు

- 14 మంది మృతి, ఏడుగురికి గాయాలు

బ్రసీలియా : ఈశాన్య బ్రెజిల్‌లోని ఫోర్టలేజా నగరంలోని ఓ నైట్‌క్లబ్‌లో ఆగంతకులు బీభత్సం సృష్టించారు. నైట్‌క్లబ్‌లోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 14 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా సభ్యులే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారని పోలీస్ అధికారులు అనుమానిస్తున్నారు. సియేరా స్టేట్ భద్రతా అధికారి ఆండ్రీ కోస్టా తెలిపిన వివరాల ప్రకారం...ఫోర్టలేజా నైట్‌క్లబ్‌లో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 14 మంది చనిపోయారు. మూడు వాహనాల్లో వచ్చిన దుండగులు పార్టీలో ఉన్న వారిపై కాల్పులు జరిపారు. 'ఇది కిరాతకమైన చర్య. ఇంత క్రూరమైన ఘటన ఎప్పుడూ చూడలేదు' అని కోస్టా అన్నారు. కొంతకాలంగా స్థానికంగా ఉండే రెండు డ్రగ్స్ అక్రమరవాణా బృందాల మధ్య ఘర్షణ నెలకొందని.. ఈ ఘటన కూడా ఈ రెండు వర్గాల మధ్య గొడవేనని స్థానిక మీడియా పేర్కొంది. వీరి ఘర్షణలో అమాయకులు ప్రాణాలు



కోల్పోయారని తెలిపింది. జనవరి 7న ఫోర్టలేజా శివార్లలోనూ ఓ పార్టీలో జరిగిన ఘర్షణలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సియోరా రాష్ట్రంలో హత్య ఉధంతాల సంఖ్య పెరిగిపోయింది. గతేడాది 5,114 హత్యలు జరిగినట్టు క్రైమ్ డిపార్ట్‌మెంట్ పేర్కొన్నది. 2015లో ఇదే ప్రాంతంలోని నైట్‌క్లబ్‌లో జరిగిన కాల్పుల్లో 11 మంది మృతి చెందారు. మృతుల్లో మైనర్లు అధికంగా ఉన్నారు.

డల్లాస్‌లో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

వాషింగ్టన్ : అమెరికాలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గత శుక్రవారం డల్లాస్‌లో కృష్ణచైతన్య తన గదిలో ప్రాణాలు విడిచాడు. డల్లాస్‌లోని ఓ ఇంట్లో కృష్ణచైతన్య పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తన గది నుంచి బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గది తలుపు తీసి చూడగా.. మంచం మీద కృష్ణ చైతన్య శవమై కనిపించాడు. కృష్ణచైతన్య సిద్దిపేటలోని ప్రశాంత్ నగర్‌కు చెందినవాడు. కాగ్నిజెంట్ కంపెనీ ఉద్యోగంలో భాగంగా మూడున్నరేండ్ల క్రితం ఆయన అమెరికాకు వెళ్లాడు. మూడు నెలల కిందటే డల్లాస్‌లోని సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ కంపెనీకి ఉద్యోగం మారటంతో అక్కడే ఓ ఇంట్లో పేయింగ్ గెస్ట్ గా ఉంటున్నాడు. తెలంగాణ ప్రభుత్వం తరపున సంప్రదింపులు జరిపి సకాలంలో భౌతికకాయాన్ని తరలించేలా మంత్రి హరీశ్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్టు సమాచారం.

దళితులపై దాడులు అరికట్టడంలో విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బరిగెల సాయిలు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సెక్యులరిస్టులమని చెప్పు కుంటున్న ప్రభుత్వాల విధానాలు లౌకికవాదులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉన్నాయన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు సమన్యా యం ఎక్కడా జరగలేదని చెప్పారు. బీజేపీ, ఎన్‌డీఏ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, మైనార్టీలపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దళితులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇస్తామన్న మూడెకరాలు భూ పంపిణీ పథకం అటకెక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించడంతో ఉపాధిఅవకాశాలు కోల్పోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మా, బాలనర్సింహ్మా, యేసురత్నం, ప్రభాకర్, గెల్వయ్య, గణేష్ పాల్గొన్నారు.

గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి

గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. కల్లు దుకాణాలపై కల్తీ నెపంతో ఎక్సైజ్ దాడులు చేస్తూ కల్లుగీత కార్మికులను స్టేషన్లకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులు అధికంగా ఉండడం వల్ల ప్రజలు అనారోగాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

బీసీ బిల్లుపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- కేంద్రానికి బీసీ సంక్షేమ సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీలకు రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించే బీసీ బిల్లుపై జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్‌లో జరిగే బడ్జెట్ సమావేశాల్లో అన్ని పార్టీలు బీసీ బిల్లుపై తమ వైఖరిని తెలపాలని కోరారు. బీసీ కమిషన్ బిల్లుకు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. తీరా ఓటింగ్ సమయం వచ్చే సరికి చేతులు ఎత్తివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీలు బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీ చేసిన తీర్మానం ప్రకారం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని తెలిపారు.

మావోయిస్టులది పాశవిక చర్య

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని

నవతెలంగాణ-భద్రాచలం

పోలీసు ఇన్‌ఫార్మర్ అనే నెపంతో మడివి రమేష్‌పై మావోయిస్టులు దాడి చేయడం పాశవిక చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం భద్రాచలం ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్న మడివి రమేష్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 17ఏండ్ల కిందట ఛత్తీస్‌గఢ్ నుంచి వలసొచ్చిన గిరిజనులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని ప్రయత్నిస్తున్న నాయకుడు రమేష్ అని అన్నారు. మావోయిస్టులు తుపాకులు ఎక్కు పెట్టాల్సింది అమాయక గిరిజనులపై కాదని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడుతున్న వారిపై దాడులు చేసి ఐక్య ఉద్యమాలను విచ్ఛిన్నం చేయరాదని కోరారు. ఆయన వెంట పార్టీ భద్రాద్రి, ఖమ్మంజిల్లా కార్యదర్శులు అన్నవరపు కనకయ్య, నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్, పట్టణ కార్యదర్శి బి. వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇండ్లపై వందశాతం పెనాల్టీ వద్దు

'పట్నం' రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రయివేటు, ప్రభుత్వ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, దేవాదాయ, వక్ఫ్ భూముల్లో కట్టుకున్న ఇండ్లపై వందశాతం పెనాల్టీ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్ని ఉపసంహరించుకోవాలని 'పట్నం' రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల్ని ప్రయివేటు వ్యక్తులు, రాజకీయశక్తులు, స్వామీజీలు కబ్జాలు చేసి, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిని కాదని పేదలు, మధ్యతరగతి ప్రజలు కట్టుకున్న ఇండ్లపై పురపాలకశాఖ వందశాతం పెనాల్టీలు విధించడం సరికాదని 'పట్నం' రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వేణుగోపాలరావు, డీజీ నర్సింహారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, ల్యాండ్ సీలింగ్ మిగులు భూముల్లోని ఇండ్లను పేదలకు ఉచితంగా, మధ్యతరగతి ప్రజలకు భూమి విలువలో కొంతభాగాన్ని వసూలు చేసి, రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొంటూ ప్రభుత్వం జీవో నెంబర్ 58, 59 విడుదల చేసిందని గుర్తుచేశారు. దానికి భిన్నంగా పై భూముల్లో ఇండ్లు కట్టుకున్నవారికి వందశాతం పెనాల్టీలు విధిస్తూ పురపాలకశాఖ సర్క్యులర్ నెంబర్ 12231/2016/ఎ3, ఖ్ఞప 10/12/2017 విడుదల చేయడం ప్రజావ్యతిరేకమైనదని అన్నారు. ఈ సర్క్యులర్‌ను తక్షణం వెనక్కి తీసుకోవాలని, జీవో నెంబర్ 58, 59 ప్రకారం వాటన్నింటినీ రెగ్యులరైజ్ చేసి, ప్రాథమిక మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వీఆర్ఎస్ పథకాన్ని వ్యతిరేకించడం అభినందనీయం

- సీఐటీయూ కార్యదర్శి వీఎస్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంపెనీ యాజమాన్యం ప్రవేశపెట్టిన వీఆర్ఎస్ పథకాన్ని కార్మికులు వ్యతిరేకించడం అభినందనీయమని సీఐటీయూ కార్యదర్శి వీఎస్ రావు అన్నారు. ఆల్ ఇండియా పీర్‌లెస్ ఎంప్లాయీస్ యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ మహాసభలు కరీంనగర్‌లో జరిగాయి.

ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదురించేందుకు కార్మికులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వేణుగోపాల్‌రావుతో పాటు పీర్‌లెస్ అఖిల భారత నాయకులు గౌతంఛటర్జీ, నిత్యగోపాల్ దత్తా, అనుదేబ్ ఘోష్, ఏవీ రామారావు పలువురు కార్మిక నేతలు ప్రసంగించారు. అనంతరం కె. నాగలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా సీవీఏ కుమార్ అధ్యక్షులుగా టీవీజీ రాజు కోశాధికారిగా రాంబాబు ఉపాధ్యక్షులు, రామకృష్ణ, సునంద, నజీర్, రాధారాణి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బుక్ ఈజ్ ఏ బెస్ట్ ఫ్రెండ్

- అత్యంత ప్రభావం చూపిన పుస్తకం 'నీళ్లు - నిజాలు' : హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపులో మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పుస్తకం దశా, దిశను నిర్దేశిస్తుందని, నిజ జీవితంలో సైతం బుక్ ఈజ్ ఏ బెస్ట్ ఫ్రెండ్ అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 31వ హైదరాబాద్ జాతీయ బుక్ ఫెయిర్ ముగింపు సభ ఆదివారం జరిగింది. అందులో ఆయన మాట్లాడుతూ సోషల్‌మీడియా విస్తృతమైనప్పటికీ పుస్తకం ప్రాధాన్యత తగ్గలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పుస్తకాలు, పాట, సాహిత్యం ప్రధాన భూమిక పోషించాయన్నారు. సెంట్రల్ వాటర్ రిటైర్డ్ కమిషనర్ ఆర్. విద్యాసాగర్ రావు రచించిన 'నీళ్లు-నిజాలు' పుస్తకం తనను అత్యంత ప్రభావితం చేసిందన్నారు. తెలంగాణకు తాగు, సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయాన్ని కూలంకషంగా రాశారని వివరించారు. ఆధునిక ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లు వచ్చి రేడియో, గడియారం కనుమరుగైనా పుస్తకం విలువ తగ్గలేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోని 31 జిల్లాలకు పుస్తకం చేరే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ సైతం విద్యనభ్యసించే రోజుల్లో అనేక పుస్తకాలు చదివారని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్యమంత్రి చెప్పిన పద్యాలు అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందేనని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ బుక్‌ఫెయిర్‌పై కవులు, సాహిత్యప్రియులు, కళాకారులు ఆదరణ చూపడం చాలా గొప్పవిషయమన్నారు. బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ హృదయం ఉండే వాళ్లు పుస్తకాలను చదువుతారన్నారు. పుస్తక పఠనం హృదయానికి దగ్గర ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పుస్తకాలు సృష్టించిన విప్లవాలు అనేకం ఉన్నాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ బుక్ ఫెయిర్ నిర్వహణకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించిందన్నారు. అంతకుముందు హైదరాబాద్ బుక్ ఫెయిర్ సెక్రటరీ కె.చంద్రమోహన్ స్వాగతోపన్యాసం చేస్తూ పుస్తక ఫెయిర్‌ను విజయవంతంగా నిర్వహించామని, ప్రతి ఏడాది డిసెంబర్‌లో నిర్వహిస్తున్నటికీ, ఈ సారి జనవరిలో పెట్టినా అనూహ్య రీతిలో ప్రజలు ఆదరించారని తెలిపారు. ప్రతి రోజు సాహిత్యసమాలోచనలో భాగంగా 12 అంశాలపై నిర్వహించిన చర్చలు, సమావేశాల్లో 100 మంది కవులు, రచయితలు, విమర్శకులు, ప్రముఖులు పాల్గొని తమ అమూల్యమైన అభిప్రాయాలను, భావాలను వ్యక్తం చేశారని, దాదాపు 62 పుస్తకాలు ఆవిష్కరణలు జరిగాయని



తెలిపారు. కార్యక్రమంలో భాషా, సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు కృష్ణారెడ్డి, సంగీత, విజయ్‌కుమార్, ఖయ్యూంపాషా, వీరేశం, అనిల్, చారీ, మూర్తి తదితరులను బీసీ కమిషన్ సభ్యులు వకూళభరణం కృష్ణమోహన్ మెమోంటో, చేనేత టవల్స్‌తో సత్కరించారు.

జనం తిరగబడే రోజొస్తది..

ఏం తినాలో, ఏం తినకూడదో ప్రభుత్వాలు నిర్ణయించటం ప్రమాదకరం

- బీఫ్‌పై నిషేధం... ఆధునిక ప్రపంచంలో తిరోగమనమే : న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ క్రిష్ణేడు రే

మోడీ ప్రభుత్వం బలవంతంగా ప్రజల ఆహార అలవాట్లను నియంత్రించాలనుకుంటోంది. బీఫ్ తిన్నారో...మీరు నేరం చేసినట్టేనని దళితులు, మైనార్టీలను బెదిరిస్తున్నారు. బీఫ్‌పై నిషేధం..వారి వృత్తుల్ని సైతం కించపర్చటమే. ప్రజాస్వామ్యంలో ఇదెంతోకాలం కొనసాగదు. చివరికి ప్రజలు తిరగబడతారు. అందుకు చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయని న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ క్రిష్ణేడు రే చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం 'హార్డ్‌న్యూస్'తో జరిగిన ఇంటర్వ్యూ పలు అసక్తికరమైన విషయాలు చెప్పారు. అవేంటంటే...



న్యూయార్క్ యూనివర్సిటీలో 'ఆహారం-పోషణ' అంశంలో ప్రొఫెసర్ క్రిష్ణేడు రే అధ్యయనం చేస్తున్నారు. ఫుడ్ స్టడీస్ విభాగానికి హెడ్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆహారపు అలవాట్లు, సమాజం, సాంస్కృతిక అంశాల ప్రభావం..అన్నవాటిపై ఆయన విస్తృత అధ్యయనం చేశారు. తాను కనుగొన్న విషయాలతో అనేక పుస్తకాలు రచించారు. 'కర్రీడ్ కల్చర్స్ : గ్లోబలైజేషన్, ఫుడ్ అండ్ సౌత్ ఏసియా', 'ద ఎథ్నిక్ రెస్టారెంటర్' ఆయనకు ప్రపంచ గుర్తింపు తెచ్చిపెట్టాయి.

ఏం తినాలో ? ఏం తినకూడదో ? మోడీ ప్రభుత్వం నిర్ణయిస్తోంది. భారత్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఈ పరిణామాలపై మీ అవగాహన ఏంటి ?

కొన్ని వందల ఏండ్ల క్రితం యూరప్, జపాన్‌లలో కూడా ప్రజలు ఏం తినాలి ? ఏం తినకూడదు? అన్నదానిపై నియమాలు, నియంత్రణలు తీసుకొచ్చారు. అలాగే గుర్రాలు ఎవరు నడపాలి, కత్తి ఎవరు పట్టాలి, హోదాను తెలియజేసే బట్టలు ఎవరు వేసుకోవాలి...అన్నవాటిపై కూడా నిబంధనలు విధించారు. చూడగానే పేదలు, ధనికులు అన్న తేడా స్పష్టంగా కనపడేట్టు చేయటమే ఈ నిబంధనల వెనుకున్న ఉద్దేశం. ఇండియాలో ఇది కుల వ్యవస్థ ద్వారా అమలైంది. బ్రాహ్మన ఆధిపత్య వ్యవస్థ, సంస్కృత భాష. భారతీయ సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. దీనివల్ల బలవంతంగా చాలామంది శాకాహారులుగా మారాల్సి వచ్చింది. ఇక నేటి భారతదేశంలోని మోడీ పాలన విషయానికొస్తే, దళితులు, గిరిజనులు, ముస్లింలు మాంసాహారాన్ని తీసుకుంటారు. వీరి ఆహార అలవాట్లను సంప్రదాయాలను కించపరిచే విధంగా మోడీ ప్రభుత్వం పలు నిబంధనల్ని తీసుకొచ్చింది. అంతేగాక వారి వృత్తుల్ని కూడా ప్రభుత్వం కించపరుస్తోంది. బీఫ్‌పై నిషేధం...ఆధునిక ప్రపంచంలో తిరోగమనమే. దీనిని నేను 'ఆహార-ఫాసిజం'గా భావిస్తున్నాను.

ఆహార అలవాట్లపై ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ట్రెండ్ ఉంది ?

అమెరికా, యూరప్ దేశాల్లో ఏది తింటే మంచిదో, ఏది మంచిది కాదో...ఇక్కడి ప్రజలు మీకు చెబుతారు. కానీ చివరి నిర్ణయం మాత్రం ఎదుటివారికే వదిలేస్తారు. దీనికి విరుద్ధంగా ఇండియాలో వాతావరణం నెలకొంది. ఇప్పుడు తీసుకొచ్చిన నియమాలతో చట్టం తేవాలని చూస్తున్నారు. మరోవైపు దాడులు జరుగుతున్నాయి. స్వలింగ సంపర్కుల విషయంలో సుప్రీంకోర్టు ఎలాగైతే స్పందించిందో, ఆహార నియంత్రణలపై కూడా ఒకనాడు స్పందిస్తుందన్న ఆశ ఉంది.

భారతీయ ఆహార అలవాట్లు ముందు ముందు ఎలా మారనున్నాయి ?

ప్రజల ఆర్థిక స్థోమతను బట్టి ఆహార అలవాటు ఏర్పడుతుంది. ఆదాయం పెరిగిన వ్యక్తి మంచి ప్రొటీన్ ఉన్న ఆహారాన్ని తీసుకుంటాడు. మాంసాహారం నుంచి ఎక్కువ ప్రొటీన్ వస్తుంది. కానీ భారత్‌లో వీటి ధరలు అందుబాటులో లేవు. దీనికితోడు అనేక నియమాలు, నిబంధనలు ఏర్పాటుచేసి మాంసాహార భోజనాన్ని చాలా పరిమితం చేశారు. చైనాలో అనేక జంతువుల్ని ఆహారంగా తీసుకోవటం, నియమ, నిబంధనలు చాలా చాలా తక్కువగా ఉండటం...వారి చరిత్ర ద్వారా తెలుస్తున్నది. దీనికి విరుద్ధంగా భారత్‌లో మాంసాహారంగా తీసుకోతగిన జంతువుల సంఖ్య చాలా తక్కువ చేశారు. అనేక ఆంక్షలు, నియంత్రణలు విధించారు.

మరోవైపు భారత్‌లో ఆల్కహాల్, సాఫ్ట్ డ్రింక్స్, సోడా...తీసుకోవటం విపరీతంగా పెరిగిపోయింది. పెప్సీ, కొకాకోలా...వంటి సాఫ్ట్‌డ్రింక్స్ మన శరీరాన్ని తప్పకుండా ప్రభావితం చేస్తాయి. భారతీయ సమాజంలో విస్కీ సేవించటం కూడా పెరిగింది. అందునా విదేశీ బ్రాండ్ విస్కీ సేవించే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. మద్యం సేవించటంపై ప్రజలు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేస్తున్నారు.

ప్రభుత్వాలు ఎలాంటి మార్గాల్ని ఎంచుకుంటాయి ?

ప్రజల ఆహార అలవాట్లను నియంత్రించడానికి ప్రభుత్వాలకు రెండుమార్గాలున్నాయి. ఒకటి..బీఫ్, ఆల్కహాల్‌పై చట్టాలు చేసి నిషేధించటం. ప్రజాస్వామ్య పాలనలో ఇది ఎంతోకాలం సాగదు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. తాత్కాలికంగా కొన్ని రాజకీయ ప్రయోజనాలు నెరవేరుతాయి. రెండోమార్గం...పన్నులు పెంచటం.

సమాజాన్ని ఎలా మార్చుతుంది ?

నేర ప్రవృత్తి పెంచుతుంది. బీఫ్ తిన్నవారు నేరస్తులైపోతారు. అంటే దీనర్థం...పెద్ద సంఖ్యలో ప్రజల్ని భయంతో, బెదిరించి..కొన్ని ఆహార అలవాట్లవైపుకు ప్రభుత్వం తోస్తోంది. కానీ ఏదో ఒకనాడు వారంతా తిరగబడతారు. అప్పుడు ప్రభుత్వ బలహీనత బయటపడుతుంది. అందుకు చరిత్రలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. అమెరికాలో ఆల్కహాల్‌పై నిషేధం విధించటం ఎలాంటి పరిణామాల్ని సృష్టించిందో తెలుసుకోవాలి. అనేక నగరాల్లో అండర్‌గ్రౌండ్ మాఫియా గ్యాంగ్‌లు పెరగడానికి మద్యపానంపై నిషేధం దోహదం చేసింది.

బహుజనులపై పెరుగుతున్న దాడులు

ప్రమాదంలో భావ ప్రకటనా స్వేచ్ఛ

ప్రొఫెసర్ కంచ ఐలయ్య, రిటైర్డ్ ఐఏఎస్ కాకి మాధవరావు, సత్య



నవతెలంగాణ - ఎల్బీనగర్

దేశంలో, రాష్ట్రంలో మనువాద పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత బహుజనులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, లైంగికదాడులు పెరిగిపోతున్నాయని సామాజిక ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ కంచ ఐలయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చీఫ్ సెక్రెటరీ కాకి మాధవరావు, సీనియర్ జర్నలిస్టు సత్య అన్నారు. హైదరాబాద్‌లోని చంపాపేటలోని కేకే గార్డెన్‌లో బహుజన ప్రతిఘటన సదస్సు శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక తరగతులపై కుల, మతోన్మాద దాడులు 8 శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మేధావులు, రచయితలు, కళాకారుల మీద హింస పెరిగిపోయిందని, భావ ప్రకటన స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని వాపోయారు. హేతువాదాన్ని ప్రచారం చేసిన మేధావులైన దభోల్కర్, పన్సారే, కల్బుర్గి, గౌరీలంకేశ్ వంటి వారిని దారుణంగా చంపిన విషయాన్ని గుర్తు చేశారు. రోహిత్‌వేముల ఆత్మహత్య యూనివర్సిటీలో కులహింస దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నారు. జేఎన్‌యూలో నజీబ్‌ను మాయం చేశారని గుర్తుచేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బ్రాహ్మణీయ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చైతన్యం కావాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం బహుజనులపై ఉందన్నారు. అంబేద్కర్, పూలే, సావిత్రి, కారల్ మార్క్స్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇంగ్లీషు మీడియం స్కూల్ నెలకొల్పాలని డిమాండ్ చేశారు. గొర్లు, బర్లు, చేపలు వద్దని బీసీలకు రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. నేరెళ్ల పోలీసుల హింసకు జీవితాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేసి, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రతిఘటన్ వేదిక కో కన్వీనర్లు జిలకర శ్రీనివాస్, యూ.సాంబశివరావు, భారత నాస్తిక సమాజం బైరి నరేష్, బహుజన రాష్ట్ర సమితి నాయకులు సుదన్, ప్రొఫెసర్లు కె.లక్ష్మీనారాయణ, కెవై.రత్నం, పద్మజాష, హరిబాబు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బండారి లక్ష్మయ్య, సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్ కొత్తగట్టు మల్లన్న, ప్రముఖ సాహిత్య విశ్లేషకులు గుంటూరు లక్ష్మీనర్సయ్య, ముస్లీం ఆలోచనపరుల వేదిక కన్వీనర్ కాన్ఎజ్దాని, తెలంగాణ హిజ్రా ఇంటర్ సెక్స్ ట్రాన్స్ జెండర్ సమితి నాయకులు చంద్రముఖి మువ్వల మాట్లాడారు.

వీఐపీ కిడ్నాప్ డెమో చేస్తూ ప్రాణాలు కోల్పోయిన అక్టోపస్ కానిస్టేబుల్

అధికారులదే తప్పంటు ఐజీని ఘెరావ్ చేసిన కుటుంబసభ్యులు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన వీఐపీని రక్షించే డెమోలో పాల్గొన్న ఒక అక్టోపస్ కానిస్టేబుల్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతు మరణించడం ఉద్రికత్తతకు దారి తీసింది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగానే కానిస్టేబుల్ లక్‌పతి మరణించాడంటు అతని కుటుంబసభ్యులు ఐజీ ని ఆసుపత్రి వద్ద ఘెరావ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఉగ్రవాదులు వీఐపీని కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న కారును అడ్డుకుని అక్టోపస్ కమెండోలు కాపాడే డెమోను నల్లగొండ జిల్లా ఆదిబట్ల లో గత 23వ తేదీన నిర్వహించారు. కాగా ఉగ్రవాదులు వీఐపిని కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న కారును(పాత్రధారులంతా అక్టోపస అధికారులు, సిబ్బంది)ను కానిస్టేబుల్ లక్‌పతి నడుపుతున్నాడు. మందువస్తున్న ఇతర పోలీసు వాహనాలను తప్పించుకుంటు వెళ్లే వీరి కారును ఎదురుగా అక్టోపస్ కమెండోలతో వచ్చిన బస్సు అడ్డంగా నిలిపి అడ్డుకునేలా వ్యూహరచన జరిగింది.

కాగా తన కారును స్పీడుగా నడుపుతు ముందుకు దూసుకెళ్లిన కానిస్టేబుల్ లక్‌పతి అదుపుతప్పి ముందు అడ్డంగా నిలిపిన అక్టోపస్ కమెండోల బస్సును ఢీకొన్నాడు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న లక్‌పతి తీవ్రంగా గాయపడగా, అందులో ఉన్న మరో ముగ్గురు అక్టోపస్ ఇన్‌స్పెక్టర్లల్లు త్రుటిలో ముప్పు నుంచి తప్పించుకున్నారు. గాయపడ్డ కానిస్టేబుల్‌ను ఎల్‌బీ నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు ఆదివారం మరణించాడు. దీంతో అక్కడికి వచ్చిన బంధువులు ఆసుపత్రి వద్ద అక్టోపస్ ఐజీని ఘెరావ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే లక్‌పతి మరణించాడంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర అధికారులు వారిని సముదాయించి కానిస్టేబుల్ మృత దేహానికి ఇబ్రహింపట్నం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృత దేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించగా, నల్లగొండ జిల్లా మెల్లెపల్లిలోని వారి నివాసానికి తరలించారు. కాగా విధి నిర్వాహణలో ఉన్న కానిస్టేబుల్ లక్‌పతి మృతి పట్ల ఉన్నతాధికారులు తమ సంతాపాన్ని తెఇపారు. అలాగే అతనికి తగిన నష్టపరిహారాన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

లాల్, నీల్ ఐక్యత-నేటి ఆవశ్యకత



ప్రొ॥వెంకట్‌దాస్

ఈ దేశంలో రెడ్ ఆర్మీ ఓ ఖడ్గ సృష్టి. బహుజన సమాజ ఆవిర్భావం ఓ ఆయుధ నిర్మాణం. ఈ రెండు స మూహాలు బరిగీసి పోరాడే యోధాన యోధుల సమ్మేళనా లు. రెండు బలగాల మధ్య ఐక్యత, ఆవశ్యకత అంటే అది యుద్ధ సన్నాహమే. ప్రజలు గెలవాలని తెలంగాణ యవని కప్పై బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఆవిర్భావం ఓ యు ద్ధ ప్రకటన.

యుద్ధ ప్రకటన
మన...
భరత భూమిలో
రాజులు ఆడిన యుద్ధాలు ఎన్నో
ప్రజలు ఓడిన యుద్ధాలు అన్నే
కారణం...
బ్రహ్మణిజం ప్రజల్ని విడగొట్టింది
ప్రజలు...
గ్రామంలో విడిపోతే గ్రామానికి నష్టం...
దేశంలో విడిపోతే దేశానికే నష్టం...
ప్రజలు నష్టాల్లో కష్టాల్లో ఉన్నారు...
అవమానాల్ని కన్నీటిలో దాచుకొని...
పేదరికాన్ని కడుపులో బిగబట్టి...
భీమా కోరేగాం వీరులుగా...
యుద్ధంసింగ్ వారసులుగా
యోధాను యోధులు
సిద్ధంగా ఉన్నారు...
యుద్ధం అనివార్యం...
యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి...
యుద్ధం మొదలైంది
ప్రజలు గెలవాలని...

యుద్ధ బలగాలు విజయం సాధించాలంటే యుద్ధ అవసరాలు బలగాల మధ్య ఐక్యత ఏ స్థాయిలో ఉందో సరిచూసుకోవాలి. ఈ రెండింటిపైన స్పష్టత వస్తే యుద్ధ బలగాలు సిద్ధమైపోతాయి. కాబట్టి నా వ్యాసాన్ని ఐక్యత, ఆవశ్యకత అనే రెండు భాగాలుగా మీ ముందుచుతున్నాను.

ఐక్యత

మార్క్సిస్టులు ఆర్థిక పోరాట వాదులుగా... అంబేద్కరిస్టులు ఆత్మగౌరవ పోరాట వాదులుగా విడిపోయి ఉన్నారు. డా॥బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత ఈ రెండు శ్రేణులు కలిసి ప్రయాణం చేస్తే ఎంతో మేలు జరిగేది. ఈ రెండు శ్రేణుల్లో ఉన్నది ఆర్థిక దోపిడీకి, కుల వివక్షకు గురౌతున్న ప్రజలే. దోపిడీ అంతం కావాలంటే దోపిడీకి గురౌతున్న ప్రజలు కలవాలి. కమ్యూనిస్టులది వర్గ సిద్ధాంతం. ప్రజలు పేదలుగా, ధనికులుగా విడిపోయి ఉన్నారని చెప్పేదే వర్గ సిద్ధాంతం. దోపిడీకి గురౌతున్న కార్మికులను, పీడిత ప్రజలను ఏకం చేసి దోపిడీ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసమే "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అని నినదించింది కమ్యూనిస్టు సిద్ధాంతం. వేల కులాలుగా విడిపోయిన భారత సమాజాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలనే ఐదు సమూహాలుగా ఐక్యం చేసింది అంబేద్కరిజం. అంటే ఈ దేశంలో బ్రాహ్మణిజం ప్రజలను విడగొడుతుంది, అంబేద్కరిజం ప్రజలను ఐక్యం చేస్తుంది. ఇదే అంబేద్కరిజం బ్రాహ్మణిజానికి మధ్యనున్న వ్యత్యాసం. మొత్తం భారత సమాజంలో వర్గ స్వభావం కూడా అంతర్లీనంగా ఉంది. కాబట్టి భారతదేశంలో కమ్యూనిస్టులు, నాన్-కమ్యూనిస్టులుగా ప్రజలు విడిపోయి ఉన్నారనేది అందరూ అంగీకరించే అంశం. నాన్-కమ్యూనిస్టులలో కొందరు రైటిస్టులుగా రూపాంతరం చెందారు. వారే పాలక బ్రాహ్మణీయ సమాజం. ఈ పాలక బ్రాహ్మణీయ సమాజమే బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల నాయకత్వంలో కనిపిస్తుంది. ఈ నాయకత్వం నేటికీ ప్రజలను శూద్ర, అతి శూద్ర కులాలుగా విడగొట్టి తమ పబ్బం గడుపుకుంటున్నారు. మతం మానసిక అవసరాలకు వాడే ఒక పనిముట్టు, అది వ్యక్తిగతం. కానీ మతాన్ని రాజ్యంతో పెనవేసి లౌకికతత్వాన్ని చెడగొట్టి, భారత రాజ్యాంగం నుంచి లౌకిక పదాన్ని తొలగించాలని చూస్తున్నవారు నేటి మనువాద పాలకులు. ఆనాడు గాంధేయులు అంబేద్కర్ జీవించి ఉన్న కాలంలో వేధిస్తే, ఈనాడు మనువాదులు లౌకిక తత్వాన్ని రాజ్యాంగం నుంచి తొలగించి అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడవాలని చూస్తున్నారు. భవిష్యత్తులో ఈ మోసం యథేచ్ఛగా కొనసాగించాలని కలలుగంటున్నారు. ఈ మోసాన్ని అడ్డుకోవాల్సిన ఈ దేశ ప్రజలు కమ్యూనిస్టులుగా, అంబేద్కరిస్టులుగా విడిపోయి ఉన్నారు. అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు ఒకటిగా కలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు కలసి పని చేసినప్పుడు తెలియక మననుంచి విడిపోయిన అమాయక గాంధేయులు మనతో కలసిరాక తప్పదు. మతం మానసిక అవసరాల కోసం అని తెలిసి కూడా మతం పేరుతో మతంలో అంతర్భాగమైన కులం పేరుతో ప్రజలను విడదీసిన మనువాదులు మనతో వస్తారో లేదో వాళ్లే తేల్చుకుంటారు. మనతో వస్తే మనువాదం తోకముడుస్తుంది. అలా కానప్పుడు బహుజన సమాజం, కమ్యూనిస్టుల కలయికే మనువాదానికి సరైన సమాధానం. అలా కలవడానికి ఇప్పుడున్న ఆవశ్యకత ఏంటి?

ఆవశ్యకత

5.మనిషి తన అవసరాలను సరిపడా కష్టపడి సంపాదించుకుంటే ఎవరికీ ఇబ్బంది లేదు. ఒక కుటుంబానికి వందల వేల కోట్లు అవసరమా? పోనీ వందల, వేల కోట్లు నిజాయితీగా సంపాదిస్తున్నాడా? అంటే అది లేదు. ప్రకతిని, సాటి మనిషిని దోచి ధ్వంసం చేసిన అవినీతియే కదా ఇది. ఇలాంటి మనిషిని కట్టడి చేయడంలో నేటి ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. 90 శాతం దేశ సంపద 10శాతం ధనికుల చేతుల్లో ఉంది. పేదలు మరింత పేదవారిగా ధనికులు మరింత ధనికులుగా మారుతున్నరు. పని చేసే వాడికి అన్నం పెట్టని, మానవ మర్యాదలు ఇవ్వని, జీవిత భద్రత ఇవ్వని దేశం ఒక దేశమేనా? బహుజన సమాజం ఆర్థిక భద్రత కోసం లాల్, నీల్ కలయిక నేటి ఆవశ్యకతగా మన ముందుకొస్తుంది.

5. ఎస్సీపైకి బీసీలను, బీసీలపైకి మైనార్టీలను, మైనా ర్టీలపైకి ఎస్సీ, బీసీలను ఎగదోస్తూ బహుజన సమాజంలో తగువులు పెడుతూ మనుషులను చంపేస్తున్నారు. ఈ అమానుషం ఆగాలి. ఒకరిని ఒకరు గౌరవించుకొని మనుషులుగా బతుకాలి. అలాంటి పరిస్థితులు నేడు లేవు. అందుకోసం అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు కలవాలి.

5. ప్రకతిని కాపాడి ఈ భూమిని, వనరులను భవిష్యత్తు తరాలకు అందించడం కోసం శాస్త్రీయ దక్పథం ఈ దేశ ప్రజలలో పొందుపరచాలి. అందుకోసం మానవ వనరులను అభివద్ధి చేయాలి. సామాన్యుడు-పర్యావరణం కేంద్రంగా బడ్జెట్ రావాలి. ఇప్పటివరకు భారతదేశంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లన్నీ ప్రజా వ్యతిరేఖమైనవి, పర్యావరణానికి హాని కలిగించేవే.

5. ఒక దేశ ప్రమాణాలు పెరగాలంటే, ప్రపంచస్థాయిలో తలెత్తుకోవాలంటే ఆ దేశం విద్య ప్రమాణాలలో ఏ మాత్రం రాజీ పడకూడదు. దేశ భవిష్యత్తు కోసం తమ పిల్లలకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన హాస్టల్ సదుపాయాలు, విద్య అందించాలి.

5. దేశ సంపద పెరగాలంటే ఆ దేశ కర్షకులు, కార్మికుల వేతన భద్రత, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత పటిష్టంగా ఉండాలి.

మొత్తంగా మానవీయ కోణంతో శాస్త్రీయ దక్పథంతో దేశాన్ని నడిపించడంలో బ్రహ్మణీయ పాలక సమాజ నాయకత్వం అనగా బీజేపీ, కాంగ్రెస్,టీఆర్ఎస్ లాంటి పార్టీల నాయకత్వాలు విఫలం చెందాయి. కండ్లుండి చూడలేని ఈ కబోదులు దేశంలో దారిద్ర్యాన్ని పారదోలలేరు. కష్టజీవుల బహుజన భారతాన్ని కాపాడలేరు. అందుకోసమే ఈ మహాప్రస్థానం మీ ముందుకొస్తున్నది.

ఆధిపత్య కులాల అణచివేతను ప్రతిఘటిద్దాం.
బ్రాహ్మణీయ, మనువాదాన్ని ఓడిద్దాం.
ఈ యుద్ధాన్ని దీవించండి ప్రజలారా..

సెల్ : 9440488428

స్వేచ్ఛ లేని గడ్డ, నియంతల అడ్డా



పచ్చుల రాజేష్

చరిత్రలో ప్రజలు ప్రజా సమూహాలు తమ సమస్యలు పరిష్కారం కాక నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో కొన్ని నినాదాలు పురుడుపోసుకుంటాయి. ఆ నినాదాలు నిరసన సెగలై కొత్త రూపం సంతరించుకొని ఉవ్వెత్తున ఎగసిపడతాయి. వాటినే ప్రజా ఉద్యమాలుగా పరిగణిస్తున్నాం, నిర్వచిస్తున్నాం. రాచరికపు రాక్షసత్వాలపై మొదలైన ఈ ఉద్యమాలు మానవ హక్కులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలుగా కూడా రూపుదిద్దుకున్నాయి. కారణాలు ఏవైనా కావచ్చు. కానీ పరిష్కారానికి ఎంచుకున్న మార్గం మాత్రం ఉద్యమమే. ప్రపంచ మానవాళికి ప్రజా ఉద్యమాల దిక్సూచిగా మారిన ఫ్రెంచ్ విప్లవ నినాదం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం. ఇప్పుడు వాటి కోసమే భారతదేశంలో కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి. అభివద్ధి చెందుతున్న దేశమని ఎప్పుడూ చర్చించుకుంటున్నట్టే, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో రాజరికపు వాసనలు ఇంకా పోలేదని కూడా చర్చ నడుస్తుంది. అది వాస్తవం కూడా. అయితే ఇక్కడ అది భూ స్వాముల రూపంలో ఉంటుంది. కులం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆ కుల అహంకారమే ఇంకా భారతదేశంలో అన్ని చోట్లా పాలకుల మదినిండా నిండి ఉంది. ఇప్పుడు స్వతంత్ర్య భారతదేశ సామాజిక ఉద్యమాల సారధి మంద కష్ణ మాదిగ అరెస్ట్ కూడా ఇటువంటి అహంకారపూరిత భావనలోనిదే అని ఇట్టే చెప్పవచ్చు. డిసెంబర్ 17న సికింద్రాబాద్‌లో వర్గీకరణ కోసం అసువులుబాసిన భారతి మాదిగ సంస్మరణ సభ అనంతరం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని సాకుగా చూపి మంద కష్ణను, ఆయన అనుచరులను అరెస్ట్ చేయడం, వారిని చంచల్‌గూడ జైలుకి తరలించడం ఆశ్చర్యం కలిగించేదే. "తెలుగు మహాసభలకు విచ్చేస్తున్న రాష్ట్రపతి గారికైనా మా బాధలు చెప్పుకుంటాం" అంటూ ఉద్వేగ భరితంగా జరిగిన ర్యాలీతో తెలుగు మహాసభలకు ఆటంకం కలుగుతుందని అరెస్ట్ చేసి ఉండొచ్చు. రాష్ట్రపతి గారి పర్యటన ముగిసాక విడుదల అవుతారనుకున్నారు అందరూ. కానీ అలా జరగలేదు. సభలు ముగిసాయి, రాష్ట్రపతి హైదరాబాద్ విడిచి వెళ్లిపోయారు, కానీ మందకృష్ణ జైలులోనే బంధించబడి ఉన్నారు. ఎటువంటి ప్రాణం, ఆస్తి నష్టం, విధ్వంసం లేకున్నా కష్ణమాదిగకు బెయిల్ మంజూరు కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా బెయిల్ రాకుండా ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపిందన్న భావన అంతటా వ్యాపించింది. కొందరికి ఇది పోరాడి సాధించుకున్న తెలంగాణయేనా? అనే అనుమానాలు లేకపోలేదు. ఎందుకంటే తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం పరితపించే నేల. అందుకోసం ఎంతకైనా తెగించే ప్రజలు తెలంగాణ సొంతం. చరిత్రలో సాయుధ పోరాటం చూశాం, రజాకార్ల ఆగడాలను తిప్పికొట్టిన రోజులూ చూశాం. కానీ స్వపాలనలో అంతరించిపోతున్న అంతర్గత స్వేచ్ఛను కూడా నేడు చూడవలసి వస్తుంది. ప్రతి సభ అనుమతి కోసం న్యాయ స్థానాల గడపతొక్కాల్సివస్తుంది. ధర్నా చౌక్ దగ్గరి నుండి మొదలుకుంటే కొలువుల కొట్లాట సభ ఇంకా తదితర అంశాల సభల అనుమతి కోసం కండ్లు కాయలు కాసేలా చూడాల్సి వస్తుంది. ప్రభుత్వానికి వ్యతిరేక సభ అనిపిస్తే ఇక అనుమతి దొరకడం కలే అవుతుంది. ఎందుకింత అసహనం. దగ్గరగా గమనిస్తే ఇది అభద్రతా భావమని ఇట్టే తెలుస్తుంది. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ఉద్యమ వేదికలు తెలంగాణలో కోకొల్లలు. ఇప్పుడు కష్ణ మాదిగ మీద ప్రభుత్వం ఎందుకు ఇంతలా నిర్బంధం పెట్టిందో తెలుసుకోవాలంటే ఒకసారి జరుగుతున్న పరిణామాలు పరిశీలించాల్సిందే. కేసీఆర్ 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రకటించిన హామీ దళిత ముఖ్యమంత్రి. దళితులకు మూడెకరాల భూమి. మొదటి హామీ తెలంగాణ ఏర్పడ్డ మొదటి రోజే మట్టిలో కలిసిపోయింది. దళితులకు మూడెకరాల భూమి కలగా మిగిలిపోయింది. మాదిగలకు, మాలలకు క్యాబినెట్‌లో స్థానం లేకుండా పోయింది. ఉన్న ఒక్క మాదిగ మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేశారు. మహిళలకు కూడా మంత్రివర్గంలో స్థానం లేదు. పేరుకి కుల సంఘమే అయినా సకల జనుల కోసం ఉద్యమాలు నడిపిన ఘనత ఎమ్మార్పీఎస్‌ది. మొదటి నుండీ ఈ అంశాలన్నిటి మీద మాట్లాడుతూ వస్తున్న సంఘం మాదిగ దండోరానే. అయితే వర్గీకరణ కోసం మలి దశ ఉద్యమంగా భావిస్తున్న ప్రస్తుత దండోరా కార్యాచరణ దక్షిణాది రాష్ట్రాలకు, ఉత్తరాది ప్రాంతాలకు కూడా వ్యాపిస్తుందనడంతో కృష్ణ మాదిగే అక్కడకు స్వయంగా వెళ్లి సభలు, సమావేశాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం జరిగినప్పుడు చోటు చేసుకున్న చట్ట ఉల్లంఘనలు, ప్రభుత్వ విధులకు ఆటంకాలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు ఇంకా ప్రభుత్వ ఆస్తులు, ఉద్యోగులపై జరిగిన దాడులు వంటివి ఒక్కటీ చోటు చేసుకోని దండోరా ర్యాలీలోని నేతలు నేడు జైలులో బంధించబడ్డారు. అలాంటప్పుడు, ఆనాడు కూడా నేటి పాలకులంతా జైలులో మగ్గాల్సింది. కానీ అలా జరగలేదు. దీనికి కారణం స్వేచ్ఛ మా ఒక్కరి హక్కు మాత్రమే అనుకునే పాలకులే. ఉద్యమకారులుగా ప్రశ్నలు వేయొచ్చు కానీ తాము పాలకులయ్యాక ప్రశ్నలే ఉండకూడదు, వేలెత్తిచూపకూడదు అనేదే నేటి ప్రజాస్వామ్యంలా ఉంది. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇలా ప్రశ్నించే గొంతులన్నిటినీ నొక్కడమే పనిగా పెట్టుకున్నారా అన్న భావన ప్రజల్లో పాతుకుపోయింది. పాలకవర్గంగా ఎదిగిన వారు ప్రజల వాణి వినిపించిన వారి ప్రాణాల మీద ఎక్కుపెడుతున్నారు. మంద కష్ణపై కుట్ర జరుగుతుందని మోత్కుపల్లి వంటి నాయకులు ప్రకటించడం ఇటువంటి ఆరోపణలను బలపరుస్తుంది. ఇప్పుడు కష్ణ మాదిగ, రేపు మరొకరు కావచ్చు. ఇప్పుడు పరిస్థితి కష్ణ మాదిగను అకారణంగా అరెస్ట్ చేసేదాకా వెళ్తే, కోదండరాంను అర్థరాత్రి అరెస్ట్ చేసే దాక వెళ్లింది. వీళ్లేనా ఇంకా ఇటువంటి నిర్బంధాలు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న వారెందరో. కష్ణమాదిగను అరెస్ట్ చేసి అకారణంగా నిర్బంధించి తెలంగాణ ప్రభుత్వం సాధించిందేమీ లేదు. ఈచర్య తెలంగాణ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు, తెలుగు రాష్ట్రాల్లో నిరసనలు, తమిళనాడు, కర్ణాటకలో ఖండనలు, ప్రతి ప్రజా సంఘ ప్రకటనలు మొత్తం మీద దేశమంతా పరువు పోగొట్టుకుంది ప్రభుత్వం. కష్ణ మాదిగను అరెస్ట్ చేస్తే సామాజిక ఉద్యమాలను, సామాజిక న్యాయాన్ని అరెస్ట్ చేసినట్టే. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు కావలసింది స్వేచ్ఛ. ఇప్పుడది కనబడడం లేదు.

సెల్ : 8331823086

స్కూల్ ఫీజులపై నియంత్రణ ఏది?




చింత ఎల్లస్వామి

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన చందంగా స్కూల్ ఫీజుల నియంత్రణపై వేసిన ఆచార్య తిరుపతిరావు కమిటీ పరిస్థితి. అసలు లక్ష్యాన్ని మరిచిపోయి ఫీజుల పెంపు కోసమే వేసిన కమిటీగా మారిపోయింది. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో అధిక ఫీజుల వసూళ్లపై అటు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి 9 నెలల క్రితం ఫీజుల నియంత్రణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ద్వారా అధిక ఫీజుల వసూళ్లకు కళ్లెం పడుతుందని అందరూ ఆశించారు, దీని ద్వారా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుందని ఆశించి తలిదండ్రులు, వివిధ సంఘాలు క్షేత్రస్థాయిలో పాఠశాలలో ఫీజుల దోపిడీపై అనేక విజ్ఞప్తులు అందచేశారు. తీరా చూస్తే కమిటీ అసలు లక్ష్యాన్ని మరిచిపోయి తల్లితండ్రుల కోణంలో గానీ, సామాజిక కోణంలో గానీ ఆలోచించకుండా కార్పొరేట్ విద్యా సంస్థలకు కాసుల వర్షం కురిపించే విధంగా ప్రతి ఏటా పది శాతం మేర ఫీజు పెంపుకు సిఫారసు చేయటం చాలా విచారకరం. క్షేత్రస్థాయిలో చూస్తే ఆటో డ్రైవర్ నుండి రోజువారీ సామాన్య కూలి వరకు తాము నిరక్షరాస్యులు అయినప్పటికీ తమ పిల్లలు కార్పొరేట్ స్థాయిలో చదవాలనే ఉదేశ్యంతో తమ సంపాదనలో సింహ భాగాన్ని విద్యార్థుల ఫీజులకు ఖర్చు చేస్తున్నారు. ఇవ్వాళ విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ ప్రకటనతో నిరక్షరాస్యలైన తల్లితండ్రులను ఆకట్టుకుంటూ వారి నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. అలాంటి విద్యా సంస్థలలో ఫీజులను కట్టడి చేయాల్సిన కమిటీ ఫీజుల పెంపుకే మొగ్గు చూపటం నిజంగా ఈ కమిటీ కార్పొరేట్ విద్యా సంస్థలకు తలొగ్గి ఈ నివేదికను ప్రభుత్వానికి ఇచ్చిందనటంలో సందేహం లేదు. ప్రస్తుతం అన్ని పాఠశాలలో ఒకేవిధంగా ఫీజులు వసూలు చేయడం లేదు. 12 వేల నుండి రెండు లక్షల వరకు వసూళ్లు చేసే విద్యా సంస్థలున్నాయి, ఈ పది శాతం ఫీజు పెంపు అనేది అన్ని పాఠశాలలకు వర్తింపచేయటం ద్వారా రెండు లక్షలున్న పాఠశాలలో ఒక్క విద్యా సంవత్సరానికి ఇరవై వేలు పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి విద్యా సంస్థలో ఫీజును కట్టడి చేయాల్సిన కమిటీ మళ్లీ ఫీజులను పెంచుకునేందుకు అవకాశం ఇచ్చింది. అసలు నిబంధనల ప్రకారం డొనేషన్స్ వసూలు చేయొద్దని చెబుతునప్పటికీ ఏ పాఠశాల కూడా పాటించకుండా ఇష్టారాజ్యాంగా వసూలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అదే సమయంలో ఈ కమిటీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయకపోగా కేవలం సూచనలు మాత్రమే చేయటం బాధాకరం. జీవో నెంబర్ ఒకటి ప్రకారం ఫీజుల వసూలులో 50 శాతం సిబ్బందికి, పాఠశాల అభివద్ధికి కేటాయించాలని చెబుతున్నది. కానీ ఈ నిబంధనను తొలగించారు. ఇది చాలా పెద్ద కుట్రగా భావించాలి. తెలంగాణలో కార్పొరేట్ విద్యా సంస్థలు వటా వక్షాలుగా ఎదగటంలో ని(చి)రుద్యోగుల శ్రమ ఎంతో వుంది. వారి శ్రమ దోపిడీ యాజమాన్యాలకు ప్రాణవాయువుగా మారి ఇష్టం వచ్చినట్టుగా జీతాలివ్వడమే కాకుండా ఫీజులను విపరీతంగా వసూలు చేస్తున్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలలో పని చేసే సిబ్బందికి శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వటం లేదు. అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో నిర్వహించాలనేది మంచి సిఫార్సు. అయినప్పటికీ ఇది అమలుకు సాధ్యం కాని అంశం. ఎందుకంటే పరిమిత సంఖ్యలో ఉన్న డిగ్రీ అడ్మిషన్లలో జరుగుతున్న గందరగోళాన్ని మనం గమనిస్తూనే ఉన్నాం, ఇప్పటికే సగం అడ్మిషన్లు చాలా పాఠశాలలు పూర్తి చేశాయి, అదేవిధంగా చాలా పాఠశాలలు ఎలాంటి క్రీడా మైదానాలు లేకుండా నడుస్తున్నా అలాంటి పాఠశాలపై కఠిన చర్యలకు ఈ కమిటీ సిఫారసు చేయలేదు. కేవలం కార్పొరేట్ విద్యా సంస్థలు ఎలా డబ్బులు సంపాదించాలో సులభ మార్గాన్ని ఈ కమిటీ చూపడం జరిగింది. మొత్తం మీద ఈ కమిటీ సిఫారసులను మనం పరిశీలిస్తే సామాన్య ప్రజలకు ఏ మాత్రం ఉపశమనం ఇచ్చే అంశాలు ఇందులో లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫీజులు పెంచకుండా ఉండే పాఠశాలలు కూడా ఈ సిఫార్సుల ద్వారా పెంచే ప్రమాదముంది. ఈ అంశాల కోసం 9 నెలలు శ్రమించాల్సిన అవసరం లేదు. ఈ కమిటీ కేవలం కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు ఇచ్చిన సూచనలను, నివేదికను మాత్రమే ప్రభుత్వానికి ఇవ్వటం జరిగిందనటంలో సందేహం లేదు. ఇలాంటి సూచనలను గతంలో అనేక కమిటీలు కూడా చెప్పటం జరిగింది. ఈ కమిటీ అన్ని పాఠశాలలకు ఆర్థికస్థితి గతంలాగే నివేదిక పంపాలని కోరితే 12 వేల పాఠశాలలో కేవలం 4500 పాఠశాలలు మాత్రమే నివేదికలను పంపటం జరిగింది, ఇందులో అన్నీ చిన్న, చితకా పాఠశాలలే ఉన్నాయి, అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలు ఏ ఒక్కటీ నివేదికలను పంపలేదు. ఇలాంటి పాఠశాలల రద్దుకు ఎందుకు సిఫార్సు చేయలేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

సెల్ : 9908186025

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ - తెలంగాణ




కాలువ మల్లయ్య

తెలంగాణ ఒక యుద్ధ భూమి. బుద్ధ భూమి కూడా. బుద్ధుని కాలం నాటికే తెలంగాణలో అద్భుతమైన నాగరికత, మాతృస్వామ్య వ్యవస్థ ఉందనడానికి ఆధారాలున్నాయి. బుద్ధుని శిష్యుల్లో ఒకరైన 'బావరి' తెలంగాణలో ఉన్న కరీంనగర్ జిల్లాలోని (ఇప్పటి జగిత్యాల జిల్లా) కోరుట్ల ప్రాంతం వాడంటారు. బౌద్ధం ఆనవాళ్లు తెలంగాణలో విశేషంగా ఉన్నాయి. అలాంటి బుద్ధ భూమి యుద్ధ భూమిగా మారింది. చారిత్రక కాలాన్ని వదిలిపెడితే గత వంద సంవత్సరాలుగా తెలంగాణ నిత్య గాయాల నేలగానే ఉంటుంది. నైజాం నవాబు కూడా హిందూ ఫ్యూడల్ నవాబుల్లాగే పరిపాలించి తాను రాజుగా ఉన్నా హిందూ ఫ్యూడల్ దొరల పాలనలో తెలంగాణ మగ్గిపోయేటట్టు చేశాడు. అగ్రవర్ణ ఫ్యూడల్ దొరలే నిజాం నవాబుకు సలహాదారులుగా, దేశ్‌ముఖ్‌లుగా, జాగీర్దార్‌లుగా, భూస్వాములుగా తెలంగాణనేలారు. ఫ్యూడల్ నైజాం పాలనకు వ్యతిరేకంగా మాత్రమే కాదు, ఊర్లోని దొరల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగానూ తెలంగాణలో ప్రజాగ్రహం పెల్లుబికింది. అది తెలంగాణ సాయుధ పోరాటంగా పరిణామం చెందింది. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాటంగా ఇది దేశానికే భూ పోరాటాల వారసత్వాన్నందించింది. ఈ పోరాటంలో ఆబాల గోపాలం అన్ని వర్గాల, కులాల ప్రజలు పాల్గొన్నారు. ఇందులో అసువులు బాసినవారిలో 90శాతానికి పైగా బహుజన కులాలవారే. ఈ ఒక్క పోరాటంలోనే కాదు, ఏ పోరాటంలోనైనా రాజుల కాలంలో సైనికులుగా, సేవకులుగా, బంట్లుగా ఇలాంటి పోరాటాల్లో సాయుధులుగా ప్రాణాలు అర్పించింది బహుజన కులాల వారు. నిజాం పాలనా కాలంలో ఊర్లల్లో దొరలు, అగ్రవర్ణ దేశ్‌ముఖ్‌లు పోలీస్ పటేళ్లుగా, మాలీ పటేళ్లుగా నిమ్నకులాలపై దోపిడీ పీడనలు, అణచివేతలు కొనసాగిస్తే బాధితులంతా అణగారిన కులాలే. సాయుధ పోరాటం ద్వారా పేదలకు పంచిన భూమి కూడా పోరాట విరమణ తర్వాత కాంగ్రెస్ పాలనలో మళ్లీ దొరల చేతుల్లోకే పోయింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా హైదరాబాద్ దక్కన్ ఏర్పడినా అందులో మంత్రులు, ఎమ్మెల్యేలు బహుజన కులాల వారు నామమాత్రమే. గ్రామాల పాలన మొత్తం అగ్రవర్ణ పెత్తందార్ల చేతుల్లోనే. బహుజనుల పీడితులుగా అణచివేతకు గురయ్యారు. బహుజనుల పరిస్థితి హైదరాబాద్ దక్కన్‌గా ఉన్నప్పుడు ఏ మాత్రం మారలేదు. అటు తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకులుగా అతి కొద్దికాలం ఓ దళితుడు వచ్చినా అన్ని సంవత్సరాలూ రెడ్డి, బ్రాహ్మణ, కమ్మ దొరల పాలనే. రిజర్వుడు స్థానంలో ఎస్సీ, ఎస్టీలు తప్పితే మరెక్కడా బీసీలకు, బహుజనులకు తగిన స్థానం లేదు. ఈ కాలంలోనూ తెలంగాణ బహుజనులంతా పీడితులుగానే ఉన్నారు, పాలితులుగానే ఉన్నారు. గ్రామాల్లోని అణగారిన కులాలు మొత్తంగా బహుజనులు అదే ఫ్యూడల్ దొరల పాలన కిందే ఉన్నారు. చిల్లర దేవుండ్లదే రాజ్యం. దొరల అణచివేత, ఫ్యూడల్ భావాలు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్టుగానే కొనసాగింది. బహుజనులు ఇప్పుడూ పరాధీనులే, పాలితులే, పీడితులే. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విరమిస్తున్న సమయంలోనే తెలంగాణలో భూపోరాట ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణలోని ఫ్యూడల్ సంస్కృతికి అణచివేతకు, దొరల పాలనకు విసిగిపోయిన బహుజనులు ఆ సమయంలో ఉవ్వెత్తున లేచిన నక్సలైట్ ఉద్యమానికి బాసటగా నిలిచారు. బానిసలుగా, వెట్టివారుగా చావడం కంటే పోరాటంలో చావడమైనా మంచిదేనని అందులో మునిగి తేలారు. పోరాడితే పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప అని మరణాన్ని కౌగిలించుకున్నారు. తుపాకీ గుండ్లకెదురుగా నిలిచారు. వేల మంది మిలిటెంట్ యువకులు చనిపోయారు. తెలంగాణ నేలంతా రక్తసిక్తమైంది. తెలంగాణ అగ్ని గుండమైంది. ఇదే సమయంలో తెలంగాణలో కులవివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్ ఉద్యమాలు జరిగాయి. ఈ పోరాటాలన్నింట్లో అసువులు బాసిన వారిలో 90శాతం దళిత బహుజనులే. ఈ పోరాటాలతో, అంబేద్కర్ ఉద్యమాలతో ఊర్లలో ఫ్యూడల్ దొరలు కొంత భయపడినా పోరాటాలు చల్లారింతర్వాత మొదటి పోరాటాల విరమణ తర్వాత పట్నాలకు వెళ్లిన దొరలు గాంధీ టోపీలతో ఊర్లోకొచ్చినట్టు, ఈ పోరాటాల ఉధృతి తగ్గింతర్వాత వచ్చారు. టీఆర్ఎస్ పార్టీ వచ్చింతర్వాత దొరలకు గ్రామాల్లో ఎప్పట్లా ద్వారాలు తెరిచినట్టయింది. బహుజనులు తెలంగాణ రావడం వల్ల తమ బతుకులు బాగుపడుతాయనుకున్నారు. ఉద్యోగాలు వస్తాయనుకున్నారు. తెలంగాణలో వివిధ పోరాటాల వల్ల బహుజన చైతన్యం ఉంది. కాబట్టి తెలంగాణ వస్తే సామాజిక తెలంగాణ వచ్చే అవకాశముందనుకున్నారు. అందుకు తగ్గట్టుగానే కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి అవుతాడన్నారు. అగ్రవర్ణ నాయకులు తెలంగాణ కోసం తల నరుక్కుంటామని, కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ప్రకటనలు చేశాడు. ప్రజలను రెచ్చగొట్టారు. తెలంగాణ నేలను హృదయాలకు హత్తుకున్న వారు బహుజనులు. ఈ నేలను ప్రేమించారు. సంస్కృతిని ప్రేమించారు. తెలంగాణ వస్తే విస్మరణకు గురవుతున్న భాష, సంస్కృతి, స్వపరిపాలన అన్నీ వస్తాయనుకున్నారు బహుజనులు. తమ బలిదానాలతోనైనా తెలంగాణ వస్తుందని ఆశించారు. రెచ్చగొట్టిన అగ్రవర్ణ నాయకులెవరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. వాళ్ల పిల్లలెవరూ తెలంగాణ కోసం బలికాలేదు. కానీ ఈ నేలను నమ్ముకున్న బహుజనులు తమ వల్లనైనా తెలంగాణ వస్తుందని ఆత్మహత్యలు చేసుకున్నారు. మలిదశ తెలంగాణ పోరాటంలో బలైన 1200 మందిలో 98శాతం బహుజనులే. అణగారిన కులాల వారే. కానీ పాలకులైంది మాత్రం అగ్రవర్ణాల వారు. తెలంగాణ బలిదానాల్లో ఏమాత్రం పాత్ర లేని వారు. బహుజనుల స్థితి మరీ అధ్వానమైంది. నైజాం పాలనలో కంటే ఎక్కువ ఫ్యూడల్ సంస్కృతి పెరుగుతున్నది. అణచివేతలు పెరిగాయి. నిరంకుశత్వం పెరిగింది. అగ్రకుల ఆధిపత్యమూ పెరిగింది. ఫ్యూడల్ భావజాలంపైన కుల స్థిరీకరణ జరుగుతున్నది. బహుజనులను శాశ్వతంగా పాలితులుగా ఉంచి దొరల కుటుంబాలు మాత్రమే పాలకులుగా ఉండే పరిస్థితులు ప్రోత్సహించబ డుతున్నాయి. కనీసం ధర్నాలు చేసే అవకాశం కూడా లేదు. పోరాట భూమి, ఉద్యమాల నేల అయిన తెలంగాణలో అన్ని సందర్భాల్లోనూ 93శాతం ఉన్న బహుజనులు పాలితులు, పీడితులు అణగారిన ప్రజలే. వీరికి ఏ సందర్భంలోనూ సామాజిక న్యాయం జరగడం లేదు. ఇప్పుడది మరింత వికృతగా, భయోద్విగ్నంగా ఫ్యూడలిజం విలయతాండవం చేస్తున్నది. ఇలాంటి సామాజిక, చారిత్రక, రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణలో "బహుజన లెఫ్ట్ ఫ్రంట్" ఏర్పడింది. బహు జనవాద పార్టీలు, వామపక్షవాద పార్టీలు ముప్పైకి పైగా పార్టీలతో ఈ ఫ్రంట్ ఏర్పడింది. "సామాజిక న్యాయం తద్వా రా సామాజిక మార్పు" ప్రధాన ఎజెండాగా ఇదివరకు అధికా ర స్థానాల్లో లేని బహుజనుల అధికారం లక్ష్యంగా, తద్వారా అందరికీ న్యాయం చేసేందుకు ఈ ఫ్రంట్ ఏర్పడింది. ప్రజాస్వామ్య, ప్రజాపక్షవాదులైన మార్క్సిస్టులు, కమ్యూనిస్టు పార్టీలన్నీ బహుజన పార్టీలతో కలిసి ప్రజాస్వామ్యమంటే మెజార్టీ ప్రజల పాలన, పీడిత ప్రజల పాలన అనే భావజా లంతో ఈ ఫ్రంట్ ఏర్పడింది. ఇంతకాలంగా తెలంగాణలో బ లిదానాలు చేసిన కమ్యూనిస్టు, బహుజనులకు న్యాయం చేయడానికి, బహుజనుల బతుకులు మార్చడానికి ఈ ఫ్రంట్ ఏర్పడింది.

బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌తోనే ఈ దేశ మెజార్టీ ప్రజలైన బహుజనుల క్షేమం సాధ్యం. తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఓ చారిత్రాత్మక అవసరం. సామాజికావసరం, రాజకీయావసరం కూడా. ఉచిత నిర్బంధ విద్య ఉచిత వైద్యం, సేద్యం, మద్యపాన నిషేధం (కల్లు కాకుండా) ప్రధాన లక్ష్యాలుగా అందరికీ కూడు గుడ్డ నీడ, పని ఈ దేశ మెజార్టీ ప్రజల పాలన, యోగక్షేమాలు ధ్యేయాలుగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ మానవీయ కోణం నుండి రాజకీయాలను ఆవిష్కరిస్తుంది.

సెల్: 9849377578

ప్రాచీన నాగరికతను ప్రపంచానికి తెలపాలి



వినోద్‌కుమార్ సుద్దాల

ఆది మానవుడి ప్రస్థానం నుండి ఆధునిక మానవుడి ఆవిష్కరణల యుగం వరకు గల ప్రయాణంలో అనేక అవరోధాలు, ఆటంకాలు అధిగమిస్తూనే ఆహారం వసతి నుండి అద్భుతాల సృష్టి వరకు ఎన్నో ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. ముఖ్యంగా హరప్పా నాగరికతకు సంబంధించిన ఆధారాలు లభ్యమైన తర్వాత అప్పటివరకు ఉన్న ప్రపంచ ప్రాచీన నాగరికతలలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకోవడమే గాక మన దేశ ఘన చరితను ప్రపంచానికి పరిచయం చేసింది. ముఖ్యంగా ప్రాచీనకాలంలోని నిర్మాణాలైన సమాధులు, గహనిర్మాణం, దేవాలయాలు, శిల్పాలు, గహోపకరణాలు, వ్యవసాయ వాణిజ్య పనిముట్లు, క్రీడా వస్తువులు, అలంకరణ ఉపకరణాలు, నాణేలు, ఆయుధాలు, మట్టి పాత్రలు మొదలైనవన్నీ గత చరిత్ర అధ్యయనానికి మనదేశ ఘనకీర్తికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నవి. ఇంతటి ఘన వారసత్వ సంపద కలిగిన దేశంలో అడుగడుగునా నిర్లక్ష్యం ప్రభుత్వ చిన్నచూపు ప్రజల నిరాదరణ, ముందు చూపు లేమి వల్ల ఘనమైన గత చరిత్ర వారసత్వ చారిత్రక సంపద గతమయ్యే స్థితికి చేరుకున్నది. చారిత్రక వారసత్వ ఆనవాళ్లు ఆధారం చేసుకొని ఎన్నో దేశాలు పర్యాటక రంగానికి అనుసంధానించి అవి అభివృద్ధి చెందేలా కృషి చేస్తుండగా ఇక్కడ పరిస్థితి భిన్నంగా తయారైంది.

మనకే ప్రత్యేకమైన బతుకమ్మ, బోనాలను రాష్ట్ర పండుగలుగా ప్రకటించి విరివిగా నిధులు ఇస్తూ రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచం నలుమూలల వ్యాప్తి చేస్తున్నప్పటికీ రాష్ట్ర అస్తిత్వానికి, ప్రత్యేకతకు గుర్తుగా నిలిచిన చారిత్రక వారసత్వ సంపదలు సాహిత్యరంగం నిర్మాణం వాస్తు శిల్ప ఆనవాళ్లను సంరక్షించుకోవడమే కాక వాటిని మరింత మెరుగుపరిచి ప్రపంచానికి మన వారసత్వ ఘనకీర్తిని చారిత్రక సంపద ఔన్నత్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముఖ్యంగా పురాతన కాలం నుండి మానవుడి ప్రస్థానంలో వాడిన పరికరాలు వాటి అవశేషాలు లభ్యమైన అనేక స్థలాలు, పురాతన దేవాలయాల వద్ద లభ్యమయ్యే శాసనాలు, నాణేలు, కట్టడాలను పరిరక్షిస్తూ వాటిపై అధ్యయనానికి ప్రోత్సాహం అందించాలి. అంతేకాకుండా మన సంస్కతి సంప్రదాయాలతో పెనవేసుకున్న దేవాలయాలు నిర్మాణ శైలి, వాస్తు శిల్పాలు ప్రతి ప్రాంతానికి భిన్నంగా ఉంటూ ప్రత్యేకతను కలిగి ఉంటాయి. అలాగే తెలంగాణలో శాతవాహన పూర్వంనుండి ఆఖరి పరిపాలకుడైన నైజాం నవాబుల వరకు అనేక నిర్మాణాలు రాష్ట్రమంతటా విస్తరించి ఉన్నవి. వాటిలో ముఖ్యమైన వారసత్వ కేంద్రాలు కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నవి. (కాకతీయుల కళాతష్ణకు నిర్మాణ కౌశల్యానికి ప్రతీకగా నిలిచిన రామప్ప దేవాలయం శిథిలమవుతున్న పరిస్థితిపై హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించటం గమనార్హం. ప్రభుత్వం, ప్రజలు ప్రాచీన వారసత్వ సంపద పరిరక్షణకు పురావస్తుశాఖ మేధావులు, కళాకారులంతా సమన్వయంతో సంపదను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను పై ఘటన గుర్తుచేస్తున్నది. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పురాతన వారసత్వ సంపద కట్టడాలు, దేవాలయాలు, శిల్పాలు ఎన్నో ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ తన ఘన చరిత్రను కాపాడుకుంటూనే ప్రత్యేకతను సంతరించుకునేలా కషి చేయాలి. ప్రభుత్వం కూడా తాత్కాలిక ప్రయోజనాల కంటే శాశ్వత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చి ఘనమైన గత సంపదను పర్యాటకానికి అనుసంధానిస్తూ చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడమే గాక ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఉపయోగించుకోవాలి. యునెస్కో వారి గుర్తింపు సైతం పొందాల్సిన అనేక కట్టడాలు మన చెంతనే ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వాటిని ప్రపంచానికి దూరం చేస్తున్నది. కాకతీయుల కాలంనాటి అద్భుత శిల్ప కట్టడాలలో వాడిన సాండ్బాక్స్ టెక్నాలజీ చాలా అద్భుతమైనదే కాక ఇప్పటి ఇంజనీరింగ్ నిపుణులను సైతం నివ్వెరపోయేలా చేసింది. అలాంటి అబ్బురపరిచే అత్యద్భుత కళాసంపద శిల్పసౌందర్యం రమణీయ ప్రదేశాలు పురాతన చారిత్రక ప్రదేశాలు అనేకం తెలంగాణలో కోకొల్లలు. కాకతీయుల కళా సంపదను కనులారా వీక్షించిన ఒక ఫ్రెంచ్ యాత్రికురాలు "ఈ సంపద మా దగ్గర ఉంటే బాగుండు" అని వ్యాఖ్యానించింది. అంటే మన దక్కోణానికి వారి దక్కోణానికి మధ్యగల బేధానికి తార్కాణంగా నిలుస్తున్నది. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ కళాఖండా లు, గుడులు, కట్టడాలు, సమాధులు, కోటలు ఇతరత్రా పురాతన సంపద ఏ రూపంలో ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లను వెలికితీసేందుకు, వాటి పరిరక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడమే గాక, భవిష్యత్ తరాలకు మన వారసత్వాన్ని అందించాలని దీర్ఘదష్టితో నేటి తరానికి చెందిన ఉత్సాహవంతులైన యువ పరిశోధకులకు అధ్యయనానికి ప్రోత్సాహమివ్వడమే కాకుండా వారికి విస్తృత అవకాశాలు కల్పించాలి. పాఠశాల విద్యార్థులకు పరిచయం చేస్తూ వాటి చరిత్రను ఏ గ్రామానికి ఆ గ్రామ పాఠశాలలో ఒకపూట కేటాయించి కార్యక్రమాలు నిర్వహించాలి. మన చెంతనే ఉన్న ఘనమైన మన పురాతన వారసత్వ సంపదను రక్షించుకోవడం మన బాధ్యత కాగా, దాన్ని మరింతగా అభివద్ధి చేసి దానిని పర్యాటకరంగానికి అనుసంధానించి ఉపాధి కల్పన అవకాశాలు పెంచేలా స్వదేశీ, విదేశీ పర్యాటకులను విరివిగా ఆకర్షించేలా చేయడంవల్ల ఇక్కడి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా పెరుగుతాయి.

సెల్ : 9908312949

గిరిజనుల చదువుల్లో పురోగతి ఏది?



శ్రీనివాస్ చిరిపోతుల

దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో ఆదివాసులు ఎక్కువగా నివసిస్తున్న 86 జిల్లాల్లో అక్షరాస్యత 35శాతానికి మించలేదు. గిరిజన ప్రాంతాల్లో భిన్నమైన సాంఘిక, ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు నె లకొని ఉంటాయి. దానివల్ల వారి విద్యాభివద్ధి విషయంలో ప్రభుత్వాలకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. అక్షరాస్యత పెరుగుదలలో ఏటేటా ఘోరమైన తిరోగమనం కనిపిస్తుండడం విచార కరమైన విషయం. మౌలిక సదుపాయాలు, రహదార్లు ఉన్న ప్రాంతాలపైనే అధికార వ్యవస్థలు దష్టిపెట్టి మారుమూల ప్రాంతాలను పట్టించుకోని దుస్థితి నెలకొంది. దీంతో కొండల్లో, కాలిబాటలే శరణ్యమైన పల్లెల్లో పిల్లలు బడిబాట పట్టలేకపోతున్నారు. గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక సమగ్ర గిరిజనాభివద్ధి ప్రాజెక్టులు, ఉప ప్రణాళికల అమలు పేరిట వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్నారు. అయినా నాణ్యమైన విద్యాప్రమాణాలు కొరవడడం మొత్తం గిరిజన విద్యావ్యవస్థపైనే పెను ప్రభావం చూపుతోంది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి, ప్రధాన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, యునెస్కో వంటి సంస్థల విద్యావార్షిక పర్యవేక్షణ నివేదికలు ఈ విషయాన్నే తేటతెల్లం చేస్తున్నాయి. వాటి ప్రకారం దేశంలోని 550 గ్రామీణ జిల్లాల్లో ఐదో తరగతి చదువుతున్న 93శాతం చిన్నారులు రెండో తరగతి పాఠ్యపుస్తకాలను చదవలేకపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మన దేశంలో ప్రభుత్వ విద్యావసతుల మీద ఆధారపడి చదువుతున్న వారిలో గిరిజనులు గణనీయం. గిరిజనులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన అర్ధశతాబ్ద కాలంలో గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య, కస్తూర్బా బాలికా విద్యాలయాల వంటి అనేక విధానాలను ప్రవేశపెట్టాయి. కానీ, విద్యాబోధన, వాతావరణం లేక పోవడం వల్ల ఫలితాలు నిరాశాజనకంగా ఉంటున్నాయి. స్థానికంగా అందుబాటులో ఉన్న అర్హులను ఉపాధ్యాయులుగా నియమించి, వారికి శిక్షణ ఇవ్వకపోవడం, నైపుణ్యాన్ని పెంచే కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్ల గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్యాబోధన గాలి లో దీపంగా మా రింది. గిరిజన ప్రాంతాల్లో విద్య, వారి జీవన విధానాని కి దగ్గరగా ఉండేలా చూడాలి. స్వతహాగా వారికి గల నైపుణ్యాలు క్రీడల్లో ప్రతిబింబించే ఏర్పాట్లు చేయాలి. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల నిర్వహణపై నిరం తర పర్యవేక్షణ తప్పనిసరి. మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్యా పరిస్థితులపై సమగ్ర అధ్యయనం జరగాలి.

సెల్ : 96034 71199

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

షో



ఈ సృష్టి ఎన్నో అద్భుతాలకు, వింతలు విశేషాలకు నెలవు. అలాంటి వింతలు, అద్భుతాలను వెండి తెరపై సినిమాగా తీస్తే చూసి తరించేందుకు ప్రేక్షకులు ఆతృతగా ఉంటారు. అందుకే సృష్టిలోని అద్భుతాలను సృష్టికి ప్రతిసృష్టిగా ప్రపంచ దర్శక, నిర్మాతలు ఎన్నో సైన్స్ ఫిక్షన్ చిత్రాలను వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన సైన్స్ ఫిక్షన్ చిత్రాలు ప్రపంచ ప్రేక్షకులను ఫిదా చేసి బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించాయి. ఈ ఏడాది కూడా మరిన్ని సైన్స్ ఫిక్షన్ చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. అందులోని కొన్ని సినిమాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ 'షో'..


అత్యాద్భుత సైన్స్ ఫిక్షన్ చిత్రాలు
























మేజ్ రన్నర్: ది డెత్ క్యూర్..

థామస్ తన గ్రాడర్ గ్రూపుకు లీడర్. భూమిపై జరిగే దాడిని ఎదుర్కొంటుంటారు. వీరు అత్యంత ప్రమాదకరమైన మిషన్‌ను చేపట్టాల్సి వస్తుంది. దాడి చేసే క్రమంలో అక్కడ ప్రజలందరికీ ఓ ప్రాణాంతకమైన వ్యాధి సోకుతుంది. అది అంటు వ్యాధిలా వ్యాపిస్తున్న నేపథ్యంలో దాన్ని కంట్రోల్ చేసేందుకు థామస్ బృందం చేసే పోరాటమే ఈ చిత్రం. పోరాడే క్రమంలో వాళ్లు ఎదుర్కొన్న సవాళ్ళేంటనేది సినిమాలో ఆసక్తికరం. విజువల్ వండర్‌గా నిలిచే ఈ చిత్రం ఈ నెల 26న విడుదలై ఆకట్టుకుంది. మంచి కలెక్షన్లను రాబడుతుంది. ఈ సినిమాకు వెస్ బాల్ దర్శకత్వం వహించారు. 'మేజ్ రన్నర్' ఫిల్మ్ సిరీస్‌లో భాగంగా వచ్చిన మూడవ చిత్రమిది. థామస్ పాత్రలో డైలాన్ ఓ బ్రియన్ నటన కట్టిపడేస్తుంది. ఇతర పాత్రల్లో థామస్ బ్రాడీ, ప్యాట్రిసియా క్లార్క్‌సన్, కయా స్కోడెలారియో, డెక్స్టర్ డర్డెన్, నటాలి ఎమ్మాన్యుయెల్ తదితరులు నటించి మెప్పించారు.

రెడీ ప్లేయర్ వన్

భవిష్యత్‌లో భూమిపై చోటు చేసుకునే పరిణామాలను తెలిపే చిత్రమిది. 2045లో భూమి అధిక జనాభాతో నిండిపోతుంది. దీంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం, కాలుష్యం పెరగడం, మనుషుల్లో అవినీతి ఎక్కువ కావడం జరుగుతుంది. వ్యవస్థ మొత్తం అస్తవ్యస్థంగా మారుతుంది. భూమిపై నివాసం భారంగా మారుతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా వర్చ్యుల్ రియాలిటీ టెక్నాలజీతో 'ఓహసిస్'(ఓంటోలాజికల్లీ ఆంథ్రోపోసెంట్రిక్ సెన్సారీ ఇమ్మెర్సివ్ సిమ్యులేషన్) అనే సరికొత్త ప్రపంచాన్ని తయారు చేస్తారు. జనం అంతా అందులోనే ఉండాలనుకుంటారు. అక్కడే వినోదం, ఎడ్యూకేషన్ పొందుతుంటారు. ఈ క్రమంలో ఓహసిస్‌ను తయారు చేసిన ఫౌండర్ చనిపోతాడు. దీంతో దాన్ని కంట్రోల్ చేయడమనేది కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఓహసిస్‌లోనూ జరిగే పోరాటమే ఈ చిత్రం కథాంశం. స్టీవెన్ స్పీల్‌బర్గ్ రూపొందిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. అద్భుతమైన విజువల్స్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది మార్చి 30న విడుదలకు సిద్ధమవుతుంది. ఇందులో టై షెరిడాన్, ఒలివియా కుక్, బెన్ మెండెల్సోన్, టి.జె.మిల్లర్, సిమన్ పెగ్, మార్క్ రైలాన్స్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. అద్భుత చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచే స్టీవెన్ స్పీల్‌బర్గ్ దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పసిఫిక్ రిమ్ అప్‌రైజింగ్

మానవ జాతి రక్షణ కోసం, ప్రపంచ మనుగడ కోసం ఇతర ప్రపంచానికి చెందిన రాక్షస వర్గాలకు, మానవ పైలెట్ వర్గానికి మధ్య జరిగే భీకరమైన పోరాటమే ఈ చిత్ర కథాంశం. అత్యాధునికి టెక్నాలజీ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి స్టీవెన్ ఎస్ డేని నైట్ దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడిగా ఆయనకిది తొలి చిత్రం కావడం విశేషం. అద్భుతమైన విజువల్ వండర్‌గా రూపొందిస్తున్న ఈ సినిమా మార్చి 23న విడుదల కానుంది. 2013లో వచ్చిన 'పసిఫిక్ రిమ్' చిత్రానికిది సీక్వెల్. అది సైన్స్ ఫిక్షన్ చిత్రంగా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులో జాన్ బోయేగా, స్కాట్ ఈస్ట్‌వూడ్, కైలీ స్పీనీ, చార్లీ డే, బర్న్ గోర్మన్, రింకో కికుచీ, జింగ్ తైయాన్ నటించారు.

బ్లాక్ ఫాంథర్

ఆఫ్రికాలోని వాకండా రాజ్యానికి చెందిన రాజు చనిపోవడంతో తన కుమారుడు, సూపర్‌హీరో, బ్లాక్ ఫాంథర్ అయిన టి.చల్లా తిరిగి తన రాజ్యానికి వస్తాడు. వాకండాను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు అత్యంత సాంకేతిక పరమైన సూపర్ పవర్స్ కలిగిన ఇద్దరు శత్రువులు ప్రయత్నిస్తుంటారు. వారిని ఎదిరించడమనేది బ్లాక్ ఫాంథర్ తక్షణ కర్తవ్యం. దీంతో వారికి వ్యతిరేకంగా ప్రభుత్వం సిఐఏతో కలిసి బ్లాక్ ఫాంథర్ చేసే పోరాటమనే ఈ చిత్ర కథ. ఈ సూపర్ హీరో చిత్రానికి ర్యాన్‌కూగ్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్వెల్ స్టూడియో సంస్థలో వస్తున్న 18వ చిత్రమిది. బ్లాక్ ఫాంథర్ పాత్రలో చాడ్విక్ బోస్‌మన్ నటించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదల కానుంది.

సోలో: ఏ స్టార్ వార్స్ స్టోరీ

గెలాక్సీపై డార్క్ క్రిమినల్ అండర్ వరల్డ్‌లో మంచి కోసం పోరాడే హీరో వర్గానికి చెందిన హాన్ సోలో శత్రువులతో చేసే సాహసోపేతమైన పోరాటమే ఈ సినిమా. 'స్టార్ వార్స్' ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న నూతన చిత్రమిది. ఫిల్ లార్డ్, క్రిస్టోఫర్ మిల్లెర్, రాన్ హెూవార్డ్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అల్డెన్ ఎరెన్రిచ్, వూడి హర్రెల్సన్, ఎమిలియా క్లార్క్, డోనాల్డ్ గ్లోవర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సమ్మర్ స్పెషల్‌గా మే 25న ఈ సినిమా విడుదల కానుంది. 'స్టార్ వార్స్' సిరీస్‌లో భాగంగా వస్తోన్న ఈ చిత్రంపై భారీ క్రేజ్ నెలకొంది.

ప్రిడేటర్

ఇది 1987లో వచ్చిన 'ప్రిడేటర్' చిత్రానికి సీక్వెల్. ఓ దట్టమైన అడవికి కొంత మంది సమూహంగా వెళతారు. అందులో ఒక్కొక్కరుగా మాయమవుతుంటారు. కనిపించని ఓ మృగం వారిని చంపేస్తుంటుంది. గతంలో అడివిలోకి వెళ్ళి దాన్నుంచి తప్పించుకున్న వారు ఎంతో నరకం అనుభవిస్తూ మనుగడ కోసం పోరాడుతుంటారు. ఈ నేపథ్యంలో ఆ మృగాన్ని ఎలా ఎదుర్కొన్నారనేది ఈ చిత్ర కథాంశం. ఈ చిత్రానికి షేన్ బ్లాక్ దర్శకత్వం వహిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ హర్రర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను ఆగస్ట్ 3న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బోయ్డ్ హెూల్‌బ్రూక్, ఒలివియా మున్, ట్రెవాంటే రోడ్స్, కీగన్ మైఖేల్ కీ, స్టెర్లింగ్ కె బ్రౌన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్

పరిశోధన నిమిత్తం కొంతమంది టీమ్ జురాసిక్ పార్క్‌కి వెళతారు. అక్కడ డైనోసార్స్‌తోపాటు మరికొన్ని వింత జంతువులు వీరిపై దాడికి దిగుతాయి. వాటి నుంచి తప్పించుకుని మనుగడ కోసం ఈ టీమ్ చేసే సాహసం, పోరాటమే ఈ చిత్రం. 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న ఐదవ చిత్రమిది. దీనికి జె.ఎ.బయోనా దర్శకత్వం వహిస్తున్నారు. క్రిస్ ప్రాట్, బ్రైస్ డల్లాస్ హెూవార్డ్, బి.డి.వాంగ్, జేమ్స్ క్రామ్వెల్, టెడ్ లెవిన్, జస్టిస్ స్మిత్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. 'జురాసిక్ పార్క్' చిత్రాలకు ప్రపంచ వ్యాప్తంగా విశేషమైన క్రేజ్ ఉంటుంది. దీంతో తాజా చిత్రానికి కూడా విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రం జూన్ 2 విడుదల కానుంది.

అన్నిహిలేషన్

కొంత మంది సైనిక బృందం పర్యావరణ విపత్తుకు నెలవుగా మారిన జోన్‌లోకి వెళతారు. అక్కడ నుంచి ఒక్క సైనికుడు మాత్రమే ప్రాణాలతో బయటకు వస్తాడు. అది కూడా తీవ్ర గాయాలతో. దీంతో ఆ ప్రదేశంలో ఏం జరిగిందనేది తెలుసుకోవడానికి అతని భార్య కొంత మందితో ఆ ప్రాంతానికి వెళ్తుంది. ఆమె బయోలాజిస్ట్. మరి అక్కడ తను ఏం తెలుసుకుంది. అక్కడి భయానక మృగాలు, వింత శక్తులను ఎలా ఎదుర్కొందనేది సినిమా కథ. ఈ సైన్స్ ఫాంటసీ యాక్షన్ హర్రర్ చిత్రాన్ని దర్శకుడు అలెక్స్ గార్లాండ్ రూపొందిస్తున్నారు. బయోలాజిస్ట్ పాత్రలో నటాలియా పోర్ట్‌మన్, ఆమె భర్త పాత్రలో ఆస్కార్ ఇసాక్, ఇతర పాత్రల్లో జెన్నిఫర్ జాసన్ లెహ్, గినా రోడ్రిగ్విజ్, టెస్సా థాప్సన్ నటిస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 23న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తుంది.

ది మెగ్..


పరిశోధన నిమిత్తం మాజీ నావికదళ కెప్టెన్, ఎంతో నైపుణ్యం కలిగిన షిప్ డ్రైవర్ జానస్ టైలర్ సముద్ర లోతులోకి వెళ్ళి రిస్క్యూ మిషన్ చేపడతారు. ఈ క్రమంలో దాదాపు 70 అడుగుల పొడవైన షార్క్ ఫిష్ షిప్‌పై దాడి చేస్తుంది. ఆ దాడి నుంచి తప్పించుకుని వెళ్తున్న వీరికి ఎదురైన సంఘటనలేంటి. మనుగడ కోసం ఎలాంటి పోరాటం చేశారనేది చిత్ర కథ. ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ హర్రర్ చిత్రానికి జోన్ టర్ట్లెల్టాబ్ దర్శకత్వం వహిస్తున్నారు. టైలర్ పాత్రలో జాసన్ స్టాథమ్, ఇతర పాత్రల్లో జెస్సికా మెక్ నామీ, లి బింగ్‌బింగ్ నటిస్తున్నారు. 1997లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ బుక్ 'మెగ్: ఏ నావెల్ ఆఫ్ దీప్ టెర్రర్' ఆధారంగా సినిమాను రూపొందిస్తున్నారు. ఆగస్ట్ 10న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

అలిటా: బ్యాటిల్ ఏంజెల్

ఈ ప్రపంచాన్ని మార్చడానికి ఓ మహిళ చేసే పోరాటమే ఈ చిత్రం. ఈ క్రమంలో ఆ మహిళా జర్నీ, తానెవరు, తనకున్న శక్తి ఏంటి, అదే సమయంలో తనకు సంబంధించిన సరికొత్త నిజాలను తెలుసుకోవడమే ఈ చిత్ర కథాంశం. మహిళా శక్తిని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సత్తాను చాటేలా సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి రాబర్ట్ రోడ్రిగ్విజ్ దర్శకత్వం వహిస్తుండగా జేమ్స్ కామెరూన్ నిర్మిస్తుండటం విశేషం. రోసా సాలజార్, క్రిస్టోఫ్ వాల్ట్, జెన్నిఫర్ కోన్నెలీ, మహర్షలా అలీ, ఎడ్ స్క్రీయిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జులై 20న విడుదల కానుందీ చిత్రం.

ది డార్కెస్ట్ మైండ్స్..


ఓ విచిత్రమైన వ్యాధి వల్ల దాదాపు 98శాతం పిల్లలు చనిపోతుంటారు. కేవలం 2శాతం మాత్రమే మనుగడ సాధించగలుగుతుంటారు. ఆ పిల్లలకు సూపర్ పవర్స్‌ను ఇవ్వాలనుకుంటారు. 16ఏండ్ల టీనేజ్ అమ్మాయి రూబీ ఆ పిల్లల క్యాంప్‌లో నుంచి తప్పించుకుని ప్రభుత్వంచే రన్ అవుతున్న మరో గ్రూపులో చేరుతుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది చిత్ర కథాంశం. ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రానికి జెన్నిఫర్ యుహ్ నెల్సన్ దర్శకత్వం వహిస్తున్నారు. రూబీ పాత్రలో అమండ్లా స్టెన్‌బర్గ్ నటిస్తుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 14న విడుదల కానుంది.





















కొలిక్కి రాని విభజ5

ఏపీ రీ ఆర్గనైజేషన్ చట్టంపై కేంద్రం నిర్లక్ష్యం

- నాలుగేండ్లు అవుతున్నా విభజ5కు నోచుకోని 9,10వ షెడ్యూల్
- అయోమయంలో కీలక శాఖలు


ఫైల్

5వతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర విభజన జరిగి నాలుగేండ్లు అవుతున్నది. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగబోతున్నాయి. కాని "ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ 2014" చట్టంలోని పలు సెక్షన్లకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌ను విభజించడమే కాకుండా రెండు రాష్ట్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా నేటికి విభజన సమస్యలను పరిష్కరించడం లేదు.

విభజ5కు నోచుకోని 9,10 షెడ్యూల్

ఏపీ రీ ఆర్గనైజేషన్‌లోని 9, 10 షెడ్యూల్ రెండు రాష్ట్రాలకు ఎంతో కీలకమైనవి. తొమ్మిదోవ షెడ్యూల్లో 84 కార్పొరేషన్‌లు, పదో షెడ్యూల్‌ల్లో 107 సంస్థలు ఉన్నాయి. తొమ్మిదో షెడ్యూల్‌లోని కార్పొరేషన్‌లను సెక్షన్ 68, 71, 10వ షెడ్యూల్‌ల్లోని సెక్షన్ 75 ప్రకారం ఇందులో ఉన్న కార్పొరేషన్‌లు, సంస్థలను ఏడాది లోపు విభజించాలని చట్టంలో పొందుపర్చింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనీ (డీఓపీటీ)కి బాధ్యతలు అప్పగించింది. సంస్థలు, కార్పొరేషన్‌ల విభజన కోసం 2014లోనే షీలాబిడే కమిటీని నియమించింది. కానీ కమిటీ కాలపరిమితి ముగిసినా సంస్థలు, కార్పొరేషన్‌ల విభజన జరగపోవడంతో కమిటీ కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడగించినా విభజన సమస్యలకు పరిష్కారం చూపలేకపోయింది. దాంతో 2016లో కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సంజయ్ కొటారీ కమిటీని నియమించింది. ఈ కమిటీ పలుమార్లు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశమైంది. 2017 ఫిబ్రవరి నాటికి విభజన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపింది. కాని ఇప్పటి వరకు విభజన అంశాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉండటంతో కమిటీ కాలపరిమితిని మరో ఆరు నెలల పాటు కేంద్రం పొడగించింది. ఏ రాష్ట్రంలో ఉన్న ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందాలని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తుంటే.. చట్టంలో పొందుపర్చినట్టుగా 58: 42 నిష్పత్తి ప్రకారం సంస్థలు, కార్పొరేషన్లను విభజించాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతున్నది. దీనివల్లనే విభజనలో జాప్యం జరుగుతున్నదని డీఓపీటీ అధికారులు కేంద్రానికి నివేదించినట్టు తెలిసింది. ప్రస్తుతం రెండు రాష్ట్రాలు మాత్రం పరస్పర అంగీకారంతో సంస్థలను విభజించుకున్నప్పటికీ వీటికి మాత్రం కేంద్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

10వ షెడ్యూల్ రూ.70వేల కోట్ల ఆస్తులు

విభజన అంశాలు కొలిక్కి వచ్చాయని, కీలక శాఖల్లో ఇప్పటికే విభజన పూర్తయిందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏ శాఖలను విభజించారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా 10వ షెడ్యూల్‌ల్లో వివిధ సంస్థలకు చెందిన సుమారు రూ.70వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. వీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జనాభా ప్రకారం 58, 42 నిష్పత్తి ప్రకారం విభజించాలని విభజన చట్టం సెక్షన్ 75లో పొందుపర్చారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏ రాష్ట్రంలో ఉన్న ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందాలని టీఎస్ సర్కార్ కోర్టుకు తెలిపింది. దీంతో 10వ షెడ్యూల్‌లోని విభజన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర కమిటీలు ఎటూ తేల్చలేకపోతున్నాయి. ఈ విషయంలో కేంద్రమే జోక్యం చేసుకోవాలని డీఓపీటీ అధికారులు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖకు సూచించినా కేంద్ర ప్రభుత్వం మాత్రం విభజన అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదంటూ రెండు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం.

9వ షెడ్యూల్‌లో రూ.19,600 కోట్ల 5గదు

2014 జూన్ 2 వరకు 9వ షెడ్యూల్లో ఉన్న సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల్లోని వివిధ బ్యాంకుల్లో రూ.19,600 కోట్ల నగదు ఉంది. ఇందులో ఏపీలో ఉన్న బ్యాంకుల్లో రూ.16వేల కోట్లు, తెలంగాణలో ఉన్న బ్యాంకుల్లో రూ.3600 కోట్లు ఉన్నాయి. 9వ షెడ్యూల్, సెక్షన్ 68,71 ప్రకారం రెండు రాష్ట్రాలకు 58:42 నిష్పత్తి ప్రకారం నిధుల పంపకాలు చేపట్టాలిసి ఉంది. ఇందులో నుంచి ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా రూ.16వేల కోట్లను బ్యాంకుల నుంచి డ్రా చేసుకుంది. దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దీనిపై కేంద్రం ఇప్పటి వరకు స్పందించలేదు .

నిలిచిన ప్రమోషన్లు

9, 10వ షెడ్యూల్‌ల్లోని కార్పొరేషన్లు, సంస్థల విభజన పూర్తికాకపోవడంతో అందులో పని చేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్లు నిలిచిపోయాయి. రెండు రాష్ట్రాలు పరస్పర అవగాహనకు వచ్చి సంస్థలు, కార్పొరేషన్లను విభజించు కున్నా అది చట్టపరంగా చెల్లవని కొందరు ఉద్యోగులు తెలిపారు. అత్యంత కీలక శాఖలైన పోలీస్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, విద్య లాంటి సంస్థలను కూడా విభజించక పోవడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోవలిసి వస్తుందని ఆయా సంస్థల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కేంద్రం జోక్యం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని రెండు రాష్ట్రాలకు చెందిన సమస్యలను పరిష్కరించాలిసి ఉంది. లేని పక్షంలో కమిటీ పనితీరును వేగవంతం చేసి రిపోర్ట్‌ను తెప్పించుకొని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. కేంద్రం జోక్యం చేసుకోకుంటే మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని రెండు రాష్ట్రాల అధికారులు అభిప్రాయపడ్డారు.



'పది'కి పకడ్బందీ!

- 2500 సెంటర్లలలో టెన్త్ పరీక్షలు
- 405 పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా
- సిట్టింగ్ స్క్వాడ్స్‌గా రెవె5్యూ అధికారులు!

5వతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ ఏడాది ఐదున్నర లక్షలకుపైగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, వారికోసం 2500లకు పైగా పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసింది. మాస్‌కాపీయింగ్ నిరోధానికి, న్యాయస్థాన ఆదేశాలతో 405 పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నది. వీటికితోడు పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. పరీక్షా కేంద్రాల్లో రెవెన్యూ అధికారులను సిట్టింగ్ స్క్వాడ్స్‌గా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

మార్చి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు తెలంగాణలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 11,109 పాఠశాలలకు చెందిన 5,60,395 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 5,04,545 మంది, వన్‌టైం ఫెయిల్ విద్యార్థులు 35,864 మంది, ఓకేషనల్ విద్యార్థులు 19,986 మంది ఉన్నారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సగానికి పైగా సర్కారీ విద్యాసంస్థలు కావడం గమనార్హం. అత్యధికంగా హైదరాబాద్‌లో 356 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, రంగారెడ్డిలో 190 కేంద్రాలు, మేడ్చల్ జిల్లాలో 186 కేంద్రాలున్నాయి. తక్కువగా జోగులాంబ గద్వాల్‌లో 34, వనపర్తిలో 35, రాజన్న సిరిసిల్లాలో 36 కేంద్రాలున్నాయి. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఈ విద్యాసంవత్సరం ఎక్కువ వసతులున్న పాఠశాలలనే డీఈఓలు పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ప్రధానంగా ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర వాటిపై దృష్టిసారించారు. ఎక్కువ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రహరీగోడలు పూర్తిస్థాయిలో లేవు. సగం వరకూ గోడులున్నా, గేట్లు లేకపోయినా, గోడ కొంత కూలిపోయినా వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని టీఎస్ఈడబ్ల్యుఐడీసీ ఎండీకి..పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ ఇప్పటికే లేఖ రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రహరీలు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. కాగా సెంటర్లలో సరిపడ ఫర్నిచర్ లేకపోతే పక్కన ఉన్న బడులను నుంచి తెచ్చి, పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

405 సెంటర్లలో సీసీకెమెరాలు..

టెన్త్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్, అవకతవకల నివారణపై అధికారులు దృష్టిసారించారు. ఈ విద్యాసంవత్సరం 405 పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. టెన్త్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరుగుతుందనీ, దీన్ని నివారించాలని మూడేండ్ల క్రితం ఒకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం తొలిసారిగా 2015–16 విద్యాసంవత్సరంలో ప్రయోగాత్మకంగా జిల్లాకు ఒకటి, రెండు చొప్పున 15కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే అప్పట్లో ఈ కేంద్రాల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదు కావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. 2016–17 విద్యాసంవత్సరంలో 330కి పైగా పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ యోచించినా, నిధుల లేమితో వెనక్కి తగ్గింది. అయితే ప్రస్తుతం సీసీకెమెరాలు ఏర్పాటు చేసిన వాటిలో ఎక్కువగా మోడల్‌స్కూల్స్, గురుకులాలే ఉండటం గమనార్హం. సీసీకెమెరాల నిఘాను వచ్చే ఏడాది మరింత పెంచేందుకు ఇప్పటి నుంచే అధికారులు కసరత్తు ప్రారంభించనున్నారు. 2017 మార్చి, జూన్‌లో జరిగిన వార్షిక పరీక్షల సందర్భంగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలు, ఈ విద్యాసంవత్సరం అధికారులు గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మార్చిలో జరిగే పరీక్షలకు సిట్టింగ్ స్క్వాడ్స్‌గా రెవెన్యూ అధికారులను నియమించేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. కాగా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు సుధాకర్ 'నవతెలంగాణ'తో చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రధాని టూర్లలో ఎవరెవరు?

(మొదటిపేజీ తరువాయి)

భద్రతా వివరాలతో సంబంధం ఉన్న వారి పేర్లను ఆయన మినహాయించారు. ప్రధాని అంతర్జాతీయ పర్యటనల్లో ఆయనతో పాల్గొన్న వ్యాపార సంస్థల సీఈవోలు, యాజమానులు, వ్యాపార వేత్తల పేర్లు వెల్లడించాలని నీరజ్ శర్మ అనే వ్యక్తి గతేడాదిలో ఆర్టీఐను కోరారు. అలాగే ప్రధాన మంత్రి నివాసానికి, కార్యాలయానికి, సమావేశాలకు నెలవారి అయ్యే ఖర్చు, ప్రజలతో ఆయన నిర్వహించిన మొత్తం సమావేశాలు, ఎన్నికల బహిరంగ సమావేశాలకు సంబంధించిన వివరాలు అలాగే వాటి పై ప్రభుత్వం చేసిన ఖర్చును తెలియజేయాలని అయూబ్ అలీ అనే వ్యక్తి 2016లో పీఎంవోను కోరాడు. అయితే సమాచారాన్ని 30రోజుల్లో సమర్పించాలని పీఎంవోను సీఐసీ ఆదేశించింది. ప్రధాని పర్యటనలు, ఖర్చులకు సంబంధించిన సమాచారం వెబ్‌సైట్లో లభిస్తుందని పీఎంవో తెలిపింది. వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదుదారులు సంబధిత సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆర్‌కె మాథుర్ పేర్కొన్నారు. ప్రధాని నిర్వహించిన ఎన్నికల సమావేశాల వివరాలు తమ దగ్గర లేవని పీఎంవో అధికారి తెలిపారు.

పోలియో విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

పాటు బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వినోద కేంద్రాలు, జన సంచారం అత్యధికంగా ఉండే ప్రదేశాల్లో ప్రభుత్వం శిబిరాల్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 22,768 కేంద్రాలను ఏర్పాటు చేయగా... 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్దేశించారు. ప్రతి కేంద్రంలోనూ నలుగురు సిబ్బందిని నియమించారు. పోలియో తీసుకోని చిన్నారులకు 29, 30, 31 తేదీల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి చుక్కలు వేస్తారని ఇమ్యూనైజేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఫీల్డ్ సిబ్బందిని నియమించామన్నారు. వీరంతా నేరుగా ఇంటికే వచ్చి వ్యాక్సిన్‌ను వేస్తారని.. మార్చి 11 నుంచి 14 వరకు రెండో విడత కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

అలా చేయకూడదు

5్యూఢిల్లీ : విడాకులు పొందిన తర్వాత భార్యగానీ, భర్తగానీ తమ ఫొటోలను, వీడియోలను ఇంటర్నెట్‌లో, సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయకూడదు, ఎక్కడా ఎవరితోనూ వాటిని వాడరాదు అంటూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం తాజాగా తీర్పు వెలువరించింది. మహారాష్ట్రకు చెందిన ఓ జంటకు విడాకులు మంజూరుచేస్తూ సుప్రీం పై తీర్పు చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరిస్తూ, మహారాష్ట్రకు చెందిన భార్యభర్తకు విడాకులు మంజూరుచేసింది. రెండు నెలల్లోగా భార్యకు శాశ్వత భరణం కింద రూ.37 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది.

భార్యగానీ, భర్తగానీ ఇకపై తమ ఫొటోలను ఎక్కడా, ఏ విధంగానూ ఉపయోగించరాదని, ఇంటర్నెట్, సామాజికమాధ్యమంలో పోస్ట్ చేయరాదని అంటూ ఆదేశాలు జారీచేసింది. విడాకుల పిటీషన్లో ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణల విషయంలో నేర అభియోగాల్ని నమోదుచేయటం కుదరదంటూ ధర్మాసనం పేర్కొన్నది. ఆస్తి, ఇతర తగాదాలకు కూడా ఇదే వర్తిస్తుందని కోర్టు పేర్కొన్నది. అలాగే ఒకసారి విడాకులు మంజూరయ్యాక, కేసుకు సంబంధించి ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణల్ని కూడా రికార్డుల నుంచి తొలగిస్తామని ధర్మాసనం తెలియజేసింది.

వ్యక్తి పూజ తగదు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చానన్నారు. మాజీ న్యాయమూర్తి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రేశ్వరరావు, పి.బి.సిద్ధార్థాలా కాలేజ్ ప్రిన్సిపల్ దివాకర్, అధిక సంఖ్యలో న్యాయవాదులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం దారుణం

5వతెలంగాణ–అచ్చంపేట/ఉప్పు5ంతల

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తి కోసం తండ్రి, ఇద్దరు తమ్ముళ్లను అన్న దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు హత్యగావించడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అచ్చంపేట సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...

ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సామ భాస్కరయ్య(60) భూలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. పదేండ్ల కిందట భూలక్ష్మమ్మ భర్త భాస్కరయ్య, కుమారులను వదిలేసి కల్వకుర్తి సమీపంలోని అన్నారంలో నివాసం ఉంటోంది. అప్పటి నుండి ముగ్గురు కుమారులను తండ్రే పోషిస్తున్నాడు. భాస్కరయ్య పేరు మీద గ్రామ శివారులో నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి పంచాలని పెద్ద కుమారుడు మల్లేశ్ తరచూ ఇంట్లో ఘర్షణ పడుతుం దేవాడు. శనివారం రాత్రి తమ్ముళ్లైన శ్రీశైలం(20), రామస్వామి(15) వేరు శెనగ పంట వద్దకు కాపాలాగా వెళ్లి ఒక్కొక్కరు ఒక్కోచోట నిద్రపోయారు. గమనించిన మల్లేష్ పొలం వద్దకు వెళ్లి నిద్రిస్తున్న తమ్ముళ్లను బండరాళ్లతో మోది హత్య చేశాడు. తర్వాత ఇంటికి వెళ్లి 'పొలం వద్దకు బోరు బండి వచ్చింది.. వెంటనే రావాలి' అంటూ తండ్రి భాస్కరయ్యనూ తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత తండ్రిపైనా బండరాయితో దాడి చేసి చంపేశాడు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు మల్లేష్‌పై అనుమానం పెంచుకుని అదే మండలం తెలకపల్లిలో తిరుగుతున్న అతన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అచ్చంపేట సీఐ రామకృష్ణ, బల్మూర్ ఎస్సై వెంకన్న, లింగాల ఎస్సై విష్ణు తెలిపారు.

తలుచుకుంటే..చంపేస్తా !

నవతెలంగాణ–మహబూబ్5గర్‌ప్రతినిధి

"వెయ్యి శాతం నేనే లీడర్ని. గెలవనంటే తోలు తీస్తా. రాములు కాదు ఆయన తాతొచ్చినా నేనే లీడర్ని. నా కాడ ఉండి నాకే టికెట్ రాదంటవా సాలే. నీకెన్ని గుండెలు రా? నేను తలుచుకుంటే నిన్ను చంపేస్తా. గువ్వల దగ్గర నీవెంత? నీ శక్తెంత? ఎదురు మాట్లాడితే టార్గెట్ చేస్తా. ఈ పార్టీలో ఉండాలంటే... నా దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడాలి. లేకుంటే తొక్కుతా..నరుకుతా...ఈలోకంలో లేకుండా చేస్తా' అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఓ కార్యకర్తను బెదిరించిన ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. అధికార పార్టీలో గ్రూపు తగాదాలు బెదిరించేస్థాయికి పెరిగాయనటానికి ఈ ఘటనే నిదర్శనం.

ఎమ్మెల్యే నడవడిక నచ్చని కార్యకర్తలు ఆయన ఎదుటే ' ఇలాగైతే నీ ఆధ్వర్యంలో పనిచేయలేం' అని చెబుతున్న వారిపై ఎమ్మెల్యే గువ్వల బెదిరింపులకు దిగుతున్నాడు. అమ్రాబాద్ ప్రాంతానికి చెందిన జాకీర్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశాడు. ఎన్నికల్లో గువ్వల గెలవడానికి శాయశక్తులా సహకరించాడు. ఆ తర్వాత కూడా ఎమ్మెల్యే వెంటనే ఉన్నాడు. గువ్వల తీరు నచ్చక కొంతకాలంగా ఆయనకు దూరంగా ఉంటున్నాడు. ఇదే క్రమంలో.టీడీపీ హయాంలో మంత్రిగా చేసిన రాములు టీఆర్ఎస్‌లో చేరాడు. జాకీర్ టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాములు గ్రూపులోకి వెళ్లాడు. 'గువ్వల బాల్‌రాజు పని బాగాలేదు. ఈసారి రాములుకే టికెట్ వస్తుంది' అని కార్యకర్తలతో చెప్పాడు. అది జీర్ణించుకోలేని గువ్వల అమ్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి జాకీర్‌ను పిలిపించి మరీ చంపేస్తానని బెదిరించాడు. 'ఎమ్మెల్యే టికెట్ రాములుకు ఇప్పిస్తావా?అంత దమ్ముందా?ఉల్టా ప్రచారం చేస్తావా? నీవు కాదు మీ తాతొచ్చినా నాకు పోటీ కాదు. పార్టీలో ఉంటే ఉండు లేకుంటే నీదారి నీవు చూసుకో. నేను గెలవను అనే దమ్ము నీకెవరిచ్చారు. ఆలా మాట్లాడితే... నీతోలు తీస్తా. అవులే నీకు ఎంత సహాయం చేశా. నాకు అడ్డువస్తే. తొక్కేస్తా. తోపువా? చంపుత బిడ్డా. మాటి మాటికి రాజీనామా చేస్తానంటున్నావ్. చేస్తే... ఏమయితది? నన్ను కాదని టీఆర్ఎస్‌లో ఉండలేవు. ఇతర పార్టీలోకి వెళ్తే ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండు. లేకుంటే నిన్ను లేపేస్తా. అయినా గెలవడానికి రాములెవడు? ' అంటూ ఎమ్మెల్యే బాల్‌రాజు జాకీర్‌ను తీవ్రస్థాయిలో బెదిరించాడు. 'ఎమ్మెల్యే స్థానిక సమస్యల గురించి ఎన్నడూ అసెంబ్లీలో మాట్లాడలేదు. ఆయన పనితీరు కూడా బాగాలేదు. తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశాం. ఇప్పుడు అధికారం రాగానే కార్యకర్తలను పట్టించుకోవట్లేదు. ఆత్మగౌరవం చంపుకుని ఉండలేకపోతున్నం. అందుకే ఎమ్మెల్యే టిక్కెట్ రాదని చెప్పా. కార్యకర్తల సమావేశంలోనే గువ్వల నన్ను చంపుతా అని బెదిరించాడు' అని జాకీర్ 'నవతెలంగాణ'తో వాపోయాడు. ఈ విషయమై ఎమ్మెల్యేతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు. గతంలోనూ గువ్వల బాలరాజు పలుమార్లు దురుసుగా ప్రవర్తించారు. వంగూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన వికలాంగుడు వచ్చి 'నాకు ఫించను ఇప్పించాలి' అని వేడుకున్నాడు. 'ఇంతమందిలో ఫించన్‌రాలేదని ఫిర్యాదు చేస్తావా?' అంటూ అతనిపై దాడిచేశాడు. లింగాల మండలానికి చెందిన ఎంపీపీ మంజుల భర్త మీద కొందరు టీఆర్ఎస్ నాయకులు దాడి చేసి గాయపరచడంతో ఆయన ఆస్పత్రి పాలయ్యాడు. ఈ దాడిపై గువ్వల కనీసం స్పందించలేదు. కార్యకర్తలె వ్వరినీ ఆయన దరిచేరనివ్వడనే ప్రచారముంది.

గులాబీ' దళం గ్రూపులమయం...

కల్వకుర్తిలో అధికార పార్టీలోనే బీసీ, రెడ్డి సామాజిక తరగతుల మధ్య విబేధాలు భగ్గుమంటున్నాయి. గతంలో ఓ అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు పొడచూపాయి. 'సొంత ఖర్చులతో బుద్ధవిగ్రహాన్ని పెట్టా' అని ఓ మంత్రి అనగా...'కాదు నిధులన్నీ ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేశారు' అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. వారం కింద బీసీలకు సమ వాటా రావట్లేదని, సీఎం పక్కన ఎక్కువ శాతం తెలంగాణ ద్రోహులే ఉన్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వాపోయిన విషయం విదితమే. గద్వాల, నారా యణపేట, జడ్చర్ల, ఇలా అనేక చోట్ల సొంతపార్టీలోనే గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ప్రధానంగా జిల్లా నుంచి మంత్రులుగా ఉన్న లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు మధ్య కూడా సఖ్యత లేదని ఆ పార్టీ కార్యక్తలే చర్చించుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రూపు రాజకీయాలు ముదిరి అసలుకే ఎసరు వస్తోందని అధికార పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

సహ5ం కోల్పోయేలా చేసి5ందుకే.. : ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు

సహనం కోల్పోయే విధంగా వ్యవహరించి నందుకే అసభ్యపదజాలం వాడా. ఎవరూ లేకుండా మాట్లాడుకోవడానికి మేం ప్రేమికుల కాదు. అందుకే కార్యకర్తల మధ్యకు పిలిచి నాకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగా. నాకు సీటు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నందుకే కార్యకర్తలైన అశోక్, జాకీర్‌ను మందలించా. ఒక్కోసారి ఉద్వేగం ఎవరికైనా సహజమే కదా.

జూన్ 10న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

- మే 20 ఆన్‌లైన్‌లో రాతపరీక్ష
- 161 పట్టణాల్లో నిర్వహణ
- తెలంగాణలో ఆరు, ఏపీలో 10
- మే 2 5ుంచి 7 వరకు దరఖాస్తుకు అవకాశం

5వతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)–2018 అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష ఆన్‌లైన్‌లో మే 20న దేశవ్యాప్తంగా జరగనుంది. జూన్ 10 జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల చేయనున్నట్టు ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. జేఈఈ మెయిన్స్ రాతపరీక్ష ఆఫ్‌లైన్‌లో ఏప్రిల్ 8న, ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15,16 తేదీల్లో జరగనున్న విషయం తెలిసిందే. జేఈఈ మెయిన్స్ రాసిన అభ్యర్థుల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 2,24,000 మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలను ఏప్రిల్ 30 ప్రకటిస్తారు. మే 31న జేఈఈ మెయిన్స్ అఖిల భారత ర్యాంకులను విడుదల చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు మే 2 నుంచి 7వ తేదీ వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు అవకాశముంటుంది. దరఖాస్తు చేసిన అభ్యర్థులు మే 8వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువుంది. మే 14 నుంచి 20వ తేదీ వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంది. మే 29న జవాబు కీని ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

దేశవ్యాప్తంగా 161 పట్టణాల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష జరగనుంది. తెలంగాణలో ఆరు, ఆంధ్రప్రదేశ్‌లో పది పట్టణాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూల్, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ పట్టణాలున్నాయి. అభ్యర్థులు తప్పనిసరిగా పరీక్ష రాసేందుకు ఐదు పట్టణాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు రిజర్వేషన్ల వారీగా ఎంపిక చేసే అభ్యర్థుల వివరాలు

కేటగిరీ	సంఖ్య	మొత్తం
ఓపెన్	1,07,464	1,13,120
ఓపెన్-పీడబ్ల్యూడీ	5,656	
ఓబీసీ ఎన్‌సీఎల్	57,456	60,480
ఓబీసీ ఎన్‌సీఎల్- పీడబ్ల్యూడీ	3,024	
ఎస్సీ	31,920	33,600
ఎస్సీ-పీడబ్ల్యూడీ	1,680	
ఎస్టీ	15,960	16,800
ఎస్టీ-పీడబ్ల్యూడీ	840	
	2,24,000	2,24,000

పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ (పీడబ్ల్యూడీ)

నగదు బదిలీ..!

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దేశంలో ప్రయివేటు విద్యుత్ సంస్థల్ని అవసరానికి మించి అనుమతులు ఇచ్చి ప్రోత్సహించిన విషయం తెలిసిందే. ఆ సంస్థలు విద్యుత్ ఉత్పత్తి చేయకున్నా ఫిక్సెడ్ ఛార్జీల పేరుతో వాటిని పోషించేలా కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో టీఎస్‌జెన్‌కో 2017–18లో ఈ తరహా ఫిక్సెడ్ ఛార్జీలను రూ.13,897.80 కోట్లు చెల్లించింది. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ప్రయివేటు, ఇండిపెండెంట్ పవర్ ప్రాజెక్టులు (ఐపీపీ) కూడా ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి ఒక్క తెలంగాణ ప్రభుత్వమే పై మొత్తాన్ని ఫిక్సెడ్ చార్జీలుగా చెల్లిస్తోంది. ఇదే తరహాలో దేశంలోని అన్ని ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలు ఫిక్సెడ్ ఛార్జీలను చెల్లిస్తున్నాయి. కేంద్ర విద్యుత్ చట్టం 2003 జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. అప్పట్లోనే ఈ తరహా క్లాజుల్ని చేర్చినప్పుడు దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యుత్ సంస్థల ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. దీంతో అప్పటికి కొన్ని క్లాజుల్ని తొలగించి, చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే దశలవారీగా 2003 విద్యుత్‌చట్టాన్ని కేంద్రప్రభుత్వం సవరణల పేరుతో మార్పులు చేస్తూ వస్తోంది. 2004 జనవరి 27న ఈ చట్టానికి కొన్ని సవరణలు చేసింది. తిరిగి 2007 జూన్ 15న మరికొన్ని సవరణల్ని చేశారు. 2010 మార్చి 3వతేదీ విద్యుత్ సంస్థల్ని 'సెజ్'ల పరిధిలోకి తెస్తూ మరోసారి సవరణ చేశారు. ఆ తర్వాత 2014 డిసెంబర్ 19న మరికొన్ని సవరణలతో అప్పటి యూపీఏ ప్రభుత్వం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సవరణలపై మళ్లీ వ్యతిరేకత రావడంతో కొన్ని క్లాజులు తొలగించి, సవరణ బిల్లును అమల్లోకి తెచ్చారు.

తాజాగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గతంలో తొలగించిన క్లాజులన్నింటినీ అమల్లోకి తెచ్చేలా సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అలాగే డిస్కంలు తమ రాష్ట్ర అవసరాల మేరకు ముందస్తు అనుమతి లేకుండా అకస్మాత్తుగా విద్యుత్‌ను వద్దని చెప్తే విధించే జరిమానాను భారీగా పెంచేలా ప్రస్తుత సవరణ బిల్లులో పొందుపర్చారు.

భగ్గుమ5్న ఉద్యోగులు

కేంద్రప్రభుత్వం 2017 విద్యుత్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడ్తే...ఘాటైన సమాధానం చెప్తామని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సీసీఓఇఇ), అఖిలభారత పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ హెచ్చరించాయి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేటీకరిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దేశంలోని 25 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు సమ్మెలోకి వెళ్తారని ఎన్‌సీసీఓఇఇ కో–కన్వీనర్ శైలేంద్రదూబే మధురలో హెచ్చరించారు. ప్రస్తుత విద్యుత్ చట్టాన్నే దేశప్రజలు, విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే సవరణల పేరుతో ఇంధనరంగాన్ని కార్పొరేట్ ఆదాయ మార్గంగా మార్చుకోవడాన్ని చూస్తూ సహించేది లేదని తేల్చిచెప్పారు. కేంద్రప్రభుత్వం ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయోగాత్మకంగా తెలంగాణలో అమలు!

ఇప్పటి వరకు దేశంలోని పలు రాష్ట్రాలు విద్యుత్ చార్జీల్లో వివిధ కేటగిరి వినియోగదారులకు సబ్సిడీలు ఇస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలో వంద యూనిట్లలోపు గృహ వినియోగదారులతో పాటు వ్యవసాయానికి పూర్తి ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. పౌల్ట్రీఫారాలు, నర్సరీలు వంటి వివిధ వ్యాపారాలకు కూడా ప్రభుత్వం రాయితీతో కూడిన విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఎకరాకు రూ.4వేలు పెట్టుబడిని ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని తమ సంస్కరణలకు అనుకూలంగా మార్చుకొనేందుకు కేంద్రప్రభుత్వం చొరవ చూపుతోంది. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వంతో అనధికార సంప్రదింపులు జరిగినట్టు సమాచారం. రైతులకు ఎకరాకు రూ.4వేలు ఇవ్వడంతో పాటు వారికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించిన సొమ్మును కూడా నేరుగా వారి ఖాతాల్లోకే జమచేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం రాష్ట్రంవద్ద ప్రస్తావించినట్టు తెలిసింది. రైతులపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా డిస్కంలే స్వంత ఖర్చుతో అన్ని కనెక్షన్లకు ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసి, సబ్సిడీ సొమ్మును అతని ఖాతాలో జమ చేస్తారు. ఈ సొమ్ముతో అతను విద్యుత్ మీటర్‌ను రీఛార్జీ చేసుకోవాల్సి ఉంటుంది. సొమ్మును ముందుగానే రైతు ఖాతాలో వేస్తే, వారి నుంచి పెద్దగా వ్యతిరేకత రాదనేది ప్రభుత్వ ఉద్దేశ్యంగా ఉన్నట్టు సమచారం. రాష్ట్రప్రభుత్వం విద్యుత్ టారిఫ్‌లో సబ్సిడీగా దాదాపు రూ.4,850 కోట్లను డిస్కంలు, ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. ఈ సొమ్మును నేరుగా ఆయా కేటగిరి వినియోగదారులకే చెల్లించడం వల్ల విద్యుత్ దుబారాను అరికట్టడంతో పాటు ప్రతి యూనిట్‌కు పక్కా లెక్క తేలుతుందనేది ప్రభుత్వం చెప్తున్న కారణం. దీన్ని దశలవారీగా అమలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

ప్రస్తుత 2017 విద్యుత్ సవరణ బిల్లు చట్టసభల ఆమోదం పొందితే 2019 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తామని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఇది క్రమంగా నగదు బదిలీ విధానం ద్వారా సబ్సిడీలను నీరుగారుస్తూ, ప్రజలపై భారాల్ని మోపేందుకేనని విశ్లేషకుల అంచనా.

సెన్సెక్స్ ▼111	నిఫ్టీ ▼16	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
36,050	11,069	63.54	రూ. 31,304	రూ. 42,200





శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగింపు సమయానికి

కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



'స్మార్ట్'గా మింగేస్తుందా?

టెలికాం రంగంలో ప్రత్యర్థి కంపెనీలకు చుక్కలు చూపించి, సదరు రంగంలో పనిచేసే సగటు ఉద్యోగి కొలువుకు సైతం ఎసరు పెట్టి, డీటీహెచ్ ప్రొవైడర్లు మొదలు.. కిరాణా సరకుల రంగం వరకు అన్నింట్లో తానే అవుతూ.. ఏకచత్రాదిపత్యం దిశగా అడుగులు వేస్తోన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ముఖేష్ అంబానీకి చెందిన జియో సంస్థ ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీల్లో సైతం కొత్త భయాల్ని రేపుతోంది. ఆ నేపథ్యంపై 'నవ తెలంగాణ' స్పెషల్ స్టోరీ..



'స్మార్ట్ ఫోన్ మార్కెట్' జియో దెబ్బకు కుదేలు

- గత ఏడాదితో పోలిస్తే, ఈఏడాది మూడుశాతం తగ్గిన దేశీయ స్మార్ట్ ఫోన్ అమ్మకాలు
- ఫీచర్ ఫోన్ విపణిలో.. 27 శాతం వాటా జియో ఫీచర్ ఫోన్‌దే!
- టెలికాం రంగంలో జియోప్రకంపనలు..
- తర్వాతి చూపు స్మార్ట్ ఫోన్ మార్కెట్ పైనేనా?
- కౌంటర్‌పాయింట్, జీఎఫ్‌కె రీసెర్చ్ నివేదికల్లో సైతం వెల్లడైంది అదే!

కడవేర్గు

స్మార్ట్ నుంచి ఫీచర్ వైపు?

"నామమాత్రపు రుసుమును చెల్లించి, నిర్ణీత వ్యవధి అనంతరం.. చెల్లించిన నగదును వాపసు పొందుతూనే.. 4జీ నెట్‌వర్క్ ఫోన్ ను శాశ్వతంగా మీ సొంతం చేసుకోండి" అంటూ జియోఫోన్ చేసిన మార్కెట్ స్టంట్ కు స్మార్ట్ ఫోన్ దిగ్గజాల వెన్నులో ప్రస్తుతం వణుకు పుడుతోంది. దీనికి కారణం.. దేశీయ ఫీచర్ ఫోన్ విపణిలో ఏకంగా 27 శాతం వాటాను రిలయన్స్ జియో ఫీచర్ ఫోన్ సాధించడమే! ఇది నిజం.. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ సంస్థ 2017 నాలుగో త్రైమాసికానికి గానూ.. 'తయారీ సంస్థల నుంచి షిప్‌మెంట్‌ల'ను పరిగణనలోకి తీసుకుని వెల్లడించిన నివేదికలో ఈ విషయం బయటపడింది. రూ.1,500ల జియో 4జీ నెట్‌వర్క్ ఫీచర్ ఫోన్ ప్రకటన రావడమే ఆలస్యం.. ఈ ఫోన్ కోసం సుమారు 60 లక్షల ముందస్తు బుకింగ్‌లు జరగడంతో పాటూ ఇంకా చాలా మంది ఈ ఫోన్ కోసం ఉవ్విళ్ళూరుతుండటం.. సాధారణ ఫీచర్ ఫోన్ వాడిన వారు అత్యంత తక్కువ ధరలో 4జీ నెట్‌వర్క్ పై పనిచేసే జియో ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవుదామని భావించడం.. వగైరా వంటి వాటిని చూస్తే, దేశంలో ఫీచర్ ఫోన్లకు పూర్వ వైభవం రానుందన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయని కౌంటర్‌పాయింట్ సర్వే ప్రతినిధుల అభిప్రాయపడ్డారు. ఈ వాదనకు మరింత బలాన్ని చేకూరుస్తూ.. "2017 నాలుగో త్రైమాసికంలో దేశీయంగా.. గత ఏడాదితో పోలిస్తే, ఈ సంవత్సరం స్మార్ట్ ఫోన్ అమ్మకాలు మూడు శాతం తగ్గడం.. ఆ గ్యాప్ ను 4జీ ఫీచర్ ఫోన్లు భర్తీ చెయ్యడాన్ని చూస్తే.. రానున్న కాలంలో స్మార్ట్ ఫోన్ మార్కెట్ ను ఫీచర్ ఫోన్లు(4జీ, 4జీం) డామినేట్ చేసే అవకాశమున్నట్టు" జర్మనీకి చెందిన అతిపెద్ద మార్కెట్ రీసెర్చ్ సంస్థ జీఎఫ్‌కె విడుదల చేసిన తాజా నివేదిక సైతం పేర్కొనడం గమనార్హం.

ఇప్పుడు టార్గెట్ వాళ్ళేనా?

ప్రపంచంలో మొబైల్ ఫోన్ వాడే అత్యధిక వినియోగదారుల్లో చైనా తర్వాతి స్థానంలో ఉన్న భారతదేశానికి జియో 4జీ రాక కొత్త పంథాను నేర్పిందనే చెప్పాలి. జియో రాకముందు కేవలం 3జీ ఫోన్లే మార్కెట్‌లో ప్రధానంగా కనిపించేవి. అయితే, జియో వచ్చాక.. ఒక్కసారిగా 4జీ వీవోఎల్‌టీఈ ఫోన్లకు గిరాకీ బాగా పెరిగింది. దీంతో చాలా వరకు మొబైల్ తయారీ కంపెనీలు 4జీ ఫోన్లను గణనీయంగా విక్రయించి లాభాలను ఆర్జించాయి. ఈ క్రమంలో చాలా మంది యూజర్లు జియో నెట్ వర్క్ ను వాడడం కోసం ఏకంగా కొత్త 4జీ ఫోన్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరిచినప్పటికీ.. ఆయా ఫోన్ల ధరలు వారి ఆశలకు కళ్ళెం వేశాయి. ఇది గమనించిన జియో కంపెనీ.. గ్రామీణ స్థాయి నుంచి అందరికీ అందుబాటులో 4జీ ఫోన్ ఉండాలని '4జీ ఫీచర్ ఫోన్'కి శ్రీకారం చుట్టింది(స్మార్ట్ ఫోన్ ఐతే, ఖరీదు కాబట్టి..). చౌకైన ఫోన్లపై మొగ్గుచూపుతున్న కస్టమర్లకు ఫ్రీగా వస్తున్న రిలయన్స్ జియో 4జీ ఫీచర్ ఫోన్ ఒక అద్భుతంగా కనిపించింది. ఈ వ్యవహారం ఫీచర్ ఫోన్ మార్కెట్‌కు మరింత పాపులారిటీని తెచ్చిందనే చెప్పాలి. జియో అనంతరం.. ఐకాల్, పీస్, వివా వంటి కొత్త కొత్త బ్రాండులు 4జీ ఫీచర్ ఫోన్లను మార్కెట్‌లోకి తీసుకురావడంతో ఆయా ఫోన్లకు సైతం డిమాండ్ పెరుగడం వల్ల స్మార్ట్ ఫోన్ అమ్మకాలపై పెను ప్రభావం మొదలైంది. జియో మొదలుపెట్టిన 4జీ ఫీచర్ ఫోన్ నిర్ణయం.. స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీల అమ్మకాలకు భారీ గండి కొట్టాయని పారిశ్రామిక నిపుణులు చెబుతున్నారు. కాగా, ఇంకాస్త తక్కువ ధరలో '4జీం' ఫీచర్ ఫోన్ ను ప్రవేశపెట్టే యోచనలో జియో సంస్థ ఉన్నట్టు వినికిడి! ఇది నిజమో కాదో గానీ, స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీలకు జియో '4జీం' ఫీచర్ ఫోన్ నిర్ణయం కునుకు లేకుండా చేస్తోందన్న అభిప్రాయం పారిశ్రామిక వర్గాల్లో వ్యక్తం అవుతోంది.


జియో - మాయ

- జియో ప్రవేశపెట్టిన ఆఫర్లు, నిర్ణయాల మూలంగా టెలికాం పరిశ్రమలో సుమారు లక్షమంది తమ ఉద్యోగాలను కోల్పోయారు.
- జియో చేసిన గాయాన్ని మాన్పుకోవడానికి ఎయిర్ టెల్, ఐడియా వంటి ప్రధాన సెల్యూలార్ కంపెనీలు సైతం విలీనాలబాట పట్టడం విశేషం.
- మొబైల్ డేటా వినియోగంలో 155వ స్థానంలో ఉన్న భారత్.. జియో రాకతో ఏకంగా.. నంబర్ 1 స్థానానికి చేరుకొంది.
- దేశ రిటైల్ ఇండస్ట్రీలో 88 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్న కిరాణా షాపుల ద్వారా జియో కిరాణా సరకుల రంగంలోకి పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి సన్నద్ధమవుతోంది.
- 1977లో ఆర్ఐఎల్ టర్నోవర్ 33 కోట్లు ఉంటే, గత యేడు సంస్థ టర్నోవర్ 3.3లక్షల కోట్లకు పైనే!

సామాజిక న్యాయంతోనే

సమాజ పురోగతి

బి.వి.యన్.పద్మరాజు



పవన్ కళ్యాణ్ పర్యటనను ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు...?

మొదటి విషయం పవన్ పార్టీపెట్టి.. ప్రజల కోసం పని చేస్తామంటున్నారు. ఇప్పుడిక సినిమాలు కాదు.. రాబోయే కాలమంతా, జీవితమంతా ప్రజల కోసం అంకితం చేస్తామంటున్నారు. సంతోషం. అలా చేయగలిగితే రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడుతుంది. పక్కన తమిళనాడులో కూడా రజనీకాంత్, కమల్‌హాసన్ కూడా రాజకీయాల్లోకి వస్తామంటూ ప్రకటించారు. అయితే సినిమాలు ఫ్లాఫ్ అవుతున్నాయి కాబట్టి.. అక్కడ కేరీర్ లేదు కాబట్టి.. ఇప్పుడు రాజకీయాల్లోకి కేరీర్ కోసం వస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. రాబోయే కాలంలో వారు వ్యవహరించే తీరునుబట్టి, వారు ప్రజలకోసం, పార్టీ కోసం, రాజకీయాల కోసం కృషి చేసేదాన్నిబట్టి... అంటే సినిమాల్లో రాణించినట్టుగా అకస్మాత్తుగా రాజకీయాల్లో కూడా రాణించాలి, పదవుల కోసం వస్తున్నారా? లేక నిజంగానే తమ శేష జీవితాన్ని ప్రజల కోసం వినియోగిస్తారా? లేదా? అనే విషయం రాబోయే కాలంలో రుజువు కావాల్సి ఉంటుంది. పవన్ విషయంలో కూడా అదే వర్తిస్తుంది. రెండో విషయం తెలంగాణలో పర్యటన ముగించారు. ఏపీలో ప్రారంభించారు. ఇప్పటికే ఆయన పర్యటన మీద విమర్శలు ప్రారంభమయ్యాయి. తెలంగాణలో కేసీఆర్‌ను, ఏపీలో చంద్రబాబు ప్రభుత్వాలను రక్షించటానికో, వాటి మీద వస్తున్న విమర్శలను, అసంతృప్తుల్లో పక్కదోవ పట్టించేందుకో ఆయన పర్యటన సాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నాకు అలాంటిది లేదని పవన్ చెబుతున్నారు. అయితే ఆయన పర్యటనలో ఎలాంటి విధానాలు చెబుతున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిష్కర్శగా విమర్శిస్తున్నారా? లేదా? అనేది చూడాలి. దీంతోపాటు ఆయన పార్టీకి ఒక స్పష్టమైన రాజకీయ విధానం ఉందా? లేదా? అనేది కూడా పరిశీలించాలి. దేశంలో ముందుకొస్తున్న ప్రధాన అంశాలపై ఆయన పార్టీ తీసుకునే స్పష్టమైన వైఖరినిబట్టి పవన్‌ను, ఆయన పార్టీని అంచనా వేయాల్సి ఉంటుంది. ఆ రకంగా చూసినప్పుడు పవన్ కళ్యాణ్ ప్రవచనాల్లో అస్పష్టత గోచరిస్తున్నది. స్పష్టమైన విధానాలు రూపకల్పన చేయకుండా.. అస్పష్టంగా మాట్లాడుతున్నారా? లేక రూపకల్పన చేసి కూడా అస్పష్టంగా ప్రజల ముందుకొస్తున్నారా? అనే సందేహాలు వెల్లువెతుతున్నాయి. ఒక రాజకీయ పార్టీగా వివిధ ఆర్థిక, సామాజిక, ప్రజా సమస్యలపై స్పష్టమైన అభిప్రాయాల్లేకుండా.. సినిమా గ్లామర్ ఉంది కాబట్టి అదే రాజకీయాలను నడిపిస్తుందనే దానికి ఆస్కారం లేదు. రాజకీయాలు రాజకీయాలే.. విధానాల ప్రాతిపదిక మీద వాటిని నడపాలి. అయితే కేసీఆర్, చంద్రబాబుకు సానుకూలత సృష్టించేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారనే విమర్శ ఉంది. కానీ ప్రజల్లో అసంతృప్తి ఉంటే పవన్ ఎన్ని యాత్రలు చేసినా ఆ సానుకూలతను ఆయన సృష్టించలేరు. అయితే ఇంకా రాజకీయాలు స్పష్టంగా ముందుకొస్తేనే ఆయనకుగాని, ఆయన పార్టీకి గానీ విలువ పెరుగుద్ది తప్ప వేరేదేమీ లేదు.

తెలంగాణలో మాదిరిగా ఏపీలో సామాజిక శక్తులను కూడగట్టేందుకు ఎలాంటి ప్రయత్నాలు సాగిస్తున్నారు?

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఎ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఒకే తరహా ఆర్థిక, సరళీకృత విధానాలు అనుసరిస్తున్నాయి. ఇదే విషయాన్ని మొదటి నుంచీ చెబుతున్నాం. ఇక్కడ కేసీఆర్, ఏపీలో చంద్రబాబు కూడా అవే విధానాలను అనుసరిస్తున్నారు. వీటి వల్ల దేశంలోను, రాష్ట్రంలోనూ ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. అందువల్ల ఈ విధానాలకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలు కావాలని చెబుతున్నాం. చెప్పటమేగాదు అలాంటి శక్తులను దేశవ్యాప్తంగా కూడగడుతున్నాం. ఇందులో భాగంగా ఇక్కడ కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలుగాని, ఉమ్మడి రాష్ట్రంలోగాని, దేశంలోగానీ కాంగ్రెస్ అనుసరించిన విధానాలే ప్రజల దుస్థితికి కారణం. అందువల్ల ఆ పార్టీ విధానాలు కూడా ప్రత్యామ్నాయం కాదు. ఎవరు అధికారంలోకి వచ్చినా మౌలికమైన సమస్యలు పరిష్కారం కావట్లేదు. వీటి పరిష్కారానికి అవసరమైన శక్తుల్ని కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. తెలంగాణలో ఇందుకు కొంత సానుకూల పరిస్థితులున్నాయి. అందుకే ఇక్కడ అలాంటి శక్తుల్ని కూడగడుతున్నాం. ఉద్యమాల రూపంలోను, నిర్దిష్టమైన ప్రణాళికల పేరుతోను, ఆ తర్వాత సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి పేరుతో 21 పార్టీలతో బీఎల్‌ఎఫ్‌ను ఏర్పాటు చేశాం. ఏపీలో కూడా అలాంటి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కానీ అక్కడి రాజకీయ పరిస్థితులు, రాజకీయ శక్తులు వేరు. అందువల్ల అక్కడి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఉద్యమాల సందర్భంలో అన్ని శక్తుల్ని కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాం. వామపక్షాలు, సామాజిక శక్తులు, ఇతర ప్రజాతంత్ర శక్తుల్ని ఒక రాజకీయ వేదిక మీదికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అది వెంటనే ప్రారంభం కావచ్చు. అయితే రెండు రాష్ట్రాలకు ఇవి వేర్వేరు ఎత్తుగడలని అనుకోవటానికి లేదు. ఒకే రకమైన ఆలోచనలను ఆయా పరిస్థితుల్నిబట్టి అమలు జరుపుతున్నాం.

రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణ, ఏపీలకు కేంద్రం అనేక హామీలిచ్చింది. కానీ వాటి అమలుకు ఇటు కేసీఆర్, చంద్రబాబు ఒత్తిడి తేవటం లేదు.. దీనిపై మీ విశ్లేషణ..?

హామీల అమలుకు ఇటు కేసీఆర్‌గాని, చంద్రబాబుగానీ పోరాడటం లేదు. వాస్తవానికి చంద్రబాబు బీజేపీతో కేంద్రంలో అధికారాన్ని పంచుకుంటున్నారు. రాష్ట్రంలో కూడా పంచుకుంటున్నారు. అందువల్ల ఆయన బీజేపీతో మమేకమై పోయాడు. కాబట్టి చంద్రబాబు పోరాడతాడని అనుకోవటానికి లేదు. కానీ అప్పుడప్పుడు చప్పుళ్లు చేస్తున్నారు. నాటకాల ప్రహసనం కొనసాగిస్తున్నారు. అది ఆయనకు అలవాటు. కానీ తెలంగాణలో కేసీఆర్‌కు ఆ అవసరం లేదు. అయినా దురదృష్టవశాత్తూ ఆయన కూడా కేంద్రంపై పోరాడటం లేదు. ఇదే సమయంలో మాట వరసకు మాట్లాడటం కాకుండా సీరియస్‌గా ఒత్తిడి చేయటం లేదని అనిపిస్తున్నది. ఇందుకు రెండు కారణాలు.. ఒకటి కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలనే ఇక్కడ, అక్కడ అనుసరిస్తున్నారు. రెండోది హిందూ మతోన్మాద విధానాలను, లౌకికత్వానికి భంగం కలిగించే విధానాలపట్ల కూడా మెతకవైఖరిని, సానుకూలతను ప్రదర్శిస్తున్నారు. అలా చేయటం వల్ల తమకు ఉపయోగం కలుగుతుందని వారు భావిస్తున్నారు. మూడోది.. రాజకీయంగా కేంద్రంతో తగాదా పడితే.. తమ లొసుగులను ఎక్కడ బయటపెట్టి.. ఇబ్బంది పెడతారేమోనని భయం. ఏమైనా వారి అవసరాల కోసం, ప్రయోజనాల కోసం రాష్ట్రాలు, ప్రజల అవసరాలను విస్మరించటం తగదు.

ఇటీవల కేటీఆర్, లోకేశ్ దావోస్‌లో పర్యటించారు. ఈ నేపథ్యంలో తమ తమ రాష్ట్రాలకు పెట్టుబడులు వస్తాయంటూ వారు చెబుతున్నారు. ఇది సాధ్యమవుతుందా...?

వీరిద్దరూ గద్దెలకు వారసులుగా ఉన్నారు. సాక్షాత్తూ ప్రధాని కూడా దావోస్ వెళ్లొచ్చారు. దావోస్ ఎకనామిక్ ఫోరమే.. ఒక అంతర్జాతీయ సంత. అక్కడ అందరూ ప్రదర్శించుకోవటానికి వస్తారు. సేల్స్‌మెన్ వస్తారు. మేధావులు వస్తారు. ఆ సంతలో వీరెళ్లి ప్రచారం చేసుకోవటం తప్ప వేరేది లేదు. దావోస్ వెళ్లాం.. ఏదో వచ్చేస్తుంది.. వచ్చేస్తుంది అనే భ్రమలు కల్పిస్తున్నారు. పెట్టుబడులు ఇక్కడికొచ్చే పరిస్థితులు లేవు. రావాలంటే వారు (పెట్టుబడిదారులు) సంస్కరణలు అమలు చేయాల్సిందే. అప్పుడే కార్పొరేట్ సంస్థలు ఇక్కడికి వస్తాయి. అలా చేయటమంటే ఇక్కడి ప్రజల్ని బలిపశువులు చేయటమే. అందువల్ల కేటీఆర్, లోకేశ్ మాటలు ప్రాపగాండాకే ఉపయోగపడతాయి తప్ప వేరేదేమీ లేదు.

ఇరు రాష్ట్రాల ప్రజలకు మీరిచ్చే సందేశం...

రాష్ట్ర విభజన జరిగితే ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రా ప్రజలకు చాలా లబ్ది కలుగుతుందని చాలా మంది భావించారు. వెనకబడిన తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కేసీఆర్‌తోపాటు ఉద్యమంలో పాల్గొన్న వారూ చెప్పారు. వాస్తవంలో అవేవీ నెరవేరలేదు. ఒకవేళ నెరవేరినా అది కొంతమంది కుటుంబ సభ్యులకు, రాజకీయ పలుకుబడి ఉన్నవారికే దక్కింది. తెలంగాణ సామాన్య ప్రజలకు ఎలాంటి లబ్దీ జరగలేదు. అందవుల్ల పాత పాలకులైనా, కొత్త పాలకులైనా వారి వల్ల ఒరిగేదేమీ లేదని తేలింది. అందువల్ల ప్రత్యామ్నాయ విధానాల కోసం సామాజిక శక్తులన్నీ కలవాలని చెబుతున్నాం. ఏపీలో చంద్రబాబు నేనైతే అభివృద్ధి చేస్తానంటూ చెప్పారు. కానీ అక్కడి ప్రభుత్వం ఒక పెద్ద ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలాగా మారిపోయింది. ఈ హైప్ కొంతకాలం కొనసాగుతుంది. తర్వాతర్వాత వాస్తవం కండ్లకు కనబడితే ప్రజలు రియలైజ్ అవుతారు. అందువల్ల రెండు రాష్ట్రాల్లోనూ ప్రత్యామ్నాయ విధానాలు, రాజకీయాలను ఆదరించాలని కోరుతున్నాం.

ఉమ్మడి రాష్ట్రంలో సామాజికాంశాలపై అనేక ఉద్యమాలు సాగించారు... వాటి కొనసాగింపుగా ఇప్పుడు జరుగుతున్న కృషిపట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా...?

సామాజిక పరిస్థితులు మెరుగుకాకుండా తెలంగాణగాని, ఏపీగానీ ముందుకు పోయే పరిస్థితి లేదు. చదువులో ఈ రెండు రాష్ట్రాల స్థానం 25కు పైన్నే ఉంది. అంతటా అసమానవృద్ధి నెలకొంది. తెలంగాణలో హైదరాబాద్‌ను జిగేల్‌మనిపిస్తే సరిపోద్దా..? ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలోని ఇతర వెనుకబడిన జిల్లాల పరిస్థితేమిటి? అదే విధంగా ఏపీలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాలోని ప్రకాశం జిల్లాల పరిస్థితేమిటి? రెండు రాష్ట్రాల్లోని దళితులు, గిరిజనులు, మైనారిటీలు, సేవా కులాలు, అణగారిన వర్గాల పరిస్థితేమిటి? అగ్రకులాల్లో కూడా పేదలు, నిరుద్యోగులు ఉన్నారు. అక్కడా, ఇక్కడా ప్రసూతి మరణాలు పెరుగుతున్నాయి. అందువల్ల సామాజిక తరగతులకు అత్యధిక నిధులు కేటాయించాలి. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాల వారి చదువుకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. ఇలాంటి వాటికోసం దీర్ఘకాలంగా కృషి చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ రూపాల్లో ఆ కృషి జరిగింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆ కృషిని ముందుకు.. ఇంకా చెప్పాలంటే దాని స్థాయిని పైకి తీసుకెళుతున్నారు. ఆ రోజు స్వతంత్రంగా చేశాం. ఇప్పుడు అలాంటి శక్తులన్నింటినీ కూడగట్టి ఒకవేదిక మీదికి తీసుకొచ్చే కృషి జరుగుతున్నది. తెలంగాణలో ఆ కృషిని ఒక రాజకీయ అజెండా స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం. ఏపీలో కూడా అదే రకమైన కృషిని సాగిస్తాం. ఎందుకంటే సామాజికాంశాలనేవి సమాజం బాధ్యత. అందుకే వాటిని రాజకీయ అజెండాలోకి తీసుకొస్తున్నాం. అందువల్ల మా ఈ కృషిని అందరూ గమనించాల్సి వస్తున్నది.

హైదరాబాద్‌లో జరగబోయే అఖిల భారత మహాసభల ప్రాధాన్యతను వివరిస్తారా..?

గత మహాసభ విశాఖపట్నంలో జరిగింది. అప్పుడు మేం 25 ఏండ్లలో అనుసరించి నవిధానాల్ని సమీక్షించుకున్నాం. ఆ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల్ని కూడగట్టడమనేది ముఖ్యమని భావించాం. రాష్ట్రాల్లోను, కేంద్రంలోనూ బూర్జువా పార్టీలకు భిన్నంగా ఉండే ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తుల్ని కూడగట్టాలని ఆ మహాసభ పిలుపునిచ్చింది. దాని కోసం ఎలాంటి కార్యక్రమాలు చేశాం, వాటి ఫలితాలేంటనేది హైదరాబాద్ మహాసభలో సమీక్షిస్తాం. ఇక్కడ తెలంగాణలో బీఎల్‌ఎఫ్‌గాని, గతంలో తమిళనాడులో ఏర్పాటు చేసిన పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్ తదితర వేదికలపై సమీక్షిస్తాం. గత మహాసభ సాధారణ ఎన్నికలకు ముందు జరిగింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక చాలా ప్రమాదకరమైన స్థాయిలో దేశంలోని రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని వక్రీకరిస్తారని చెప్పాం. అయితే మా అంచనా ఎంతవరకు నిజమైంది.. బీజేపీ పాలనలో నిరంకుశ చర్యలు ఎలా పెరిగాయి, వాటిని ఎంతవరకు తిప్పికొట్టగలిగాం, ముమ్ముందు ఇంకా ఎలాంటి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలనే విషయాలపై చర్చిస్తాం.

అంబేద్కర్-ఫూలే-మార్క్స్

సిద్ధాంతమే మా పెట్టుబడి

బొల్లె జగదీశ్వర్



డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు ఫూలే, కారల్ మార్క్స్ సిద్ధాంతమే తమ పెట్టుబడి అని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. అధికారంలోకి రావడానికి ఈ సిద్ధాంతమే తమకు ఆధారమని చెప్పారు. డబ్బు, మద్యం పంచబోమని స్పష్టం చేశారు. ఆ సిద్ధాంతాన్ని సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్తామని, ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ ఓటమికి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అధికారంలోకి రావడానికి, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపురలో వామపక్షాలు అధికారం చేపట్టడానికి, ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు, ఢిల్లీలో ఆప్ విజయం సాధించడానికి సిద్ధాంతమే పనిచేసిందని అన్నారు. అక్కడ డబ్బు, మద్యం ఎంత పంచినా ఎన్నికల్లో ప్రభావం చూపలేదని వివరించారు. తెలంగాణలోనూ అంబేద్కర్, ఫూలే, మార్క్స్ ఆలోచనల కలయికతో ఏర్పడిన బీఎల్‌ఎఫ్ అధికారంలోకి రావడానికి ఇప్పుడు ఆ సిద్ధాంతమే ప్రధాన భూమిక పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఎల్‌ఎఫ్ ఆవిర్భావం సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధితో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలు...

బీఎల్‌ఎఫ్ ఆవిర్భవించడానికి గల కారణాలను, ఉద్దేశాన్ని వివరించండి?.

అనేక ఏండ్లుగా పాలక పార్టీలు కుట్ర పద్ధతిలో వ్యవహరించాయి. ఒకసారి మీరు, ఇంకోసారి మేం అధికారంలోకి రావాలనే పరస్పర సహకారంతోనే ఉంటున్నాయి. బయటి ప్రపంచానికి మాత్రం ఒకరిని మరొకరు విమర్శించినట్టు కనిపిస్తున్నది. అంతిమంగా రాజ్యాధికారం వారి చేతుల్లోనే ఉంటుంది. జెండాలు మారుతాయి కానీ ఎజెండా మారదు. అగ్రకుల ఆధిపత్యమే అధికారంలో కొనసాగుతున్నది. నూటికి 93 శాతం ఉన్న బలహీనవర్గాల ప్రజలు మాత్రం అధికారానికి దూరంగా, ప్రేక్షకపాత్ర, నామమాత్రంగా ఉంటున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో రాజ్యాధికారమే లక్ష్యంగా 28 రాజకీయ పార్టీలతో బీఎల్‌ఎఫ్ ఆవిర్భవించింది. 5,10 ఎమ్మెల్యే సీట్లు వస్తే ఇచ్చిన వాగ్ధానాలు అమలు కావు. రాజ్యాధికారంలోకి వస్తేనే వాగ్ధానాలు అమలు కావడంతోపాటు ప్రజలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ, బీజేపీలకు బీఎల్‌ఎఫ్ ప్రత్యామ్నాయం. మా బలం సామాజిక న్యాయం, తెలంగాణ సమగ్రాభివృద్ధి.

అధికారంలోకి వస్తే ఏయే వర్గాలకు ఏం చేస్తారు. బీఎల్‌ఎఫ్ ప్రాధాన్యతా అంశాలేంటీ?

విద్యావైద్యం సేద్యం మా ప్రాధాన్యత అంశాలు. అంబేద్కర్ ఆలోచన ప్రకారం విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తాం. కులమతవర్గ అన్న తేడా లేకుండా అందరూ ఒకే దగ్గర చదువుకునే అవకాశాలను కల్పిస్తాం. కార్పొరేట్, కాన్వెంట్‌లో చదివే వారి సంఖ్యను క్రమంగా తగ్గిస్తాం. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తాం. వైద్యం పూర్తిగా ఉచితంగా అందిస్తాం. పేద, ధనిక అన్న తేడా లేకుండా జబ్బు పడిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం. కార్పొరేట్ ఆస్పత్రులు లేని కాలంలో సర్కారు దవాఖానాలే మెరుగైన వైద్యం అందించాయి. గ్రామస్థాయిలో పీహెచ్‌సీలు, మండలంలో 30 పడకల ఆస్పత్రి, జిల్లా కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తాం. కార్పొరేట్ ఆస్పత్రులను మీద నియంత్రణ, పర్యవేక్షణ ఉంటాయి. మందుల ఉత్పత్తి కేంద్రం హైదరాబాద్. అయినా పాలక పార్టీల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో మందులు దొరకని పరిస్థితి వచ్చింది. మేం అధికారంలోకి వచ్చాక వైద్యంతోపాటు మందులన్నీ ఉచితంగా అందిస్తాం. తెలంగాణ వచ్చినా రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. టీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం, మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలను పరామర్శించడం లేదు. మేం అధికారంలోకి వస్తే పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు ధర కల్పిస్తాం. సేద్యం లాభదాయకంగా చేసినప్పుడే రైతుకు ఆనందం కలుగుతుంది. ఏ భూమిలో ఏ పంట వేయాలో వ్యవసాయ అధికారులను పంపించి రైతులకు వివరిస్తాం. మండలానికి శీతల గిడ్డంగులను నిర్మించి మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం. మద్యనిషేధం అమలు చేస్తాం. కల్లును అవసరమైతే నీరాగా మార్చి అమ్మేలా చూస్తాం. సేద్యానికి యోగ్యంగా లేని భూమిలో తాటి, ఈత వనాలు పెంచుతాం. రజకులకు లాండ్రి ఏర్పాటుకు, నాయీ బ్రాహ్మణులు బ్యూటీ క్లినిక్‌లకు, కమ్మర, కుమ్మర, వడ్రంగిలకు వృత్తులను కొనసాగించేందుకు రుణాలిస్తాం. ఎస్సీ,ఎస్టీలకు మూడెకరాల భూమి ఇస్తాం. భూమి దొరక్కపోతే వారికి కేటాయించిన డబ్బును లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేస్తాం.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన యువతను ఆకర్షించేందుకు ఏం చేయబోతున్నారు.?

చదువులను, ప్రాణాలను లెక్కచేయకుండా విద్యార్థులు, యువకులు పెద్దఎత్తున తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ వస్తే తొలి ప్రాధాన్యం యువతకే దక్కుతుందని ఆశించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక యువతను దగా చేశారు. బీఎల్‌ఎఫ్ అధికారంలోకి వస్తే ప్రభుత్వ శాఖల్లో ఉన్న 2 లక్షల ఖాళీలను, బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తాం. డిగ్రీ, ఆపై చదివిన వారికి నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం. పారిశ్రామిక యూనిట్లు ప్రారంభించాలనే వారికి కోటి రూపాయల వరకు ష్యూరిటీ లేకుండా రుణాలిస్తాం. కులాంతర వివాహాలు చేసుకున్నోళ్లకు అండగా ఉంటాం.

ప్రోత్సహించడానికి రూ.5 లక్షలు ఇస్తాం. ఉపకులాల మధ్య కులాంతర వివాహాలు జరిగినా రూ.5 లక్షలు వర్తింపచేస్తాం. అగ్ర కులాల వారూ అర్హులే.

119 నియోజకవర్గాల్లో పోటీచేస్తామంటున్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం తీవ్రంగా ఉంది. ఎలా తట్టుకొని నిలబడతారు. మీ ప్రణాళిక ఏమంటారు?

ప్రపంచాన్ని విముక్తి చేసిన మార్క్స్ జ్ఞాన సిద్ధాంతం, దేశాన్ని కుల నిర్మూలన దిశగా విముక్తి కోసం పోరాడిన మహాత్మాజ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ జ్ఞాన సిద్ధాంతం మాకు ఆదర్శం. ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తాం. చైతన్యవంతులను చేస్తాం. అంబేద్కర్, ఫూలే, మార్క్స్ సిద్ధాంతమే మా పెట్టుబడి. ఈ సిద్ధాంతం ముందు డబ్బు, మద్యం దిగదుడుపే అవుతుంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి ఎజెండా విస్ఫోటనం సృష్టిస్తుంది. రూ.50 కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు కాంట్రాక్టర్లు, సంపన్నులు వందలాది మంది 93 శాతం ప్రజానీకంలో లేరు. వ్యాపారాలన్నీ అగ్రకులాల వారి చేతుల్లోనే ఉన్నాయి. రాజ్యాధికారం ఉంది. ఎన్నికల్లో గెలవడం, డబ్బు సంపాదించడం, కొంత సొమ్ము ప్రజలకు పంచడం ఆనవాయితీగా మారింది. సంపద అందరికీ దక్కాలంటే రాజ్యాధికారం రావాలి. లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగ్గొట్టిన వారి జాబితాలో ఎస్సీ,ఎస్టీ,,బీసీ, మైనార్టీల్లేరు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేస్తున్న అరాచకాలను, పోగేసుకుంటున్న డబ్బు గురించి ప్రజలకు వివరిస్తాం. చైతన్యం పెంచుతాం. మా పట్ల విశ్వాసం కల్పిస్తాం.

దేశానికి గుజరాత్ మోడల్ కావాలంటున్నారు. దీనిపై మీరేమంటారు?

దేశానికి గుజరాత్ మోడల్ కావాలని బీజేపీ చెప్తున్నది. గుజరాత్ మోడల్ డొల్ల. గుజరాత్ మోడల్ అంటే దళితులు, మైనార్టీలపై దాడులు, హత్యలు చేయడం. మూఢనమ్మకాలను పెంచడం. తిండిపై, సంస్కృతిపై ఆంక్షలు విధించడం. అందుకే దేశానికి లెఫ్ట్ ఫ్రంట్ నేతృత్వంలోని కేరళ మోడల్ కావాలి. ఈ మోడల్ అంటే అందరికీ నాణ్యమైన విద్య. అందరికీ వైద్యం. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం, తలసరి ఆదాయం పెంచడం, దళితున్ని పూజారి చేయడం ఇలా అనేక రంగాల్లో కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచింది.


కమ్యూనిస్టులను అంబేద్కర్ వ్యతిరేకించారన్న ప్రచారంపై ఏమంటారు?

అంబేద్కరిస్టులు-కమ్యూనిస్టులు సహజ మిత్రులు. అంబేద్కర్ రాజకీయ ఉద్యమాలకే ప్రాధాన్యతనిచ్చారు. కార్మికుల సంఘటితం చేయడానికే మొదట లేబర్ పార్టీ స్థాపించారు. ఆ తర్వాత షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ ఏర్పాటు చేశారు. విశాల ప్రాతిపదికన రాజకీయ పార్టీ ఉండాలనే ఉద్దేశంతో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్థాపించారు. రామ్‌మనోహర్ లోహియాతో మాట్లాడి కమ్యూనిస్టులతో కలిసి ఐక్య సంఘటన ఏర్పాటు చేయాలనుకున్నారు. అది నెరవేరకముందే అంబేద్కర్ చనిపోయారు. అంబేద్కర్ కోరికను నెరవేర్చడం కోసమే బీఎల్‌ఎఫ్ ఆవిర్భవిస్తున్నది. కమ్యూనిస్టులతో కలిసి అంబేద్కర్ పనిచేయాలనుకున్నారు.

కోదండరామ్ పార్టీ పెడతామంటున్నారు. బీఎల్‌ఎఫ్‌లోకి ఆహ్వానిస్తారా?

బీఎల్‌ఎఫ్ విధానాలను ఏకీభవిస్తే కోదండ రామ్‌తోపాటు ఎవరినైనా మా ఫ్రంట్‌లోకి సాదరంగా ఆహ్వానిస్తాం.

చార్వాక
నవతెలంగాణ
11 హైదరాబాద్ సోమవారం 29-1-2018



కంకవనంలో హైందవరాగం

ఆర్కే ప్రొఫ్ద

> జాతర ఇంతగా విస్తృతి చెందుతున్న తరుణంలోనే ఆదివాసీలు విస్మృతి చెందుతుండడం శోచనీయం, ఆక్షేపణీయం. మేడారం భౌతికస్థితిలో వచ్చిన గుణాత్మక, పరిమాణాత్మక మార్పులు గిరిజన గూడాల్లో, వారి బతుకుల్లో కానరాకపోవడమే నేటి వైచిత్యం. నేటికీ డయేరియా, మలేరియా వ్యాధులతో నడమంత్రపు చావులకు ముగింపు లేదు. విద్యా, వైద్యం ఇంకా అందని ద్రాక్షే. పాతరాతి యుగంనాటి జీవన సరళే. దినదిన గండమైన బతుకే. అన్నింటికీ మించి బ్రిటిష్ వలస పాలనకాలంలో మొదలైన ఆదివాసీ స్వయంపాలన కాంక్ష ఇప్పటికీ, 70 ప్రజాస్వామ్య ప్రభుత్వాల హయాంలోనూ కలగానే మిగిలిపోవడం విషాదం. అడివంతా ఇంకా అవే జల్ జంగిల్ జమీన్ నినాద ప్రతిధ్వనులే. నిత్యకత్యమైన అమానుషదాడులు. మరి ఇట్లా ఎందుకు జరుగుతున్నది. ఈ వికృత, విరోధ పరిణామాలకు కారకులు ఎవరు? ఏ శక్తులు సాంస్కృతిక విచ్ఛిన్నానికి పురికొల్పుతున్నవి? అవి ఏ ప్రయోజనాలను ఆశిస్తున్నవి? అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా స్వరూప స్వభావమెట్టిది? దాని పర్యవసానాలేమిటి? అన్నవే ఇప్పుడు ప్రధాన ప్రశ్నలు. వాటికి జవాబులు సుస్పష్టం. చరిత్రనంతా వడబోసిన సనాతన వైదిక సంప్రదాయంలో ఆదివాసీలు కొనసాగిన దాఖలాలు ఎక్కడా లేవు. సర్వస్వతంత్రంగా ఒక జాతిగానే మనుగడ సాగించారు, సాగిస్తున్నారు. ఇప్పుడు వారిని కర్మసిద్ధాంతాలకు కట్టిపడేయాలన్నదే బ్రాహ్మణ, ఫ్యూడల్ ఆధిపత్యవర్గాల కుట్ర.



వేడారం.. రెండేండ్లకోమారు పునరుత్థానం చెందే పురావిశ్వాసం. రాచరిక ఆధిపత్యాన్ని ధిక్కరించి పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, గోవిందరాజు, జంపన్నలు వీరత్వం పొందిన రణస్థలి. ఆదివాసీ ఆత్మాభిమాన బావుట. పోరాట స్ఫూర్తి. ఆదిమ సంస్కృతైన సర్వాత్మవాదానికి, టోటెమిజానికి, ప్రకతి ఆరాధనకు సజీవ సాక్ష్యం. మాతస్వామ్య వ్యవస్థ అవశేషం. చిలుకలగట్టుపై ఒక గొట్టువాళ్లు గుట్టుగా చేసుకునే త్యాగాల యాదితీర్థం. కాలినడకన, ఎడ్లబండ్లలో వాగుల్ని, వంకల్ని, లొద్దులను దాటుకుంటూ, చిక్కని అడవిని చీల్చుకుంటూ యావత్ తెలంగాణేకాక, మధ్యభారతం దండకారణ్యంలోని కోయ కుదురంతా(గుంపు) కదిలివచ్చి కలుసుకునే కూడలి. కొంగొత్త బంధాలను కలిపే వారధి. నిష్టతో గూడేలను అలికి, పుదిచ్చి, గోడలకు జాజు పూసి, ముగ్గులేసి, ఆదివాసీ వీరుల నిషానులను గద్దెలపై నిలుపుకుని ఆవాహన చేసుకునే అనాది వారసత్వ సంప్రదాయం. చిటికెడు బండారి(పసుపు), పిడికెడు బంగారం (బెల్లం), కుడకలు, ఒడివాలబియ్యం, రెండు రైకబట్టలు, పోకలు, ఖర్జూరాలతో సారెబోసి కుంకుమభరిణకు, కంకవనానికి మోకరిల్లే సంబురం. చెలిమెతొక్కుడు, కోడిబుక్కుడు, ఆరగింపు మొక్కులు. సోలుపూత వరాలు. ఎదురుకోళ్ల, యాటపోతుల బలిహారాలు. రేలపాటలు, కొమ్ముకత్యాలు, తూతకొమ్ము రాగాలు, డోలువాయిద్యాలతో నిండుపున్నమి వేళ జిలుగు కల్లు వాసన, ఇప్పసార నిషాలో ఆడిపాడి తన్మయత్వం పొందే సామూహిక సంరంభం.

వర్తమానం.. మేడారం కంకవనం తామరతంపరై మైదానాలకు విస్తతినొందుతున్నది. సబ్బండ వర్గాల ఇలవేల్పు. ఆధునికతలో విలుప్తమవుతూ, విచ్ఛిన్నమవుతూ వినతికెక్కుతున్న విశ్వజాతర. కుంకుమభరిణ కుంభమేళా. సమ్మక్క, సారక్కలు ఇప్పుడు వనదుర్గలు. కోటొక్క పరిసె కోర్కెలను ఈడేర్చే దేవేరులు. ఎములాడ రాజన్న బంధువులు. పీతాంబరాలు, లడ్డూ నైవేద్యాలు, హుండీ కానుకలు, తలనీలాల సమర్పణలు. భావజాలంలోనే కాదు, భౌతిక మార్పులకు లోనవుతున్నది. కంకవనం కాంక్రీటు మయవుతున్నది. సాలహారంలో బంధీగా మిగిలింది. రసాయనిక రంగుల గత్తరవాసన. అడుగడుగునా సాబాదు బండలు. కాగితం పూల తోరణాలు. హైమాస్ట్ దీపాల వెలుగు జిలుగులు. అంతేనా అదిప్పుడు పస్రా, తాడ్వాయి కీకారణ్యంలో నాలుగురోజులు మెరిసి మాయమైపోయే మెట్రోపాలిటన్ నగరం. సకల సదుపాయాల నిలయం. మల్టీనేషనల్ ఉత్పత్తుల విపణి క్షేత్రం. ప్రపంచ వస్తు ప్రదర్శనశాల. రమ్ము, బ్రాందీ విస్కీల దుర్గంధం. వేల చదపుకిలోమీటర్ల వన విధ్వంసం. సందడంతా మార్కెట్ శక్తులది. నాగరీకులు సకుంటుంబ సపరివార సమేతంగా తాగి, ఊగి, జాలారి మడుగుల్లో ఈదులాడే వినోదకేళి. ప్రచారాలు, నిలువెత్తు కటౌట్లతో జాతర సంబురమంతా రాజకీయ నేతలది. పటాటోపమంతా అధికారులది. అజమాయిషీ అంతా ఆదివాసీయేతరులది.

జాతర ఇంతగా విస్తతి చెందుతున్న తరుణంలోనే ఆదివాసీలు విస్మృతి చెందుతుండడం శోచనీయం. ఆక్షేపణీయం. మేడారం భౌతికస్థితిలో వచ్చిన గుణాత్మక, పరిమాణాత్మక మార్పులు గిరిజన గూడాల్లో, వారి బతుకుల్లో కానరాకపోవడమే నేటి వైచిత్యం. నేటికీ డయేరియా, మలేరియా వ్యాధులతో నడమంత్రపు చావులకు ముగింపు లేదు. విద్యా, వైద్యం ఇంకా అందని ద్రాక్షే. పాతరాతి యుగంనాటి జీవన సరళే. దినదిన గండమైన బతుకే. అన్నింటికీ మించి బ్రిటిష్ వలస పాలనకాలంలో మొదలైన ఆదివాసీ స్వయంపాలన కాంక్ష ఇప్పటికీ, 70 ప్రజాస్వామ్య ప్రభుత్వాల హయాంలోనూ కలగానే మిగిలిపోవడం విషాదం. అడవంతా ఇంకా అవే జల్ జంగిల్ జమీన్ నినాద ప్రతిధ్వనులే. నిత్యకత్యమైన అమానుషదాడులు. మరి ఇట్లా ఎందుకు జరుగుతున్నది. ఈ వికత, విరోధ పరిణామాలకు కారకులు ఎవరు? ఏ శక్తులు సాంస్కృతిక విచ్ఛిన్నానికి పురికొల్పుతున్నవి? అవి ఏ ప్రయోజనాలను ఆశిస్తున్నవి? అనుసరిస్తున్న అభివద్ధి నమూనా స్వరూప స్వభావమెట్టిది? దాని పర్యవసానాలేమిటి? అన్నవే ఇప్పుడు ప్రధాన ప్రశ్నలు. వాటికి జవాబులు సుస్పష్టం. చరిత్రనంతా వడబోసిన సనాతన వైదిక సంప్రదాయంలో ఆదివాసీలు కొనసాగిన దాఖలాలు ఎక్కడా లేవు. సర్వస్వతంత్రంగా ఒక జాతిగానే మనుగడ సాగించారు, సాగిస్తున్నారు. ఇప్పుడు వారిని కర్మసిద్ధాంతాలకు కట్టిపడేయాలన్నదే బ్రాహ్మణ, ఫ్యూడల్ ఆధిపత్యవర్గాల కుట్ర. అందులో భాగమే ఆదివాసీ సంస్కృతిని హైందవీకరించే ఎత్తుగడ. బలప్రయోగంతో కాకుండా భావజాలవ్యాప్తితో లోబరుచుకునే విలీకరణ సిద్ధాంతం. ప్రకృతి శక్తులకు పురాణ ఇతిహాస గాధల అభూత కల్పనలు. కట్టుకథల పుట్టుకలు. వైదిక దేవతలు, దేవుండ్లతో పోలికలు. కొత్త బంధుత్వాల అల్లికలు. ప్రతిమల ప్రతిష్ఠలు. పత్రికల్లో పతాకస్థాయి ప్రచారాలు. టూరిజం ప్రోత్సాహకాలు. కాంక్రీటు నిర్మాణాలకు, విడిది కేంద్రాలకు కోటాను కోట్ల నిధుల కేటాయింపులు. ఇది ఒక్క మేడారంలోనే కాదు, ఆదివాసీలు ఆదివాసీయేతరులతో సంబంధాలను నెరిపిన, నెరపుతున్న ప్రతిచోటా ప్రతిఫలిస్తున్న దుష్ఫలితమిదే. పోరాట స్ఫూర్తిని నిర్వీర్యం చేసి ఆదివాసీలను బేదఖల్ చేసి అడవిని, అరణ్య గర్భాన దాగిన అపార సంపదను కొల్లగొట్టే 'దురాలోచనతో బ్రాహ్మణీయ ఆధిపత్యశక్తులు అమలు చేస్తున్న మంద్రస్థాయి యుద్ధవ్యూహం. అటవీ వనరుల దోపిడీనే కాదు, ఆదివాసీ సంస్కతిపై సాగుతున్న దాడినీ తిప్పికొట్టాల్సిన అవసరముంది. అటవీహక్కులు, చట్టాల అమలు కోసమే కాదు సంస్కతి పరిపరక్షణకూ నడుంకట్టాల్సిన సందర్భమిది. సమ్మక్క, సారక్కల పోరాట స్ఫూర్తితో ఆధిపత్య హైందవభావజాల వ్యాప్తికి వ్యతిరేకంగా పోరుబావుటాను ఎగరేయాలి. తుడుం మోగించాలి. ఆధిపత్య శక్తుల కుట్రలను ఛేదించాలి. శ్రీశైలం, భద్రాద్రి, తిరుపతి, అన్నవరం, అహోబిలం, యాదాద్రిల మాదిరిగా మేడారం చేజారకుండా పొదివిపట్టుకోవాలి. ఆదివాసీల ఆరాటాలకు, పోరాటాలకు ప్రజాతంత్ర శక్తులన్నీ బాసటగా నిలవాలి.

సెల్ : 7981574841



రిజర్వేషన్లను నియంత్రించే అధికారం కోర్టుకు ఉన్నదా?

పట్నం కమలాకర్

సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్లు దాటడానికి వీలులేదని, రాజస్థాన్‌లోని గుజ్జర్ల రిజర్వేషన్ విషయంలో ఈమధ్యనే ఇచ్చిన తీర్పులో చెప్పింది. కానీ కోర్టుకు చట్టానికి భాష్యం చెప్పే అధికారం మాత్రమే వుంది. రిజర్వేషన్లు ఎంత వుండాలని నిర్ణయించే అధికారం లేదు. ఒక వేళ పార్లమెంట్ రిజర్వేషన్లు ఇంతే వుండాలని చట్టం చేస్తే అది చెల్లుతుంది. కోర్టులు తమకు లేని అధికారాన్ని కట్టబెట్టుకొని రిజర్వేషన్లను నియంత్రిస్తున్నాయి. మన దేశంలో రిజర్వేషన్లు స్వాతంత్ర్యానికి పూర్వం నుండే వున్నాయి. కొన్ని సంస్థానాలలో వెనుకబడిన వారికి రిజర్వేషన్లు వున్నాయి. మనం ఒక రాజ్యాంగాన్ని రాసుకున్నాం, అందులోని ప్రవేశికలో సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందిస్తామని హామీ ఇచ్చాం. అందులో భాగంగానే రిజర్వేషన్లు కల్పిస్తే, 1951లో చంపకం దొరైరాజన్ అనే మహిళ ఆర్టికల్ 15(1) 29 (2) ప్రకారం కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వటం రాజ్యాంగ వ్యతిరేకమని కోర్టుకు వెళ్లింది. కోర్టుకూడా రిజర్వేషన్లు ఇవ్వడం తప్పు అని చెప్పింది. దీనితో ప్రభుత్వం ఆర్టికల్ 15కు క్లాజ్ 4ను చేర్చడం జరిగింది. ఈ క్లాజ్‌లో "ప్రభుత్వం సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు" అని రాజ్యాంగ బద్ధం చేసింది.

మండల్ కమిషన్ అమలు కోసం దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమంతో, రిజర్వేషన్ల విషయంలో కోర్టులు తమ ముందున్న వైఖరికని ఇప్పుడు చాలా వరకు మార్చుకున్నాయి. కానీ, రిజర్వేషన్లు 50శాతం దాటరాదనే విషయంలో ఇప్పటికీ అదే మాట చెబుతూ వస్తున్నాయి. దీన్నే అన్ని రాజకీయ పార్టీలు శిరోధార్యమైనట్టు పాటిస్తున్నాయి. 1963లో బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసులో 50శాతానికి రిజర్వేషన్లు మించకుండా వుంటే బాగుటుందని చెప్పింది. అప్పటినుండి కోర్టులు, రాజకీయ పార్టీలు రిజర్వేషన్లు 50శాతం మించకూడదని, ఈవిషయంలో సుప్రీంకోర్టు తీర్పుకు తిరుగులేదన్నట్టు మాట్లాడుతున్నారు. కానీ, స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్.థామస్ కేసులో జస్టిస్ రే, బేగ్, ముర్తుజా ఫజల్ అలీ, కృష్ణ అయ్యర్‌లు "ఒక రాష్ట్రంలో వెనుకబడ్డ తరగతుల జనాభా 80 శాతం వుంటే వాళ్లకు విద్య, ఉద్యోగాలలో 80 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంటే అది తప్పవుతుందా?" అని ప్రశ్నించింది. అంతేకాదు, వసంత కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్నాటక కేసులో జస్టిస్ చిన్నపరెడ్డి రిజర్వేషన్లకు గరిష్ట పరిమితి నిర్ణయించే అధికారం సుప్రీంకోర్టుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాజ్యాంగంలో ఎక్కడా రాసిలేని విషయాన్ని, కోర్టు తమకు లేని అధికారాన్ని కల్పించుకొని 50శాతం రిజర్వేషన్లు దాటరాదని చెబుతున్నదన్నారు. ఉదాహరణకు ఇదే కరెక్టు అనుకుందాం, పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లు 70 శాతంపైనే ఉన్నాయి. ఈ రిజర్వేషన్లు రాజ్యాంగ వ్యతిరేకం ఎందుకు కాదు.

కోర్టుకు ఇప్పటికీ అర్థం కాని విషయం ఏమిటంటే రిజర్వేషన్లు కులం ప్రకారం వుండాలా లేక సామాజిక, ఆర్థిక వెనుకబాటు ప్రామాణికంగా వుండాలా అనేది. ఎందుకంటే రాజ్యాంగంలో (బ్యాక్ వర్డ్ క్లాసెస్) వెనుక బడిన తరగతులు అని ఉంది, కులాలు అనలేదు కాబట్టి కులాన్ని పరిగణనలోకి తీసుకోరాదు అంటున్నాయి కోర్టులు. కానీ, ఈ దేశంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి కారణం కులమే! ఈ వాస్తవం కోర్టుకు కనపడటం లేదు. కులం అనేది కండ్లు మూసుకుంటే పోయేది కాదనేది కోర్టుకు ఎప్పటికి అర్థమవుతుందో? అంతేకాదు, మొట్టమొదటి రాజ్యాంగ సవరణ సమయంలో డా.బిఆర్.అంబేద్కర్ 'తరగతులు అంటే మరేమీ కాదు కొన్ని కులాలు, కొన్ని మతాలు మాత్రమే' అని అన్నారు. రెండోది కుల జన గణన లేదు అని, ఇది నిజమే 1931 తర్వాత దేశవ్యాప్తంగా కుల జనగణన జరగలేదు. కుల జనగణన చేయాలని ఏ రాజకీయ పార్టీ కోరదు. కానీ ఈ దేశంలో జనాభాలో బీసీలు 50 శాతం వున్నారనేది నిజం. 50 శాతం వున్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అనేది ఎట్లా న్యాయం అవుతుంది.

తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం ముస్లింలకు, ఎస్టీలకు, బీసీలకు పెంచుతామని అంటున్నది. ఇది రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో తెలంగాణ రిజర్వేషన్ల అంశాన్ని చేర్పించి చేస్తామంటున్నది. ఇది అంత సులభం కాదు. తెలంగాణ ఒక ప్రాంతీయ ఉద్యమాన్ని నడిపి విజయం సాధించింది. ఇప్పుడు రిజర్వేషన్ల సాధన కోసం మరో ఉద్యమాన్ని నడపాలి. కోర్టులకు శాసనాలు చేసే అధికారం లేదు, శాసనాలపై వ్యాఖ్యానించటం మాత్రమే కోర్టు బాధ్యత అనీ, ఈ దేశంలో వెనుకబాటుతనానికి కులమే ప్రామాణికమనీ ముందు కోర్టులు అంగీకరించే విధంగా చట్టపరమైన మార్పుల కోసం పోరాడాలి. అప్పుడే ముస్లింలకైనా, ఎస్టీలకైనా, బీసీలకైనా, ఎస్సీలకైనా పెరిగిన జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెరుగుతాయి.

సెల్ : 9963405555

శ్మశానంపై నేతల కన్ను

పి.ఎస్.రవీంద్ర
పగడాల లక్ష్మయ్య

- రూ.కోటి విలువైన భూమికి ఎసరు
- దళిత మహిళ శవాన్ని బొంద పెట్టనివ్వని వైనం
- రోజంతా శవ జాగరణ



శ్మశానవాటికలో తవ్వి వదిలేసిన బొందను పరిశీలిస్తున్న టీమాస్ బృందం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏండ్లు దాటింది. అయినప్పటికీ దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. ఉండటానికి గూడు లేకపోగా చనిపోతే బొంద పెట్టేందుకూ జాగా కరువైంది. దళిత మహిళ చనిపోతే బొంద పెట్టడాన్ని కాలనీవాసులే అడ్డుకునేలా 'అధికార' ప్రజాప్రతినిధులు వివక్ష పాటించారు. భూముల ధరలు పెరగడంతో శ్మశానాన్ని ఆక్రమించుకోవాలన్న దుర్బుద్ధి పుట్టింది. అందుకు కారణం.. అక్కడ ఉన్న భూమి ధర రూ.కోటికి చేరడమే. ఈ సంఘటన కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి శివారు గ్రామం దుబ్బలో చోటు చేసుకుంది.

చొప్పదండి మండల కేంద్రంలో ఇండ్ల స్థలాల కోసం దళితులు, బీసీలు, మైనార్టీలు కలిసి కమ్యూనిస్టుల నాయకత్వంలో ఏండ్ల తరబడి పోరాటాలు సాగించారు. దీంతో ఎట్టకేలకు 2008లో వెదురుగట్టు రోడ్డులోని 376, 378, 379 సర్వే నెంబర్లలోని 14 ఎకరాల భూమిని అక్కడి దళితులకు కేటాయించారు. ఇండ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాలు, శ్మశాన వాటిక ఇలా పలు సౌకర్యాల కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఒక్కొక్కరికీ 121 గజాల చొప్పున ఇండ్ల స్థలాలను 20 మందికి కేటాయించి పట్టాలిచ్చారు. దీంతో వారు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. కానీ పదేండ్లు గడిచినా ఇప్పటికీ వారికి అక్కడ స్వేచ్ఛ లేకుండా ఉంది. ఈనెల 8న దళితురాలైన మల్లారపు గంగా(32) మృతి చెందితే శ్మశాన వాటికకు కేటాయించిన భూమిలో ఖననం చేసేందుకు బొంద తవ్వారు. కానీ వీఆర్‌వో, పోలీసు అధికారులొచ్చి అడ్డుకున్నారు.

దీంతో దిక్కుతోచని స్థితిలో దూర ప్రాంతమైన భామనికుంటకు తీసుకెళ్లి బంధువు స్థలంలో ఖననం చేయాల్సి వచ్చింది. ఇదే కాలనీలో ఉంటున్న సుంకు రాజేశ్ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునే ప్రయత్నం చేస్తుండగా వీఆర్‌వో ద్వారా నిలిపివేయించారు. గుడారాలు, తాత్కాలిక రేకుల షెడ్లు కూలుతున్నాయనీ, పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు గ్రామ పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదనీ బాధితురాలు నెల్లి పోచమ్మ, పలువురు బాధితులు వాపోతున్నారు. ఊరికి దూరంగా ఉంచడం తోపాటు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా దళితులనే చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి దళితులకు స్కూలు సదుపాయం కూడా లేదు. బడికి వెళ్లాలంటే సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలి. కనీసం అంగన్‌వాడీ పాఠశాల కూడా లేదు. తాగు నీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. ఈ కాలనీ ఊరికి దూరంగా అడవి ప్రాంతంలో ఉంది. ఇక్కడి దళితుల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒకరు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దళితుల ఇండ్లపై ప్రత్యేకంగా ప్రయివేటు సిబ్బందితో నిఘా ఉంచినట్టు వాపోతున్నారు. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు ఖననం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇండ్ల నిర్మాణాలను అడ్డుకునే ప్రయత్నాలే నిదర్శనంగా చెప్పవచ్చు. బాధిత దళితులు అగ్రవర్ణాల దురహంకారాన్ని ఎదిరించలేకపోతున్నారు.

చొప్పదండి మండలంలో పర్యటిస్తున్న టీమాస్ ఫోరం పరిశీలనలో ఈ సంఘటన వెలుగుచూసింది. ఈ క్రమంలో బాధిత దళిత కుటుంబంతో కలిసి కరీంనగర్ కలెక్టరేట్ ముందు బైఠాయించారు. దీంతో అసలు విషయం బయటికి వచ్చింది. కాలనీలో ఉంటున్న వారే వ్యతిరేకించే అవకాశం లేదు. అందువల్ల దాని వెనుక ఉన్న కారణాలను వెతకడంతో ఆ భూమికి కొందరు నేతలు ఎసరు పెట్టిన వైనం బయటపడింది. టీమాస్ పోరం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు.

సెల్ : 9490099395, 9849868145



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీమాస్ బృందం

మా గోస చెప్పలేనిది



మా గోస చెప్పుకోలేనిది. నా భార్య గంగ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందింది. ఖననం చేసేందుకు బొంద తవ్వాం. తీరా పూడ్చిపెట్టే దశలో రెవెన్యూ, పోలీసులు అడ్డుకున్నారు. కాలనీవాసులు అభ్యంతరం చెబుతున్నారని అన్నారు. పుట్టెడు దు:ఖంలో శవ జాగరణ తప్పలేదు. రోజంతా వేసారి చివరికి రెండు కిలోమీటర్ల దూరం మోసుకెళ్లి ఖననం చేయాల్సి వచ్చింది. ఈ బాధ ఇంకొకరికి రాకూడదు.

లక్ష్మీనారాయణ, మృతురాలి భర్త

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ఆ భూమిలో శ్మశాన వాటికను ఏర్పాటు చేసి దళితులకు కేటాయించాలి. మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అక్కడి దళితులకే కేటాయించాలి. ఈ విషయంలో దళితుల పట్ల అధికారుల తీరు సరికాదు. ఏ దిక్కూ లేక బతుకీడుస్తున్న దళితులకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా నిలవాల్సిందిపోయి వారిని అక్కడి నుంచి తరిమేసే చర్యలకు పూనుకోవడం సరికాదు.

ముకుందరెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

పోరాడి సాధించుకున్న భూములవి




పేదలకు నివాసం లేదని పదేండ్ల కింద ప్రభుత్వంతో కొట్లాడి ఈ స్థలం సాధించుకున్నాం. కానీ నేడు పెత్తందారులు, అధికారులు కలిసి వారి నివాసాలను లాగేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో స్థానిక ఎంపీపీ భూంరెడ్డి హస్తం ఉన్నట్టు కనిపిస్తున్నది. మూడు కిలోమీటర్ల దూరంలోని శంబోనితాళ్ల, మంతాటి ప్రాంతాల్లో ఖననం చేసుకొవచ్చని వీఆర్‌వో ఉచిత సలహా ఇచ్చాడు. అవి చాలా దూరం ఉండడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని భామనికుంటలో ఖననం చేశారు. ఆ భూమి యజమానులు ఇక్కడికి మరోసారి ఎవ్వరినీ తీసుకురావద్దని, ఇదే చివరి సారని హెచ్చరించి ఖననానికి అంగీకరించారు.

అజయ్, టీమాస్ ఫోరం జిల్లా నాయకుడు

శ్మశాన వాటికకు ఇవ్వలేదు

ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది. దానిని శ్మశాన వాటికకు ఇచ్చినట్టు మా రికార్డుల్లో లేదు. ఈ భూమిని తమకు కేటాయించినట్టు గ్రామ కార్యదర్శి చెప్పారని బాధితులు చెబుతున్నారు. భూముల విషయంలో కార్యదర్శికి సంబంధం లేదు. వీఆర్‌వోగా తాను చెప్పాలి, నేనెప్పుడూ అలా చెప్పలేదు. అక్కడ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

రవి, వీఆర్‌వో


రోజర్ ఫెడరర్

స్విస్ యోధుడు మెల్‌బోర్న్‌లో సిక్సర్ కొట్టాడు. హోరాహోరీ ఫైనల్లో మారిన్ సిలిచ్‌పై గెలుపొంది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఐదు సెట్ల పోరాటంలో పైచేయి సాధించిన ఫెడరర్ కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. 36 ఏండ్ల వయసులో యువతరంతో తలపడటమే గొప్ప విషయమైతే, ఏడాదిని ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో మరోసారి ఘనంగా ఆరంభించటం ఫెడరర్‌కే చెల్లింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ రన్నరప్‌తో సరిపెట్టుకున్నది.

ఫెడరర్ సిక్సర్

- ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ స్విస్ యోధుడి వశం
- కెరీర్‌లో ఏకంగా 20 గ్రాండ్‌స్లామ్ కైవసం
- ఫైనల్లో మారిన్ సిలిచ్‌పై గెలుపు
- మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ రన్నరప్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2018

నవతెలంగాణ-మెల్‌బోర్న్

రాకెట్ చేతబట్టిన అలుపెరుగని యోధుడు, గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల మొనగాడు, స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ మెల్‌బోర్న్‌లో మెప్పించాడు. మారిన్ సిలిచ్ (క్రోయేషియా)తో ఫైనల్లో 6-2, 6-7(5-7), 6-3, 3-6, 6-1తో ఫెడరర్ మెరుపు విజయం సాధించాడు. వరుసగా రెండో ఏడాది పురుషుల సింగిల్స్ టైటిల్ సాధించిన రోజర్ ఫెడరర్.. మెల్‌బోర్న్‌లో ఆరోసారి విజేతగా అవతరించాడు. ఆరో సీడ్ సిలిచ్ మూడు గంటలకు పైగా ఫెడరర్‌కు పోటీనిచ్చినా.. అతడి విజయాన్ని అడ్డుకోలేకపోయాడు. ఫామ్, ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమైన ఫెడరర్ సుదీర్ఘ విరామం తర్వాత నిరుడే ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో మళ్లీ గ్రాండ్‌స్లామ్ వేట మొదలెట్టాడు. ఈ ఏడాదిని సైతం మెల్‌బోర్న్ విజయంతో ఆరంభించటం విశేషం. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత ఆటగాడు రోహన్ బోపన్న, బాబోస్ జోడీ పరాజయం పాలైంది. ఫైనల్లో 6-2, 4-6, 9-11తో పావిక్, డాబ్రోస్కీ జంటకు టైటిల్‌ను కోల్పోయి రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు.


బోపన్న జోడీ

ఫైనల్లో ఎవరెలా

సిలిచ్		ఫెడరర్
16	ఏస్‌లు	24
05	డబుల్ ఫాల్ట్స్	04
22	బ్రేక్ పాయింట్లు	46
45	విన్నర్లు	41
128	నెగ్గిన పాయింట్లు	152

ఎదురులేని ఫెడరర్ : మూడు గంటలకు పైగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మారిన్ సిలిచ్ ఆఖరు వరకూ పోరాడాడు. కానీ ఫలితమే అతడికి అనుకూలంగా రాలేదు. ఆరంభం నుంచీ దుమ్మురేపిన ఫెడరర్ తనదైన స్మాష్‌లు, బలమైన రిటర్న్స్‌తో రెచ్చిపోయాడు. సిలిచ్ రెండు సెట్లు నెగ్గినా.. ఓడిన మూడు సెట్లలోనూ దారుణం పరాజయం చవిచూశాడు. తొలి సెట్‌లో అనవసర తప్పిదంతో ఫెడరర్‌కు తొలి పాయింట్ కోల్పోయిన సిలిచ్, ఆఖరి సెట్లో బ్యాక్‌హాండ్ తప్పిదంతో మ్యాచ్ పాయింట్‌ను కోల్పోయాడు. ఆరంభంలో 4-0తో ఆధిక్యం సాధించిన ఫెడరర్ గెలుపు లాంఛనం చేసుకున్నాడు. 2-5తో సిలిచ్ రెండు పాయింట్లు సాధించినా అది పోటీకి సరిపోలేదు. 6-2తో తొలి సెట్ ఫెడరర్ సొంతమైంది. ఇక ట్రైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌లో సిలిచ్ పైచేయి సాధించాడు. 6-6తో సమవుజ్జీలుగా నిలిచిన తరుణంలో ట్రైబ్రేకర్‌లో 7-5తో సిలిచ్ ఆధిక్యం సాధించాడు. దీంతో రెండో సెట్ సిలిచ్ పరమైందిత. కానీ మూడో సెట్లో ఫెడరర్ తనెంటో చూపించాడు. కానీ సిలిచ్ పోరాటానికి తెరపడలేదు. 1-1, 2-2తో ఆసక్తిగా మొదలైన్ మూడో సెట్‌ను ఫెడరర్ తన చేతుల్లోకి తీసుకున్నాడు. వరుసగా మూడు పాయింట్లు సాధించి 5-2తో ముందంజ వేశాడు. ఈ సమయంలో సిలిచ్ ఓ పాయింట్ సాధించినా ఫలితం లేకపోయింది. 6-3తో ఫెడరర్ విజయానికి చేరువయ్యాడు. కీలక నాల్గో సెట్‌లో 6-3తో గెలుపొందిన సిలిచ్ ఆశలు సజీవంగా నిలుపుకున్నాడు. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక ఐదో సెట్‌కు దారితీసింది. 3-0తో దూసుకెళ్లిన ఫెడరర్.. ఆఖర్లో మరింత రెచ్చిపోయాడు. 1-3తో సిలిచ్ పాయింట్ల తెరిచినా.. మరో పాయింట్ సాధించలేకపోయాడు. వరుసగా మరో మూడు పాయింట్లు కొట్టేసిన ఫెడరర్ 6-1తో ఐదో సెట్‌ను, పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు.


మరుపురాని, మధురమే ఈ విజయం!

దక్షిణాఫ్రికాపై వాండరర్స్ టెస్టులో గెలుపొందిన కోహ్లిసేన.. డ్రెస్సింగ్‌రూమ్‌లో ఇలా సంబురాలు చేసుకున్నది. ఈ విజయం చాలా కాలం గుర్తుండిపోయేదని, ఆత్మవిశ్వాసంతో కూడిన నమ్మకమే విజయానికి మూలమని కెప్టెన్ కోహ్లి పేర్కొన్నాడు.


వాషింగ్టన్ సుందర్ రూ.3.20 కోట్లు


క్రిస్ గేల్ రూ. 2 కోట్లు


మహ్మద్ సిరాజ్ రూ. 2.60 కోట్లు

జయదేవ్ జాక్‌పాట్

రూ.11.5 కోట్లు పలికిన భారత బౌలర్


జయదేవ్ ఉనద్కట్ రూ.11.50 కోట్లు

- ఆసీస్ బౌలర్ అండ్రూ టై ధర రూ. 7.2 కోట్లు
- కృష్ణప్ప గౌతమ్‌కు రూ. 6.2 కోట్లు
- మహ్మద్ సిరాజ్‌కు రూ. 2.6 కోట్లు
- మూడో రౌండ్‌లో పంజాబ్ సొంతమైన గేల్
- ముగిసిన ఐపీఎల్ 11 ఆటగాళ్ల వేలం

కొందరు స్టార్ క్రికెటర్లు కోట్లు కొల్లగొట్టారు. కొందరు స్టార్స్‌కు అసలు అక్కరకురాని సరకుగా మిగిలిపోయారు. అనామకులనుకున్న ఆటగాళ్లు వేలంలో బ్యాంగ్‌బ్యాంగ్ అనిపించారు. భావోద్వేగాల నడుమ మరికొందరు ఆటగాళ్లకు స్థాయికి మించిన ధర దక్కింది. 578 ఆటగాళ్లలో 187 మందిని మాత్రమే ఫ్రాంచైజీలు తీసుకున్నాయి. కోట్ల చుట్టూ నడిచిన ఐపీఎల్11 ఆటగాళ్ల వేలం ఆదివారంతో ముగిసింది.

నవతెలంగాణ-బెంగళూర్


మురళీ విజయ్ రూ.2 కోట్లు


భారత బౌలర్ జయదేవ్ ఉనద్కత్ జాక్‌పాట్ కొట్టేశాడు. ఐపీఎల్ వేలంలో రూ. 11.5 కోట్లు పలికిన జయదేవ్ అత్యధిక మొత్తం దక్కించుకున్న భారత ఆటగాడిగా నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్ రూ.11.5 కోట్లు వెచ్చించి జయదేవ్‌ను జట్టులోకి తీసుకున్నది. కర్ణాటక స్పిన్నర్ కృష్ణప్ప గౌతం సైతం కండ్లుచెదిరే ధర సొంతం చేసుకున్నాడు. ఇతడికి సైతం రాజస్థాన్ రాయల్సే రూ. 6.2 కోట్లతో కొనుగోలు చేసింది. విదేశీ ఆటగాళ్లలో ఆస్ట్రేలియా బౌలర్ అండ్రూ టై రూ. 7.2 కోట్లు పలికాడు. హైదరాబాదీ రైజింగ్ స్టార్ మహ్మద్ సిరాజ్ రూ. 2.6 కోట్లకు బెంగళూర్ సొంతమయ్యాడు. వేలంలో భారత యువ ఆటగాళ్లు చెప్పుకోదగిన రీతిలో ధర దక్కించుకున్నారు. పొట్టి ఫార్మాట్ గ్లోబల్ హీరో క్రిస్ గేల్ మూడో రౌండ్ వేలంలో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సొంతమయ్యాడు.

ఔరా ఉనద్కత్ : నిరుడు ఐపీఎల్‌లో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ తరపున మెరిసిన జయదేవ్ ఉన్కదత్ ఈసారి వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. 2017 ఐపీఎల్ జట్టులో చోటు దక్కించుకున్న జయదేవ్ కోసం చెన్నై, ముంబయిలు పోటీపడ్డాయి. కానీ పది కోట్ల పరిధి దాటాక రాజస్థాన్ రాయల్స్ రంగంలోకి దిగింది. రూ. 11.5 కోట్లకు జయదేవ్‌ను సొంతం చేసుకున్నది. కృష్ణప్ప గౌతం సైతం రూ. 6.2 కోట్లకు రాయల్స్ జట్టులో చేరిపోయాడు. విండీస్ యువ సంచలనం ఎవిన్ లెవిస్‌ను ముంబయి ఇండియన్స్ తీసుకున్నది. అతడి కోసం ముంబయి రూ. 3.8 కోట్లు పెట్టింది. షాబాజ్ నదీమ్‌ను ఢిల్లీ రూ. 3.2 కోట్లకు, రాహుల్ చాహర్‌ను ముంబయి రూ. 1.9 కోట్లకు తీసుకున్నాయి. యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను కోహ్లి జట్టు కొనేసింది. రూ.3.2 కోట్లకు వాషింగ్టన్‌ను బెంగళూర్ సొంతం చేసుకున్నది. గత సీజన్‌లో సన్‌రైజర్స్ తరపున మెరిసిన బెన్ కట్టింగ్ రూ. 2.2 కోట్లకు ముంబయి సొంతమయ్యాడు. రూ. 2.4 కోట్లతో మోహిత్ శర్మను పంజాబ్ రైట్ టు మ్యాచ్ ద్వారా తిరిగి సొంతం చేసుకున్నది. సంచలన బౌలర్ సందీప్ శర్మ రూ. 3 కోట్లకు సన్‌రైజర్స్ క్లబ్‌లో చేరిపోయాడు. హైదరాబాద్ స్టార్ మహ్మద్ సిరాజ్ ఈ సారి బెంగళూర్ తరపున ఆడనున్నాడు. రూ. 2.6 కోట్లకు ఆర్‌సీబీ సిరాజ్‌ను తీసుకున్నది. కివీస్ మెరుపు ట్రెంట్ బౌల్ట్ రూ. 2.2 కోట్లకు ఢిల్లీ వశమయ్యాడు. రూ. 1 కోటికి డుమిని ముంబయికి, జోర్డాన్ హైదరాబాద్‌కు దక్కారు. ఆస్ట్రేలియా పేసర్ అండ్రూ టై కోసం పంజాబ్ ఏకంగా రూ. 7.2 కోట్లు ఖర్చు చేసింది. సఫారీ యువ పేసర్ లుంగి ఎంగడిని రూ. 50 లక్షలకే చెన్నై తీసేసుకున్నది. తొలి రౌండ్‌లో అమ్ముడుపోని మురళీ విజయ్ కనీస ధర రూ. 2 కోట్లకు చెన్నైకి వచ్చాడు. పార్థీవ్ పటేల్ సైతం రెండో రౌండ్లో రూ. 1.7 కోట్లకు బెంగళూర్‌కు వెళ్లాడు. ఆదిత్య తారె ముంబయికి, బిపుల్ శర్మ సన్‌రైజర్స్‌కు మళ్లీ కనీస ధర రూ. 20 లక్షలకే దక్కారు.

ఇంగ్లాండ్ స్టార్ ఆటగాళ్లు జో రూట్, ఇయాన్ మోర్గాన్‌లు రెండో రోజు వేలంలో సైతం అమ్ముడుపోలేదు. యార్కర్ల కింగ్ లసిత్ మలింగ సైతం ఈ సీజన్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. కెరీర్ ఫామ్‌లో కొనసాగుతున్న హషీమ్ ఆమ్లా, మార్టిన్ గప్టిల్, ఇషాంత్ శర్మను ఎవ్వరూ తీసుకోకపోవటం గమనార్హం.


బెన్ కటింగ్ రూ.2.20 కోట్లు


అండ్రూ టై రూ.7.20 కోట్లు


శార్దూల్ ఠాకూర్ రూ.2.60 కోట్లు


కృష్ణప్ప గౌతమ్ రూ.6.20 కోట్లు

రైనాకు పిలుపు

సఫారీలతో టీ20 జట్టు ఎంపిక

ముంబయి : దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచుల టీ20 సిరీస్‌కు సురేశ్ రైనా జాతీయ జట్టు పిలుపు అందుకున్నాడు. దేశవాళీ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అజేయ సెంచరీ బాదిన రైనా.. ఆకట్టుకునే ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు. ఇటీవల యోయో పరీక్షలో సైతం పాసైన రైనా.. తాజా ఫామ్‌తో టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. యువ ఆటగాడు, శ్రీలంకతో సిరీస్‌లో ఆకట్టుకున్న శ్రేయాష్ అయ్యర్‌కు సెలక్టర్లు మొండిచెయ్యి చూపించారు. బౌలర్ షార్దుల్ ఠాకూర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆరు మ్యాచుల వన్డే సిరీస్ తర్వాత ఫిబ్రవరి 21 నుంచి టీ20 సమరం షురూ కానున్నది.


సురేశ్ రైనా

భారత టీ20 జట్టు

విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, కెఎల్ రాహుల్, సురేశ్ రైనా, ఎం.ఎస్ ధోని, దినేశ్ కార్తీక్, మనీశ్ పాండే, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, జశ్‌ప్రీత్ బుమ్రా, జయదేవ్ ఉనద్కత్, షార్దుల్ ఠాకూర్.

ఫైనల్లో భంగపాటు

తైజు యింగ్ చేతిలో సైనా ఓటమి

జకర్తా : ఏడాది విరామం ఓ ఫైనల్లో అడుగుపెట్టిన భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు టైటిల్ పోరులో భంగపాటు. వరల్డ్ నెం. తైజు యింగ్ (చైనీస్ తైపీ) వరుస గేముల్లో సైనాపై అలవోక విజయం సాధించింది. సైనా బలహీనతను మరోమారు సొమ్ముచేసుకున్న తైజు యింగ్ ఆమెపై వరసగా ఏడో విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 9-21, 13-21తో సైనా నెహ్వాల్ పరాజయం పాలైంది. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన సైనా నెహ్వాల్ ఫైనల్లో నిరాశపరిచింది.


ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్

సైనా నెహ్వాల్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.